ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్





# యుగశక్తి గాయత్రి



ఓం వందే భగవతీం దేవీం శ్రీరామంచ జగద్గురుం
పాదపద్మే తయోః శ్రిత్వా ప్రణమామి ముహుర్ముహుః

ప్రఖర ప్రజ్ఞ

సజల శ్రద్ధ

సంకల్పం - సంరక్షణ
వేదమూర్తి, తపోనిష్ఠ, పండిత
**శ్రీరామ శర్మ ఆచార్య**
శక్తి స్వరూపిణి
**మాతా భగవతీ దేవి శర్మ**

ప్రధాన సంపాదకులు
డా॥ ప్రణవ్‌పండ్యా
సంపాదకులు
బి.సి హెచ్.వి. సుబ్బారావు
(అశ్విని)
ఉప సంపాదకులు
ముక్కామల రత్నాకర్
సంపాదక మండలి
సాధన నరసింహాచార్య
శ్రీమతి లక్ష్మీరాజగోపాల్
డి.వి.ఆర్. మూర్తి

సంపుటి 19 - సంచిక 10
మార్చి 2015

పత్రిక అందనివారు మరియు
పత్రికకు సూచనలు, సలహాలు
ఇవ్వదలచినవారు ఈ క్రింది
ఫోన్ నంబర్లలో సంప్రదించగలరు
040-23700722
99491 11175
94407 69798

## భయము అనే భ్రాంతి

ఎందుకో తెలియదుగానీ ప్రతిఒక్కరు భయభీతులవుతారు, భయపడతారు. తెలిసో-తెలియకో భయం గుప్పెట్లోనే జీవిస్తుంటారు. లేస్తున్నా, కూర్చుంటున్నా, నిద్రిస్తున్నా, మెలకువగా ఉన్నా భయం వెన్నాడుతూ ఉంటుంది. ప్రతి పనిలోను, భావనలోను, ఆలోచనలు-వ్యవహారములోను భయం తొంగిచూస్తూ ఉంటుంది.

భయము అనగా మన అస్తిత్వము లేకుండాపోతుంది, నశించిపోతుంది, సమాప్తమైపోతుంది అన్న సందేహము! ఈ సందేహమును పటాపంచలు చేసే ప్రయత్నం జీవితమంతా కొనసాగుతూనే ఉంటుంది. జీవితమంతా ఆ ప్రయత్నములోనే ఉరుకులు-పరుగులు పెట్టినప్పటికీ పరిస్థితి యథాతథముగానే ఉంటుంది. సమయం ఆసన్నము కాగానే మృత్యుఘడియలు వచ్చితీరుతాయి.

నిజానికి మృత్యభయము అంటే జీవితమును కోల్పోతామనే భయమే! నా శరీరము, నా సంపద, నా యశస్సు, నా కీర్తిప్రతిష్ఠలు, నా సంబంధ-బాంధవ్యములు, నా సంస్కారములు, నా విశ్వాసములు, నా ఆలోచనలు ఇవన్నీ నా యొక్క 'నేను'కు ప్రాణముగా మారుతాయి. ఇవన్నీ 'నేను'గా అయిపోతాయి. మృత్యువు ఈ 'నేను'ను లాక్కొనిపోతుంది. భయం అంటే ఇదే! అయితే వాస్తవానికి ఈ భయం ఒక భ్రాంతి తప్ప మరేమీ కాదు. ఎందుకంటే 'నేను' అని మనము దేనిని అంటున్నామో, వింటున్నామో, అర్థము చేసుకుంటున్నామో అదంతా అసత్యము!

ఈ అబద్ధపు భ్రాంతిని తొలగించుకొని సత్యానుభూతిని పొందాలంటే అసత్యపు తాదాత్మ్యాలన్నింటినీ త్రెంచుకోవాలి. ఒకవేళ మనం కనుక ఇప్పటివరకు 'నేను' అనే దానిగా అర్థం చేసుకుంటున్న సమస్త తథ్యముల పట్ల అప్రమత్తతను పొందినచో తాదాత్మ్యపు భ్రాంతులన్నీ పటాపంచలైపోయి, నిజమైన 'నేను' యొక్క అనుభూతి కలుగుతుంది. అట్టి యథార్థమైన 'నేను'ను ఎవ్వరు, ఎన్నడు చెరిపివెయ్యలేరు. ఈ నిజమైన 'నేను' అనే అనుభూతి కలుగుట చేత భయం నుండి సంపూర్ణమైన ముక్తి లభిస్తుంది.

*- అఖండజ్యోతి, సెప్టెంబర్ 2010*
*అనువాదం: శ్రీమతి లక్ష్మీరాజగోపాలు*

**మనిషి స్వార్థాన్ని జయించిననాడు ఈ పృథ్వీ స్వర్గం అవుతుంది**

# విషయ సూచిక


1. **సంపాదకీయం :** భయం అనే భ్రాంతి 3

2. **విషయసూచిక-సద్గురువాణి :**
ఆలోచనల కన్నా అలవాట్లు బలమైనవి 4

3. **వేదమంత్రం :** ఇచ్ఛాశక్తి 5

4. **అశ్వమేధం-1 :**
అశ్వమేధ శృంఖల-మహాకాలుని ప్రతిజ్ఞ ఉత్తరార్థం 6

5. **పరమపూజ్య గురుదేవుల సుదీర్ఘయాత్ర - 33 :**
ఆశీస్సులు, వాగ్దానాలు 8

6. **కుండలినీ మహావిజ్ఞానం-18 :**
కుండలినీ సాధన యొక్క మర్మము, మార్గదర్శనం 12

7. **శబ్దబ్రహ్మ - నాదబ్రహ్మ - 6 :**
శబ్దాలకుండే ప్రచండశక్తి 14

8. **జీవన దేవత సాధన, ఆరాధన - 7 :**
జీవన సాధనకు మూల సూత్రాలు-2 15

9. **ఉగాది ప్రత్యేకం :**
సామూహిక సాధన ప్రాముఖ్యత 20

10. **వ్యక్తి నిర్మాణం :**
ఆత్మవిశ్వాసమే ఆశావహుల ఆభరణం 22

11. **కుటుంబ నిర్మాణం :** ధర్మపత్నిని ఉపేక్షించరాదు 25

12. **ఉగాది ప్రత్యేక సందేశం** 27

13. **భవిష్యత్తులో మానవుడు ఎలా ఉంటాడు?** 31

14. **బోధ కథ :** గృహస్థాశ్రమంలోనే ఉన్న సద్గురువు 35

15. **సాధనా విజ్ఞానం :**
యోగసాధనకు రెండు రథచక్రాలు 39

16. **సమాజ నిర్మాణం :** సంస్కారపూరితమైన విద్యయే
బాలబాలికల యొక్క నవనిర్మాణం కావిస్తుంది 42

17. **పూజ్య గురుదేవుల అమృతవాణి:**
లోకశిక్షకుల జీవనోద్దేశ్యం, లక్ష్యం - 3 44

18. **నా వారితో నా మాట :**
మహాశివరాత్రి యొక్క రహస్యం 47

19. **స్ఫూర్తిదాయక గాయత్రీ పరివార్ సభ్యులు - 11** 51

20. **వార్తలు :** రాష్ట్రంలో జరిగిన వివిధ కార్యక్రమాలు 53




## సద్గురు వాణి

### ఆలోచనల కన్నా అలవాట్లు బలమైనవి

ఆలోచనలు దిశను ఇస్తాయి,కానీ సామర్థ్యం అలవాట్లపై ఆధారపడి ఉంటుంది. కొన్ని అలవాట్లు ఒక క్రొత్త దిశవైపు ప్రోత్సహిస్తుంటాయి. జీవితం లోని సమస్యలను ఎదుర్కొనేందుకు దిశానిర్దేశం చేస్తాయి. కానీ కొన్ని అలవాట్లు కొంపముంచుతాయి. మద్యసేవనం లాంటిది ఆరోగ్యాన్ని, సంపదను హరిస్తుంది. దీనిని వదిలి పెట్టాలని ఉన్నా వదలలేరు. ఎందుకంటే ఆలోచనల కంటే అలవాట్లు బలమైనవి. తెలిసి తెలిసి చెడు అలవాట్ల జోలికి పోకండి. మంచి అలవాట్లు చేసుకోండి.


## యుగశక్తి గాయత్రి

**విడి ప్రతి రూ॥ 15/-** **సం॥ చందా రూ॥ 150/-**
**3 సం॥ చందా రూ॥ 420/-** **10 సం॥ చందా రూ॥ 1300/-**

చందా రుసుమును ఎట్ పార్ చెక్ ద్వారా (at par cheque) లేక డి.డి.ద్వారా కాని పంపగలరు. యం.ఒ. ద్వారా కూడా పైకం పంపించవచ్చు. కానీ యం.ఒ. ద్వారా వచ్చినప్పుడు పూర్తి అడ్రస్సు ఉండుట లేదు. అందువలన యం.ఒ. ద్వారా పైకం పంపినప్పుడు క్రింద ఇచ్చిన ఫోన్ నంబర్లను సంప్రదించి మీ వివరాలు అన్నీ ఇవ్వ ప్రార్థన. రూ. 5,000 లేక అంతకన్నా ఎక్కువ పంపదలచుకున్నప్పుడు ఆన్‌లైన్ ద్వారా పంపవచ్చును. దీనికన్నా తక్కువ పంపే వారు, రూ. 50/- అదనంగా చేర్చి పంపాలి.

ఖాతాపేరు: **శ్రీ వేదమాత గాయత్రీ ట్రస్టు**
బ్యాంకు పేరు: **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**
**ఎర్రగడ్డ శాఖ, హైదరాబాద్**
ఖాతా నెం.: **32506416087**
IFSC Code: **SBIN-0013272**

ఆన్‌లైన్‌లో పంపినప్పుడు బ్యాంక్ చలానా జిరాక్సు కాపీని మీ చిరునామా తెలుపుతూ తప్పక మాకు పంపించాలి.

**"శ్రీ వేదమాత గాయత్రీ ట్రస్టు"**
**గాయత్రీ చేతనా కేంద్రము,** హెచ్.పి. రోడ్, మూసాపేట
అశ్విని హౌస్ దగ్గర, హైదరాబాదు - 500 018.
ఫోన్: 040-23700722, సెల్: 9949111175


**అనుభవం నుంచి పాఠాలు నేర్చుకున్నవారే ఉన్నత స్థానాలకు ఎదుగుతారు**

## వేదమంత్రం

# ఇచ్ఛాశక్తి

**యేన దేవాః పవిత్రేణాత్మానం పునతే సదా ।**
**తేన సహస్రధారేణ పావమానీః పునన్తు నః ॥**

***- (సామవేదం 1302)***

**భావార్థం :** ఆత్మిక, మానసిక దోషాలను త్యజించి, నిర్మలము, పవిత్రముగా ఉండుటలోనే మనుష్య జీవన సాఫల్యము ఉన్నది. ఆత్మ బలోపేతమగుటకు వేదములలో అనేక ఉపాయములు వర్ణించబడినవి. అందువలన అవి పఠనీయములు.

**సందేశం :** ఈ మానవ జీవనము ఎన్ని పుణ్యకర్మముల ఫల స్వరూపముగా ప్రాప్తించినదో మనకు తెలియదు. దీనిని సత్కర్మలలో ఉపయోగించినపుడే మనుష్యుడు శాశ్వత ఆనందాన్ని పొందగల్గుతాడు. వేదాలలో అనేక నీతివాక్యాలున్నవి, వాటి సారాంశము- జీవితంలో మనుష్యుడు ఎల్లప్పుడూ ఎదగాలని! అతడెన్నడూ పతనోన్ముఖుడు కాకుండుగాక! ప్రతి మనుష్యుని కర్తవ్యము అతడు అన్ని దుర్గుణాలను త్యజించగలగాలి. స్వార్థము, లోభము, మోహము, అహంకారము మొదలైన దుర్గుణాలు ఆత్మను చుట్టుముట్టి ఉంటాయి. వీటి నుండి విముక్తి పొందుటకు దృఢ ఇచ్ఛాశక్తి యొక్క ఆవశ్యకత ఉన్నది. అప్పుడు మాత్రమే ఆత్మ నిర్మలము, పవిత్రము కాగల్గుతుంది.

వేదమంత్రాలలో ఇచ్ఛాశక్తి దృఢత్వము గురించి అత్యధికంగా చెప్పబడింది. తపస్సు, సాధన, కఠిన పరిశ్రమల చేత మనస్సును లగ్నము చేయుట ద్వారానే మనుష్యుడు తన సమస్త ఇచ్ఛాశక్తులను దృఢతరం చేసుకొనగల్గుతాడు. మహత్వాకాంక్ష మనుష్యుని ప్రాణ శక్తికి కొలమానం. దానితోపాటు త్యాగము, బలిదానముల భావన తోడవ్వాలి. తపస్సు, సాధన ద్వారా మనుష్యుడు ఇటువంటి తన ఇచ్ఛను పూర్తిచేసుకొన్నప్పుడు పరోపకార కార్యములు చేసి తన జీవితాన్ని సఫలం చేసుకోగల్గుతాడు. ఏ వ్యక్తి జీవన సాఫల్యమైనా అతని ఇచ్ఛాశక్తి వికాస నిష్పత్తిలోనే ఉంటుంది. ప్రకృతి శక్తులు కూడా మానవీయ ఇచ్ఛాశక్తి ముందు తలవంచుతాయి. ప్రపంచములోని సభ్యతా వికాసము, మనుష్యుని సమస్త కార్యకలాపాలు, భౌతిక ఉపలబ్ధులు మానవీయ ఇచ్ఛాశక్తి ద్వారా లభించినవే.

మనిషిలో ఇచ్ఛాశక్తి అతని శీలంనుండి ఉత్పన్నమౌతుంది. ఆ శీలము అతని కర్మల నుండి రూపొందుతుంది. అందువలన ఎటువంటి కర్మలు చేస్తామో, ఇచ్ఛాశక్తి వ్యక్తీకరణ కూడా అటువంటిదే అవుతుంది. నైతికజీవనం జీవించుట లాభదాయకమని మనకందరకు తెలుసు. కానీ మనం పాపకర్మలు చేస్తున్నాము. తరువాత దాని ఫలం మనం అనుభవించవలసివస్తున్నది. కర్మఫలం నుండి తప్పించుకొనే మార్గమే లేదు. మన రోజువారీ జీవితంలోని మూలభూతమైన ఆపదలకు మూలము ఏదో ఒక దుష్కర్మ మరియు మన సంకల్పలోపమని తెలుసుకోవాలి. ఏ వ్యక్తి చెడు ఆలోచనలను జయిస్తాడో అతడు తప్పక తన అమోఘ ఇచ్ఛాశక్తికి యజమాని అవుతాడు.

దారి తప్పి తిరుగుతున్న ప్రాణి తాను ఆత్మనని, శరీరం కాదని తెలుసుకున్నప్పుడు అతడు శక్తిశాలి అవుతాడు. తన ఆత్మలో ఈశ్వరుడు నివసిస్తున్నాడని తెలుసుకొన్నప్పుడు అతనిలో అద్భుత ప్రచండశక్తి ఉత్పన్నమవుతుంది. ఈ శక్తే మానసిక దోషాలను వదలివేయుటకు కావలసిన సామర్థ్యాన్ని ఉత్పన్నం చేస్తుంది. దుర్గుణాల నుండి, దుష్ప్రవృత్తుల నుండి ముక్తి పొందిన మనుష్యునిలో సాత్విక దివ్య భావధార ప్రవహించి, చెడును ఎదుర్కొనటానికి ఉత్సాహాన్ని ఇస్తుంది.

చెడును మూలంతో సహా పెరికివేయి, మంచిని పోషించు అనే వేదాల ఆదేశమును ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలి.

★★★

## పండుగలు

**మార్చి 2015**

**05-03-2015 హోలి**

**21-03-2015 ఉగాది**

**28-03-2015 శ్రీరామనవమి**

**ఏప్రిల్ 2015**

**02-04-2015 మహావీర్ జయంతి**

**03-04-2015 గుడ్ ఫ్రైడే**

**23-04-2015 ఆదిశంకరాచార్య జయంతి**

శ్రమజీవి శరీరం నుండి వెలువడిన చెమట ప్రపంచాన్ని పోషిస్తుంది



అశ్వమేధం - 1

# అశ్వమేధ శృంఖల - మహాకాలుని ప్రతిజ్ఞ ఉత్తరార్థం

అఖండజ్యోతి మాసపత్రిక మొదటి ప్రతులలో గాయత్రీ ఉపాసన గురించి ఉండేది. అప్పుడు మొదటి పేజీలో ముద్రించబడే గాయత్రీ మాత చిత్రపటము క్రింద ఇలా వ్రాసి ఉండేది. "సందేశ్: స్వర్గ్ కా నహీ ధరా పర్ లాయి? ఇస్ ధరతీ కోహీ స్వర్గ్ బనానే ఆయీ" (సందేశం: భూమిపైకి స్వర్గాన్ని తెచ్చుట కాదు! భూమిని స్వర్గంగా మార్చుటయే) ఈ గర్వోక్తిని అప్పుడు ఎవ్వరూ విశ్వసించకపోయినప్పటికి కాలాంతరములో మహాకాలుడు ఈ దేవసత్తాను ఏవిధముగా ఇంటింటికి తీసుకువెళ్ళి ప్రతిష్ఠింప చేయుచున్నాడో అది మన అందరి ముందు ఉన్న రహస్యము.

పూజ్యగురుదేవుల రోమరోమము గాయత్రీమయం, జీవితమంతా ఆ దేవి లీలలనే గానము చేసిన ఆ దేవపురుషుడిని చివరికి ఆ తల్లి తన ఒడిలోనే చేర్చుకుంది. మహాప్రయాణానికి ముందు స్థూలశరీరంతో చేయలేని పనిని, ఇప్పుడు చేసిన పని కంటే లక్షల రెట్లు పనిని తన కారణసత్తా చేస్తుందని ఉద్ఘోషించారు.

మహాకాలునికి ఎవరి నిరీక్షణతో పనిలేదు. మేలుకొని తనను అనుసరించేవారి మీద అనుగ్రహాన్ని వర్షిస్తాడు. శ్రద్ధాంజలి సమారోహము, తరువాత ఒక సంవత్సరములోనే సంపన్నమైన శక్తిసాధన, దాని పూర్ణాహుతిగా జరుపబడిన శపథ సమారోహ కార్యక్రమాలలో లక్షలమంది దేవసంస్కృతిని ఇంటింటికి జేరవేస్తామని తీసుకున్న ప్రతిజ్ఞలు ఈనాటి దేవసంస్కృతి దిగ్విజయయాత్రల దశ అశ్వమేధాల ఘోషణగా పరిణతి చెందాయి. ఇక్కడ నుంచి మహాకాలుని యుగనిర్మాణ సంకల్పము యొక్క ఉత్తరార్థము ప్రారంభమయింది. లక్షా ఇరవైవేల మందికంటే పై చిలుకు 1992 జూన్ 6,7,8 తేదీలలో ఒకేచోట ఒకే స్వరముతో తీసుకున్న ప్రతిజ్ఞను భారతదేశంలో వ్యాపించి ఉన్న అనేక గాయత్రీశక్తిపీఠాల వద్ద జరిగిన సమ్మేళనాలలో ఎంతోమంది పరిజనులు ఈ ప్రతిజ్ఞను తీసుకున్నారు. "దేవసంస్కృతి దిగ్విజయము" యొక్క ఈ బ్రహ్మాండమైన ఉద్ఘోషణ ప్రపంచమంతటా ఎంత విస్తరించిందంటే పృథ్వి యొక్క నలుమూలల నుంచి ఒకే శబ్దం వినిపిస్తోంది. అది - యుగపరివర్తన, దేవసంస్కృతి దిగ్విజయము, అశ్వమేధము, అశ్వమేధము, అశ్వమేధము

అశ్వమేధయజ్ఞము ఈ యుగము యొక్క అసాధారణ కర్తృత్వము. దీనిని వ్యక్తి వ్యక్తివద్దకు తీసుకొనివెళ్ళుటకు దేవ సముదాయాలన్ని కృషిచేయాలి.

### దేవసంస్కృతి దిగ్విజయము - దేవాసుర సంగ్రామము

కలియుగము యొక్క విశిష్ట లక్షణము పాపం చేయుట అనేడిది ఒక భ్రాంతి. నిజానికి నేటి దురాచరణ, జరిగిన యుగముల పునరావృత్తి మాత్రమే. యుగముల కాలచక్ర భ్రమణము కూడా ఒకేవిధమైన నియమాలను అనుసరిస్తుంది. సత్య, త్రేతా, ద్వాపర యుగాలలో కూడా దుష్ప్రవృత్తులు భయంకరంగా ప్రాదుర్భవించాయి. వాటి నివారణ కూడా ఒకేలాగ జరిగింది. వాటిని పూర్వకాలంలో దేవాసుర సంగ్రామం అనేవారు. అతి శక్తివంతమైన అసురీశక్తులను సంఘటితమైన దేవశక్తుల సహాయంతో ఓడించుట ద్వారా దేవత్వము పునఃస్థాపించబడేది.

ఋషుల రక్తబిందువులతో రావణవధకు కారణమైన సీత ఆవిర్భవించింది. అనేకమార్లు అసురులను ఓడించటానికి భగవతి దుర్గాదేవి ఆవిర్భావము మార్కండేయపురాణములోని 73 వ అధ్యాయం నుంచి 85 వ అధ్యాయం వరకు అతి భావనాత్మక, అలంకారిక వర్ణన ద్వారా లభిస్తుంది. మానవ చేతనత్వము యొక్క ప్రాణసత్తా ఈ శక్తి యొక్క ఒక అర్థం కూడా. దీనినే ప్రాణముల గంగోత్రి-గాయత్రీ లేక దేవత్వ బీజము లేక వేదమాత, దేవమాత అని కూడా అన్నారు.

మానవ జీవితములో శ్రద్ధా, విశ్వాసాలు నశించినప్పుడు సామాజిక జీవితము ఏవిధంగా అదుపుతప్పి విషమ పరిస్థితులు ఏర్పడతాయో మధుకైటభ వధ తెలుపుతుంది. విష్ణుమూర్తి సాధించలేనిదానిని శక్తి స్వరూపిణి ఆద్యశక్తి, అసురులను

**చిత్తశుద్ధితో కృషి చేస్తే విజయం, ఆనందం వాటంతట అవే వస్తాయి**

మోహింపచేసి తమ నాశనాన్ని తామే కోరుకునేటట్లు చేస్తుంది. ఆ మహామాయ శక్తి విశేషణాలన్ని గాయత్రీమాత విశేషణాలే.

మహిషాసుర వధలో మహాశక్తి వద్దకు పంపించబడిన సేనాపతుల పేర్లు భౌతిక కోరికలతో మదాంధులైన వ్యక్తుల అలంకారిక నామములే. చిక్షురుడు (పురుగుల వలె సంకీర్ణ జీవనము జీవించేవారు), చామరుడు (శారీరిక సౌందర్యానికే ప్రాముఖ్యతనిచ్చేవారు), ఉదగ్రుడు (ఉదరపరాయణులు), మహాహనుడు (దేనినైనా చంపివేసి తినేవారు), అసిలోమ (రోమ రోమములో హింస నిండి ఉన్నవారు). ఇటువంటి సేనాపతులు ముందు ఆక్రమణ చేస్తారు. వారందరూ చనిపోయిన తరువాత తన అంగరక్షకులైన దుర్ధరుణ్ణి (ఆతతాయిలు), దుర్ముఖుణ్ణి (కుటిల ప్రవర్తన కలవారు), మహిషాసురుడు యుద్ధానికి పంపిస్తాడు. తదనంతరము స్వయంగా మహిషారుడు (పంచ తత్త్వములతో నిర్మించబడిన మనస్సు-సంవేదనాశీలత కోల్పోయి రాక్షసుడైన వ్యక్తి) యుద్ధానికి వస్తాడు. వీటన్నింటిని నాశనము చేసి మనస్సును సుసంస్కృతము చేసే ఆ మహామాయ తేజస్సునే గాయత్రి అని పిలుస్తారు. ఈ శక్తి ఆధారము వల్ల కుసంస్కారరూపులైన దైత్యులు నశించి చివరకు మహిషాసురుడు దేవి యొక్క దివ్యజ్యోతిలో లీనమైపోతాడు. ఇక్కడ దేవతలు చేసిన స్తుతిలోని అర్థము గాయత్రీమంత్రములో లభిస్తుంది.

మూడవ కథలోని శుంభ నిశుంభల వధ అంతరార్థము దేవతలు మళ్ళీ మహాదేవి శరణు కోరుట, దేవశక్తుల సంఘటీకరణ ద్వారా ధూమ్రలోచన (స్పష్టముగా సత్యమును చూడలేక పోవుట) వధ, రక్తబీజవధ (అసురత్వాన్ని భూమిమీద ఒక బిందువుకూడా లేకుండా చేయుట) ఆ తరువాత సమస్త శక్తులను తనలోనే ఏకీకరణచేసి శుంభ నిశుంభల వధ (సమస్త దేవతాశక్తులు ఒకే బిందువు నుంచి ఉద్భవించటం తెలుపుతుంది) జరుగుతుంది.

దుర్గాసప్తశతి పేరుతో విఖ్యాతమైన మార్కండేయ పురాణములోని ఈ వాస్తవాలు జరిగిన మూడు కాలాలలో ఆద్యశక్తి గాయత్రి దేవశక్తిస్థాపన ఎలా చేసిందో తెలుపుతుంది.

తన పరాప్రకృతి స్వరూపములో ఈ మహాసత్తా శ్రద్ధాంజలి సమారోహములో దేవపుత్రుల ఆర్తి నాలించి ఇప్పుడు అవతరించింది. శపథసమారోహము యొక్క దుర్గా స్వరూపము ఆమె వరదానమే! దానితో ఉత్సాహము పొందిన దేవసముదాయము దేవసంస్కృతి దిగ్విజయయాత్ర ఘోషణ చేసింది. ఈ యజ్ఞ పరంపరలు తాంత్రికదృష్టిలో సూర్య చక్రములో కేంద్రితమై ఉపాసనదృష్టితో సవితా ప్రధానమై జరుగుతాయి.

అశ్వమేధయజ్ఞముల విధానము ఈ దేవాసుర సంగ్రామ పరిధిలోకే వస్తుంది. దేవసంస్కృతి ఒక ధర్మము కాదు. అది సత్ చింతనము, సత్ కర్మల, సద్ వ్యవహారాల మారుపేరు.

★★★

## చిరస్మరణీయుడు డా॥ విలియమ్ వారేల్

*అమెరికాలోని రోచెష్టర్ నగరంలోని “మేయో హాస్పిటల్” ఈనాడు సాటిలేని మేటి ఆసుపత్రిగా ఖ్యాతి గాంచింది. ఈ ఆసుపత్రిని నాలుగు తరాల వెనుక డా॥విలియమ్ వారేల్ తన ఇంట్లోనే తన కుటుంబ సభ్యులతోనే ప్రారంభించటం జరిగింది. రోగుల పట్ల పూర్తి శ్రద్ధ, హృదయం నిండుగా సానుభూతి పెట్టుబడిగా పెట్టి విలియమ్ చేసిన చిన్న ప్రయోగం ఆశ్చర్యాన్ని కలిగించి అంచనాలకందని రీతిలో అభివృద్ధిని సాధించింది. ఈ ఆసుపత్రిలో ఈనాడు 900 మంది సర్జన్‌లు, 338 మంది ఫిజీషియన్‌లు, 575 మంది సాధారణ వైద్యులు ఉన్నారు. దేశవిదేశాల నుండి వచ్చి తమ అసాధ్య రోగాలకు వైద్యం చేయించుకునే రోగుల సంఖ్య సాలుసరి 1,80,000 వరకు ఉంటుంది. ఆకాశాన్ని తాకేటట్టు ఉండే ఈ ఆసుపత్రి భవనాలలో ఒక మంచి వైద్య కళాశాల కూడా ఉన్నది. విశేషమేమిటంటే ఈ ఆసుపత్రిలో వైద్యులు రోగిపట్ల సాధ్యమైనంత ఎక్కువ సానుభూతి చూపుతూ సేవ చేసేటట్లుగా శిక్షణనీయబడుతూ ఉంటుంది. అంతేగాక డా॥ వారేల్ యొక్క నాలుగు తరాలవారు ఈ భావాలతో, ఇదేవిధంగా జీవితాలు గడపడం అత్యంత గొప్ప విషయం. ఆదర్శవంతమైన ఇలాంటి సంస్థను తరతరాలుగా సంరక్షిస్తూ వస్తున్నందుకు వీరు సదా చిరస్మరణీయులు.*

– ప్రజ్ఞాపురాణం నుండి

*అనువాదం: శ్రీమతి నేమాని గౌరీసావిత్రి*


**బయట ప్రపంచాన్ని యథాతథంగా స్వీకరించాలి**

## పరమపూజ్య గురుదేవుల సుదీర్ఘయాత్ర-33

# ఆశీస్సులు, వాగ్దానాలు

### తండ్రి అయిన శ్రీరామ్

1932 ఆగస్టు నెలలో ఒకరోజు మధ్యాహ్నం. ఆగ్రా సెంట్రల్ జైలులోని సందర్శకుల గదిలో ఆవల్‌ఖేడా నుంచి వచ్చిన గోపీనాథ్ తన మిత్రుడు శ్రీరామ్‌ను కలుసుకోవడానికై కూర్చొని ఉన్నాడు. జనం వంతులవారీగా తమ బంధు మిత్రులను కలుసుకోవడానికై వెళ్తున్నారు. రాజకీయ ఖైదీలకు బయటికివచ్చి తమ వారిని కలుసుకునే స్వేచ్ఛ లేదు. గోపీనాథ్ పేరు పిలుస్తూ అక్కడున్న రక్షకభటుడు ఇలా చెప్పాడు. "మీ బంధువు శ్రీరామ్ 23 అంకె గల గదిలో వేచిచూస్తున్నాడు. పది నిమిషాలలో మీ సంభాషణ పూర్తికావాలి సుమా! గుర్తుంచుకో! ఆలోగానే మీ సమావేశం ముగియాలి"



గోపీనాథ్ 23 అంకె గల గదికి వెళ్ళాడు. అక్కడ శ్రీరామ్ తమ సహచర స్వరాజ్య సమర యోధులతో మాట్లాడుతున్నారు. ఆయన ఎదురుచూస్తున్న లక్షణం ఎక్కడా కానరావడం లేదు. ఆయన ఆ సంభాషణలో మునిగివున్నారు. గోపీనాథ్ అడుగుల సవ్వడి వినగానే శ్రీరామ్ లేచి అతడిని కౌగలించుకున్నారు. "బాగున్నావా?" అంటూ వీపు తట్టుతూ ప్రశ్నించారు. శ్రీరామ్‌ను ఖైదీ దుస్తులలో చూచి గోపీనాథ్ స్తబ్ధుడైపోయాడు. అతడి నోట మాట రాలేదు. కళ్ళనీళ్ళ పర్యంతమైనాడు. అతడు తన నోరువిప్పకముందే శ్రీరామ్ గ్రామంలోని, ఇంటిలోని, మిత్రబృందంలోని అందరి క్షేమ సమాచారాలు అడుగుతూ ప్రశ్నలవర్షం కురిపించారు. ఆ ప్రశ్నలన్నింటికీ గోపీనాథ్ 'బాగున్నారు', 'క్షేమమే', 'కుశలమే' – అంటూ సమాధానం చెప్పాడు. అతడి గొంతు పూడుకు పోయింది. మరేమీ చెప్పలేకపోయాడు. తనను తాను సంబాళించుకున్న తర్వాత గోపీనాథ్ ఇలా అన్నాడు – 'సోదరా! నీకో శుభవార్త.'

శ్రీరామ్ గోపీనాథ్ ముఖం చూస్తూ ఉండిపోయారు. ఆ వాక్యం పూర్తికావడానికే అన్నట్లు ఆగారు. గోపీనాథ్ ఇలా అన్నాడు – "మేము మామలం అయినాము. వదినగారు, మేనల్లుడూ కులాసా. అతడికి మీరే పేరు పెట్టాలని తాఈజీ చెప్పి పంపారు."

ఆ వార్త విని శ్రీరామ్ సంతోషించారు. తండ్రిని అయినాననే ఉల్లాసం ఉప్పొంగుతోంది. అయితే ఆయన తన సంతోషాన్ని వ్యక్తం చేయకుండా మౌనం వహించారు. కళ్ళు మూసుకున్నారు. మనసులోనే గాయత్రీమంత్రం జపించారు. కళ్ళు తెరచి "ఓం" అన్నారు. మళ్ళీ మౌనం వహించారు. గాయత్రీమంత్రాన్ని మరోమారు జపిస్తూన్నట్లు కొద్ది క్షణాలు ఆగి ఇలా అన్నారు – "ఓం అనే పేరు పెట్టాలి. 'ఓం ప్రకాశ్' అని' ఆ తర్వాత ఆయన కాపలాదారును పిలిచి కొంచెం బెల్లం తెప్పించారు. గోపీనాథ్‌కు, అక్కడ ఉన్న సహచరులకు తినిపించి పుత్రజన్మ పండుగ జరుపుకున్నారు.

గోపీనాథ్‌తో అనేక విషయాలు మాట్లాడుతూ ఉండగా, పది నిమిషాలు ఎప్పుడు అయిపోయాయో తెలియనే లేదు. గోపీనాథ్ మరికొంత సమయం శ్రీరామ్‌తో గడపవచ్చనెడి మిషతో తన సామానును సర్దుకొనుచున్నట్లు నటిస్తూ రక్షకభటుని వంక చుట్టూ చూస్తూ గడిపాడు. అతడిలో భావోద్వేగం ఎంత తీవ్రంగా ఉన్నదంటే – లేవడానికి అతడికి మనస్కరించడం లేదు. అయితే, లేచి వెళ్ళక తప్పదు కదా! శ్రీరామ్ అతడికి ఇలా ధైర్యం చెప్పారు.

"త్వరలోనే బయటికి వస్తాను. ఒకటిన్నర, రెండు నెలలే కదా మిగిలింది. ఆ తర్వాత మనమంతా పూర్వంలాగే పని చేద్దాం. 'భారత్‌మాతాకీ జై' – అందాం."

"వచ్చేవారం మళ్ళీ రావడానికి ప్రయత్నిస్తాను" – అంటూ గోపీనాథ్ లేచాడు. అతడు శ్రీరామ్ ఇచ్చిన బెల్లంలో శెనగ బద్దంత మాత్రమే తిన్నాడు. లేస్తూ, మిగతా బెల్లాన్ని గుప్పిట్లో పెట్టుకుని ఇలా అన్నాడు – "ఆవల్‌ఖేడాలో మేమంతా దీన్ని పంచుకుని తింటాం." ఆ మాట పూర్తి కాగానే అతడి కళ్ళలో

**జీవితంలో కొన్నిసార్లు విలువైన పాఠాలు సాధారణ వ్యక్తుల నుంచి కూడా నేర్చుకోవచ్చు**

నీళ్ళు తిరిగాయి. శ్రీరామ్ కళ్ళు కూడా చెమర్చాయి. గోపీనాథ్ కళ్ళలోకి సూటిగా చూడకుండా ఉండడానికి ఆయన ప్రయత్నించారు. ఆ ప్రయత్నంలో కొంతవరకు సఫలమయ్యారు కూడా. ఆయన గోపీనాథ్‌ను కౌగలించుకున్నారు. వీపు తట్టారు. తల వంచుకునే గది నుండి బయటికి వెళ్ళారు. గోపీనాథ్ కూడా మౌనంగా నిష్క్రమించాడు.

## జైలు రోజుల్లో ఇల్లు

సెంట్రల్ జైలులో శ్రీరామ్‌తోపాటు మరి 12గురు ఉన్నారు. వారు ఆయనకు సహచరులు మరియు పరిచయస్థులు, శ్రేయోభిలాషులు. గదిలోకి వచ్చి కూర్చున్నవారిలో ఇద్దరు బాగా పరిచితులు. వారిని కలవడానికి కూడా ఎవరో వచ్చారు.

గోపీనాథ్ వెళ్ళిపోయిన తర్వాత శ్రీరామ్ ఇంటిని గురించి ఆలోచించసాగారు. తాను స్వరాజ్య సమరంలో పాల్గొనడంతో ఇంటి పరిస్థితి దిగజారినట్లు ఆయనకు అనిపించింది. భవంతి పెద్దదే. పొలాలు ఉన్నాయి. నౌకర్లు, చాకర్లు ఉన్నారు. అయినా – అజమాయిషీ చేయడానికి ఉన్నది మాత్రం ఒక్క తాఈజీయే. ఉమ్మడి కుటుంబంలో ఇతర సోదరులు, బంధువులు ఉన్నారు. బాధ్యత వహించగలిగేవారు ఒక్కరూ లేరు. శ్రీరామ్ ఆ కుటుంబానికి దీపకళిక. ఆయనపై బాధ్యత కూడా పడేది. కానీ, ఉద్యమంతో సాధన – స్వాధ్యాయాలతో ఆయనకు తీరిక దొరకడం లేదు. ఆయనకు ఆరు నెలలు శిక్ష పడడంతో, గ్రామంలో ఆయనపై విమర్శలు వచ్చాయి. జనం ఇలా అనేవారు – 'మేము మొదట నుంచి వారిస్తూనే ఉన్నాం. ఆంగ్లేయులతో పోరాడి ఎవరు గెలవగలరు? రవి అస్తమించని సామ్రాజ్యం వారిది. దానిని ఎవరు అస్తమింపజేయగలరు. మత్తజీ పిచ్చివాడు, ఉన్మత్తుడు. శిక్ష అనుభవించి వచ్చిన తర్వాత మారక ఏం చేస్తాడు.'

మేనమామ వరుస అయిన దుర్గాశంకర్ తరచు తాఈజీని ఉడికించేవాడు. ఆమెపై ఇలా వ్యంగ్య బాణాలు విసిరేవాడు – 'అక్కడ శ్రీరామ్ మరికొన్ని కళలు నేర్చుకుని వస్తాడు. ఇక సంపాదించవలసిన అవసవరం ఉండదు. పొలం పనులు చూడవల్సిన అవసరం ఉండదు'. మొదటిసారి ఇలా మాట్లాడినప్పుడు తాఈజీకి దాని అర్థం తెలియలేదు. ఆమె అమాయకంగా అడిగారు 'ఏయే కళలు నేర్చుకుంటాడో నీకు తెలుసా?'

ఆయన ఇలా అన్నాడు – "ఇవే, దొంగతనం, దారిదోపిడీ, జేబు దొంగతనం". ఆ మాట విన్న తాఈజీ ముఖం వాడిపోయింది. ఆమె మౌనం వహించారు. ఆమెకు ఎంతో బాధ కలిగింది. ఆ తర్వాత ఆమె తనకు తాను ఇలా నచ్చ జెప్పుకున్నారు – తన కుమారుడు మిగతవారివలె తినడం, త్రాగడం, సంపాదించడం, ఇల్లు వాకిలీ చూచుకోవడం వరకే పరిమితమైనవాడు కాదు; అతడు మొత్తం దేశం కోసం పనిచేస్తున్నాడు; అందరి శ్రేయస్సుకోసం తాను ఆహుతి అవుతున్నాడు; కనుక, ఈ కష్టం తప్పదు."

ఆమె మనస్సులో ఈ ఆలోచనా ప్రవాహం సాగుతూ ఉండగా–జైలు యాత్ర దృశ్యం ఆమె కళ్ళముందు వచ్చి నిలచింది. మరి–జైలుకు వెళ్ళడం మంచి విషయం కాదు. అందువల్ల అప్రతిష్ట కలుగుతుంది. జైలు సజ్జనుల కోసం కాదు కదా. ఈ ఎదురుప్రశ్నకు జవాబు కూడా వచ్చింది. – కృష్ణపరమాత్మ కారాగారంలోనే జన్మించాడు కదా; ఆయనకు అపకీర్తి రాలేదు కదా; దేవకీ, వసుదేవులు కారాగారంలో ఉన్నారు. అసురులు పలు సందర్భాలలో సత్పురుషులను ఖైదు చేశారు. నేడు కూడా గాంధీజీ కారాగారమునకు వెళ్ళిన వార్తలు వస్తూ ఉన్నాయి. ఆలోచించగా ఇదంతా కళ్ళకు కనిపించింది. ఆ తర్వాత ఆ బంధువు ఎన్నోసార్లు అలాంటి వ్యంగ్య బాణాలు విసిరాడు. కాని తాఈజీని అవి ప్రభావితం చేయలేక పోయాయి. శ్రీరామ్ ఇంటిలో లేనందువల్ల ఇంటి వ్యవహారాలు, పొలం వ్యవహారాలు చక్కదిద్దడంలో ఆమె నిమగ్నం అయినారు.

## ఇక జాగ్రత్తగా ఉంటా

తాను స్వరాజ్య ఉద్యమంలో జైలుకు వెళ్ళిన తర్వాత తమ పట్ల తమ బంధువుల ప్రవర్తనలో వచ్చిన మార్పు గురించి తనను చూడడానికి వచ్చేవారివల్ల శ్రీరామ్‌కు తెలుస్తూ వచ్చింది. శ్రీరామ్‌ను కలుసుకోవడానికి వచ్చేవారిలో హెచ్చుమంది మిత్రులూ సహచరులే; బంధువులు ఒకరో ఇద్దరో. మేనమామ రెండుసార్లు వచ్చారు. ప్రభుత్వానికి సిఫార్సు చేయించి కానీ, అధికారులను కలుసుకుని కానీ శ్రీరామ్‌ను త్వరగా విడిపించే ప్రయత్నంతో వచ్చారు. సిగ్గుపడవలసిన నేరం చేసి తాను జైలుకు రాలేదనీ, కనుక ఆ ప్రయత్నాలు చేయవద్దని శ్రీరామ్

**ఏ పని చెయ్యకుండా కూర్చోవడమంటే తమ శక్తిని వ్యర్థం చేసుకోవడమే**

ఆయనతో చెప్పారు. 'భారతమాత సేవ చేస్తూ మేము పట్టుపడ్డాము. ఆమె సేవలో వ్యక్తులు నవ్వుతూ నవ్వుతూ ఉరికంబాలు ఎక్కారు. కారాగారం నుండి బయటికి రావాలనే ఆతురత మనకు ఎందుకుండాలి' – ఇదీ ఆయన వాదం.

తన మేనల్లుడు చేసిన ఈ వాదాన్ని మేనమామ మెచ్చుకున్నారు. అయితే ఆయన సలహాలో ఒక సూక్ష్మ విషయం కూడా ఉంది. ఆయన ఇలా అన్నారు – "కారాగారములో ఉంటే వ్యక్తి ఇరుక్కునిపోతాడు. బయట ఉంటే అతడు దేశంకోసం మరింతగా పనిచేయగలుగుతాడు. విడుదల కావడం పిరికితనమని అనుకోకు." అందుకు శ్రీరామ్ ఇలా జవాబు చెప్పారు – "ఏదోవిధంగా బందిఖానా నుంచి బయటికి రావడం మంచిది కాదు. బయటికి వచ్చిన తర్వాత జాగ్రత్తగా ఉంటాను. గతములోకన్న మరింత అప్రమత్తముగా ఉంటాను. కారాగారవాసమునకు వెళ్ళే పరిస్థితి రానివ్వను."

ఆరునెలలు పూర్తయిన తర్వాత శ్రీరామ్ విడుదల అయ్యారు. అది నవంబరు నెల. దీపావళి పండుగ జరిగిపోయింది. తాఈజీ ఆ దీపావళిని విచిత్రమైన మనఃస్థితిలో జరిపారు. కుమారుడు జైలులో ఉన్నాడనే దుఃఖం ఒకవైపు. కోడలి ఒడిలో మనవడు ఆడుతూ ఉన్నాడనే సంతోషం మరోవైపు. దీపావళి రోజునే మనవడు ఓంప్రకాశ్‌ను ముద్దాడుతూ ఆమె ఇలా అన్నారు – "నీ నాన్నను రానియ్యి, బుద్ధి చెపుతాను." మూడు నాలుగు నెలల మనవడికి తాఈజీకి చెపుతున్నది ఏమిటో ఎలా అర్థమవుతుంది? అత్తగారి భావం ఏమిటో కోడలికి కూడా తెలియలేదు. అత్తగారు ఏదో గారాబంగా అంటోందని ఆమె అనుకున్నది. అత్తగారి భావం ఏమిటో తన భర్త శ్రీరామ్ ఇంటికి వచ్చినప్పుడు ఆమెకు తెలిసింది.

### భవిష్య ప్రణాళిక రూపకల్పన

ఆగ్రా సెంట్రల్ జైలు నుండి విడుదల అయి శ్రీరామ్ ఇంటికి రాగానే – మిత్రులు, సహచరులు ఆయనను త్రోవలోనే చుట్టుముట్టారు. ఇంతకాలం విడచి ఉండడం వారిని స్నేహావేశంలో ముంచివేసింది. ఆయన ఇన్ని నెలల తర్వాత ఇంటికి వస్తున్నారు, ఆయన తల్లిగారు, భార్యా ఆయన కోసం ఎదురుచూస్తూ ఉంటారు – అన్న ఆలోచనే వారికి రాలేదు. కుటుంబంలోకి క్రొత్తగా వచ్చిన పసివాడు తన తండ్రిని చూడాలని లేదా తనను ఆయనకు చూపించుకోవాలని అవ్యక్తమైన ఆకాంక్షను పదిలపరచుకున్నాడని కూడా వారికి తట్టలేదు. వీటన్నింటిని పట్టించుకోని సహచరులు ఆయనను సుమారు రెండు గంటలపాటు తమతోనే ఉంచుకున్నారు. తన కోసం ఇంటిలోనివారు ఎదురుచూస్తున్నారనే ధ్యాస ఆయనకు లేకపోయింది. ఆయన తన మిత్రుల మధ్య కూర్చుని భావి యోజనల గురించి మాట్లాడుతూ ఉండిపోయారు. ఉద్యమములోని తర్వాతి ఘట్టము ఎలా ఉంటుంది, దానిలో ఎవరు ఎలాంటి పాత్ర నిర్వహించగలుగుతారు –అనే విషయాన్ని వివరిస్తూ కూర్చున్నారు ఆయన.

'కారాగారవాస జీవితమెలా ఉంది? దినచర్య ఎలా ఉండేది? ఖైదీల మధ్య పరస్పర సంబంధాలు ఎలా ఉండేవి?' అంటూ సహచరులంతా కారాగారవాస అనుభవాలను గురించి ప్రశ్నలవర్షం కురిపించారు. శ్రీరామ్ ఇలాంటి ప్రశ్నలు దాటవేశారు. చెప్పడం ఇష్టం లేక కాదు. ఆయన దృష్టిలో భావి కార్యక్రమాల యోజన ముఖ్యమైనది కనుక. ఆ ప్రశ్నలను ఐదారుసార్లు దాటవేశారు. సహచరుల ఒత్తిడి పెరిగింది. ఆయన ఇలా అన్నారు. "కారాగారవాసపు కథ వివరంగా మరోసారి చెపుతాను. ఒకటి రెండు సంఘటనలు కావు. లెక్కలేనన్ని ఉన్నాయి. వాటిని వర్ణించడానికి ఎన్నో గంటలు పడుతుంది. ఇప్పుడు మనం జరగవలసినదాన్ని గురించి ఆలోచించాలి."

### జైలు యాత్ర అనుభవాలు

అయినా – మాటల సందర్భంలో కొన్ని అనుభవాలు వెలికి రానేవచ్చాయి. బందిఖానాజీవితయాత్ర రోజులలో ఎవరు ఎక్కువగా గుర్తు వచ్చారనే ప్రశ్నకు శ్రీరామ్ ఇలా జవాబిచ్చారు.

"అంతా గుర్తుకు వచ్చేవారు. అయితే అక్కడి జీవితం క్షణం తీరికలేనిది. దినచర్యలోనే, అప్పజెప్పబడ్డ పనులలోనే మనస్సు మునిగిపోయి ఉండేది. ఎవరి జ్ఞాపకం ఎక్కువగా వేధించలేదు. కారాగారవాసంలో చాలా సమయం చదవడంలో వ్రాయడంలో గడచిపోయేది. పెద్ద నాయకులకు చాలా సౌకర్యాలు ఉండేవి. వారికోసం వార్తాపత్రికలు కూడా వచ్చేవి. ఇంగ్లీషు నేర్చుకోవడానికి కొంత సమయం కేటాయించాలని అనిపించింది. వ్రాయడానికి కలము లేదు, కాగితము లేదు. అందుకు పరిష్కారం కనుగొన్నాను. కంచంపై బొగ్గుతో వ్రాసే ఉపాయం తట్టింది. "హిందుస్థాన్ టైమ్స్" దినపత్రిక పాత ప్రతులు

మెరిసేదంతా బంగారం కాదు

సంపాదించాను. ఒక్కోసారి విప్లవవాదులైన సహచరులను, ఒక్కోసారి జైలు అధికారులను అడిగి ఇంగ్లీషు అక్షరాలు వ్రాయడం అభ్యాసం చేశాను. ఇంగ్లీషు భాష అక్షరమాల నేర్చుకున్నాను. రెండు నెలల్లో ఆంగ్ల దినపత్రిక చదవగలిగేటంత ఇంగ్లీషు నేర్చుకున్నాను. ఆ తర్వాత ఆ అభ్యాసం మరింత గట్టిపడింది."

సహచరులు జైలు జీవితంలోని సంఘటనల గురించి గ్రుచ్చి గ్రుచ్చి అడుగుతున్నారు. ఆ సంఘటనలు వెంటనే గుర్తుకు రావడం లేదు. గంగాశరణ్ అన్నాడు – సరే, ఎక్కువ చెప్పకు. అందరినీ మైమరపించిన ఒక్క సంఘటన చెప్పు. ఎవ్వరికీ మరపురాని ఒక్క సంఘటన చెప్పు."

శ్రీరామ్ జ్ఞాపకాలలో మునిగిపోయారు. కొద్దిసేపు మౌనంగా ఉన్నారు. జైలులో జరిగిన ఒక సంఘటనను పిడికిలిలో బిగించి తెచ్చినట్లు వెలికి తెచ్చారు.

ఆయనను బంధించి సెంట్రల్ జైలుకు తీసుకువచ్చారు. అక్కడ ఆయనను ఆకర్షించిన వారిలో ఒక సాధువు ఉన్నారు. ఆయన పేరు రాఘవదాస్. ఆయన భక్తిమార్గానికి చెందిన ఉపాసకులు. తనను రాఘవస్వామి అని కాక రాఘవదాస్ అని పిలుచుకోవడానికి, పిలిపించుకోవడానికి ఆయన ఇష్టపడేవారు. ఎవరైనా తనను 'స్వామీ' అని పిలిస్తే, ఆయన చేతులు జోడించి ఇలా చెప్పేవారు –

"సోదరా! స్వామి ఒకే ఒకడు – పైన ఉన్నవాడు. మనం దాసులము. కనుక – నన్ను దాసు అని పిలిస్తే బాగుంటుంది." అక్కడివారు ఆయనను దాస్ అని పిలవడానికి వెనుకాడేవారు. కనుక – 'బాబా' అనీ, 'మహరాజ్' అనీ పిలిచేవారు. శ్రీరామ్ ఆయనను 'భగత్‌జీ' అని పిలవసాగారు. ఆయన భక్త రాఘవదాస్.

★★★

## మహాపురుషుల - మానసం

*బుద్ధభగవానుడు ఒక సభలో ఉపదేశం చేస్తున్నాడు. అదే సభలో ఒక ఉద్దండుడు కూర్చొని ఉన్నాడు. అతడు సభను నిలువరింపచేసి లేచి నిలబడి బుద్ధభగవానుడిని హేళన చేయసాగాడు. బుద్ధభగవానుడు అతని అవహేళనను అంతా విన్నాడు. బుద్ధుడు ప్రతీకారేచ్ఛ తలంపక, బదులివ్వక మౌనం వహించాడు. బుద్ధభగవానుని నిర్లిప్తతను చూచి అతడు మరింత కోపంతో రెచ్చిపోయి మరింత కటువైన పదాలను వాడుతూ బుద్ధుడిని తులనాడసాగాడు. ఐనప్పటికీ శాంతసముద్రుడైన బుద్ధుడు అతని క్రోధపు మాటలు వింటూ తన శాంతాన్ని వీడలేదు. మరునాడు రెండవ గ్రామానికి బుద్ధుడు తన మానాన తాను బయలుదేరి వెళ్ళిపోయాడు. దీనిని చూచిన ఆ వ్యక్తి మనస్సులోని అహంకారం తొలగి జ్ఞానం ఉదయించగా తను చేసిన పనికి సిగ్గుతో క్రుంగిపోయాడు.*

*ఆ వ్యక్తి తనను క్షమించమని కోరుతూ బుద్ధుడిని వెతుకుచూ రెండవ గ్రామానికి చేరుకొన్నాడు. ఆ గ్రామంలో బుద్ధుడిని చూచి ఆయన శరణుజొచ్చి తన తప్పిదాన్ని మన్నించమని వేడుకొనగా బుద్ధభగవానుడిట్లు పలికాడు. "ఓ బంధు! నీవు ఎవ్వరవు? ఏ కారణంతో క్షమించమని నన్ను అడుగుచున్నావు?" దీనిని విన్న ఆ వ్యక్తి ఆశ్చర్యచకితుడై "భగవాన్! నన్ను మరచిపోయారా? నిన్న నేను మిమ్ములను అకారణంగా తూలనాడి నిందించిన అపరాధిని" అన్నాడు. దీనికి జవాబుగా బుద్ధుడు "మాననీయ! నిన్నటి రోజును నేను నిన్ననే వెనుక విడిచిపెట్టాను! నేడు నేను వర్తమానంలో ప్రవేశించాను! నీవు కూడా ఇప్పుడు నిన్నటి సంఘటనను మరచి వర్తమానంలో ప్రవేశించు! ఎప్పుడైతే నీవు నీ తప్పును తెలుసుకొని క్షమించమని కోరినావో అప్పుడే నీవు నిర్మలమైపోయావు! ఇప్పుడు నీవు ఆ నిర్మలమనస్సుతో నూతన జీవితాన్ని ఆరంభించు. అదే నీకు శాంతిని ప్రసాదిస్తుంది!"*


*మహాపురుషుల మదిలో రాగ-ద్వేషాలు, మానావమానాలు, ప్రతివాదన-ప్రతీకారాల భావనకు తావుండదు!*

*హిందీమూలం: అఖండజ్యోతి, మార్చి 2015*
*అనువాదం: శ్రీమతి ఎ. శారద*

**సందేహించే చోటుకు విజయం రాదు**

# కుండలినీసాధన యొక్క మర్మము, మార్గదర్శనం

ప్రతి పదార్థానికి ఒక కనిపించే-ఒక కనిపించని రూపం ఉంటుంది. బంగారం ఒక విలువైన లోహం. అది మట్టిలో కలిసి భూమిలో ఖనిజరూపంలో లభిస్తుంది. దానిని శుద్ధి చేసి దుకాణాలలో ఆభరణాల రూపంలో అమ్ముతారు. బంగారానికి పుటం పెట్తే స్వర్ణభస్మంగా మారుతుంది. దానికి అద్భుతమైన ఔషధగుణాలు ఉంటాయి. దానిని సేవించితే బలహీనులకు బలం, ధాతుపుష్టి కలుగుతుంది. దీర్ఘ ఆయుర్దాయం కలుగుతుంది. ఇలాంటి గుణ విశేషాలు ఇతర ధాతువులకు కూడా ఉంటాయి. వాటిని శోధన, సూక్ష్మీకరణ చేస్తే రసభస్మముల రూపంలో తమ రహస్యమైన విశేషతలు చూపిస్తాయి. యురేనియం పరమాణువుల సూక్ష్మ అంశ అణుశక్తి ఉత్పాదనలో ఉపయోగపడుతుంది. దీనితో విద్యుచ్ఛక్తి తయారుచేసుకోవచ్చు. ఆయుధాలు తయారుచేసుకోవచ్చు. ఇది స్థూలం యొక్క సూక్ష్మీకరణ.



समष्टि चेतना का व्यष्टि घटक - न्यूरॉन

స్థూలం కన్నా సూక్ష్మంలో అగణితమైన శక్తి ఉంటుందని అందరికీ తెలిసిన విషయమే. మట్టిగడ్డతో పోలిస్తే అణు విస్ఫోటనం అద్భుతమైన పని చేస్తుంది. శరీరంతో పోలిస్తే మనోబలం మహత్వం ఎక్కువ. నీటికన్నా నీటిఆవిరి యొక్క శక్తి ఎన్నో రెట్లు ఎక్కువ. ఆత్మ అదృశ్యంగా ఉన్నప్పటికి అది వికసించినప్పుడు మహా పురుషులు, ఋషులు, దేవాత్ములు, అవతార పురుషుల రూపంలో కనిపిస్తుంది.

మానవుని సత్తా యొక్క సూక్ష్మీకరణ కూడా యోగం తపస్సు ద్వారా జరుగుతుంది. తపస్వి తన శరీరంలో దివ్య క్షమతలను జాగృతం చేసుకుంటాడు. నీటిఆవిరితో రైలు నడుస్తుంది. ఎండు కొమ్మల రాపిడితో దావానలం పుడుతుంది. తపస్సు యొక్క సాధనాత్మక విధివిధానంతో అటువంటి ప్రభావం కలుగుతుంది. చెల్లాచెదురుగా ఉన్న సూర్యకిరణాలు భూతద్దం ద్వారా ఏకత్రితం చేస్తే అగ్ని పుడుతుంది. తపస్సు యొక్క సాధనా ప్రతిఫలం ఇలాగే ఉంటుంది.

యోగం మనుష్యుని తుచ్ఛతను, దివ్యలోకం యొక్క మహత్వమును కలుపుతుంది. దీనితో లఘువుల, విభువుల ఏకీకరణ జరుగుతుంది. విద్యుత్తుతో కలపబడ్డ ప్రతి తీగ శక్తివంతమవుతుంది. వాటికి అప్పగించిన పనిని నిర్వర్తిస్తుంది. పెద్ద నాటితొట్టెతో కలుపబడ్డ కుళాయిలలో నీరు వస్తూనే ఉంటుంది. ఆ ట్యాంక్ ఖాళీ అయ్యేంతవరకు. దివ్య చేతన యొక్క నీటితొట్టె ఎప్పుడు ఖాళీ కాదు, దానితో కలుపబడ్డ కుళాయిలకు నీరు అందుతూనే ఉంటుంది. లోపల అడ్డు ఏమి లేకపోతే. పరబ్రహ్మ దివ్యచేతనత్వముతో మానవీయ చేతనత్వం జోడింపబడితే నరుడు నారాయణుడుగాను, పురుషుడు పురుషోత్తమునిగాను, తుచ్ఛుడు మహాత్ముడుగానూ మారటానికి ఎక్కువ సమయం పట్టదు.


ఆత్మసంయమము, సచ్ఛీలము, ప్రవర్తనలో ఔదార్యం, సేవాసాధన లేకపోతే సాధన ఫలించదు. నీరు, ఎరువు, కాపలాదారు లేకపోతే నాటిన విత్తనం పెద్ద వృక్షంగా మారదు. కుండలినీ సాధనలో ఇదే సూత్రం వర్తిస్తుంది.

కుండలినీ జాగరణ అంటే చేతనత్వ అంతరాళములలో ఉన్న దివ్యశక్తుల జాగరణ. ఇది మూడు శరీరములలో విభిన్న ప్రయోజనముల కొరకు రకరకాలుగా పనులను పూర్తిచేస్తుంది. ఈవిధంగా చేయడం వలన 14 విభూతులు లభిస్తాయి. ఈ విభూతులు సముద్ర మథనంలో లభించే 14 రత్నాలతో పోల్చబడ్డాయి. వీటి వర్గీకరణ ఈవిధంగా చేయవచ్చు. స్థూలశరీరంలో మూలాధారం నుండి పైకి పోతుంటే సహస్రారకమలం, బ్రహ్మరంధ్రం వరకు పోవచ్చు. ఈ మధ్యలో షట్చక్రాలు వస్తాయి. వీటి సిద్ధి వలన మనిషి శక్తివంతుడై సమృద్ధిని, పొందుతాడు. ప్రచండ పరాక్రమాన్ని సాధిస్తాడు. అందువలన సామాన్య మానవుని కన్నా సాధకుడు ఎంతో శక్తివంతుడుగా మారతాడు. మన ఇంద్రియాలు బహిర్ముఖంగానే కాక అంతర్ముఖంగా కూడా ఎన్నో పనులు చేస్తుంటాయి. చర్మచక్షువులతో చూడలేనిదాన్ని దివ్యచక్షువులతో చూడవచ్చు. ఇదే రీతి అన్ని ఇంద్రియాలకు వర్తిస్తుంది. దూరదృష్టి,

**ఆత్మవిశ్వాసం కొరవడినవాడు ఏ పనిని సాధించలేడు**

దూరశ్రవణం, శక్తిపాతం, భవిష్యజ్ఞానం వంటి స్థూలజగత్తుకు సంబంధించిన సిద్ధులు స్థూలశరీరానికి సంబంధించిన కుండలినిని జాగృతం చేయడం వలన కలుగుతాయి. ఓజస్సు, తేజస్సు, వర్చస్సు అధికంగా లభిస్తాయి.

సూక్ష్మశరీరానికి సంబంధించిన కుండలిని జాగరణ పంచ కోశాల ఆధారంతో జరుగుతుంది. అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయ కోశములు చేతనత్వమునకు చెందిన ఐదు ఆవరణలు. వీటిలో పంచ తత్త్వాలు, పంచప్రాణాలు ఉంటాయి. వీటిని వికసింప చేసుకోవడం వలన సాధకుడు అదృశ్యజగత్తుతో సంబంధం ఏర్పరచుకుంటాడు. సామాన్య మానవుని జ్ఞానం, దృశ్యజగత్తుకు పరిమితమై ఉంటుంది. సూక్ష్మశరీరం యొక్క కుండలిని జాగృతం కావడం వలన సాధకునికి అదృశ్యజగత్తుతో పరిచయం కలుగుతుంది. అందులో నివసించే పితరులతో, దేవతలతో స్నేహ సంబంధాలు కలిగి, ఇచ్చి పుచ్చుకోవడాలు ప్రారంభమవుతాయి. ప్రకృతి రహస్యాలు తెలిసిపోతాయి, భవిష్య సంఘటనలు అర్థమవుతాయి. అప్పుడు తగువిధంగా ప్రణాళికలు వేసుకుని ప్రతికూలతలను నివారించ వచ్చు, అనుకూలతల లాభం పొందవచ్చు. ప్రజల మనస్సులలో అనుకూల భావాలను ప్రవేశపెట్టి లోక ప్రవాహం యొక్క దారి మళ్ళించవచ్చు.



समष्टि की साधना

కారణశరీరానికి చెందిన మూడు ప్రయోగాలు ఉన్నాయి. వాటిని గ్రంథి భేదనం అంటారు. మస్తకం మధ్యలో బ్రహ్మగ్రంథి ఉన్నది. దీనినే కైలాస పర్వతం అని, క్షీరసాగరం అని కూడా పిలుస్తారు. దానిని బ్రహ్మాండీయశక్తులతో ఇచ్చిపుచ్చుకునే కేంద్రంగా భావిస్తారు. రెండవది హృదయ ప్రదేశంలో ఉన్న విష్ణుగ్రంథి. భావసంవేదనల కేంద్రం అది. తృప్తి, తుష్టి, శాంతి అక్కడ లభిస్తాయి. తన ఆలోచనలను ఉన్నతంగా చేసుకుని ఇతరుల ఆలోచనలను మార్చగలిగే శక్తి ఈ గ్రంథి ద్వారా లభిస్తుంది. మూడవది రుద్రగ్రంథి. ఇది నాభిచక్రంలో ఉంటుంది. శారీరిక ఆరోగ్యం, ప్రతిభ, బుద్ధి సూక్ష్మత, సాహసం మొదలైన అనేక శక్తుల ప్రవాహం ఇక్కడ లభ్యమవుతుంది. మూలాధారచక్రం దీని గహ్వరం (నోరు)లో ఉన్నది. దీనిని ప్రాణ ప్రహారంతో (దెబ్బ) నిద్రలేపి శిరస్సులో ఉన్న బ్రహ్మలోకం వరకు పంపించాలి.

స్థూలశరీరంలోని ఆరు చక్రాలు, సూక్ష్మశరీరంలోని పంచకోశాలు, కారణ శరీరంలోని మూడు గ్రంథులు కలిపి 14 అవుతాయి. ఇవే చతుర్దశభువనాలు (14 లోకాలు). అందులో ఏడు ఊర్ధ్వలోకాలు, ఏడు అథోలోకాలు. మానవ శక్తి సముద్రం వంటిది. దానిని త్రివిధ కుండలినీసాధనల ద్వారా మథించాలి. నిజానికి శరీరాన్ని రాక్షసులతోను, మనస్సును దేవతలతోను పోల్చవచ్చు. ఈ రెండు కలిసి తప యోగముల సాధన చేసి ఆ 14 రత్నాలను కైవశం చేసుకొనవచ్చును. పురాణాలలో సముద్ర మంథన కథ దీని ఆలంకారిక వర్ణనయే. మానవశక్తి యొక్క పంచతత్త్వాలు, పంచ ప్రాణాలు కలిసిన కళేబరమనే సముద్రం చాలా లోతైన, విశాలమైన సముద్రంగా చెప్పుకొనవచ్చు. అభీష్టసిద్ధి కొరకు బయటకు పోయి వెతుక్కోవలసిన అవసరం లేదు. అన్నీ లోపలే దొరుకుతాయి. కస్తూరిమృగం వలె బొడ్డులో ఉన్న కస్తూరిని గ్రహించలేక పరుగులు పెట్టడం ఎందుకు?

కుండలినీవిజ్ఞానం గురించి సంక్షిప్తంగా వివరించబడింది. సాధనా విధివిధానాలను గురించి ఏమి చెప్పలేదు. ఎందుకంటే అది అణువిస్ఫోటనం వంటిది. ఎవరు ఏ సాధన ఎందుకొరకు చేస్తున్నాడో సంపూర్ణముగా తెలియకుండా సాధనా రహస్యాలను చెప్పకూడదు. అది తుపాకీ మందుతో ఆడుకోవడం వంటిది. ఇతరులకు హాని చేయవచ్చు. తనకు తాను హాని చేసుకోవచ్చు. సామాన్య సాధకులకు జ్ఞానయోగం, భక్తియోగం, కర్మయోగం మొదలైన సరళమైన జీవితవిధానాలు చాలు. అది వారు చేయగలగడమే గొప్ప విశేషం.

కుండలినీ సాధన చేయడానికి ఆతృత పడవద్దు. పుస్తకాలు చదివి, ఎవరి దగ్గరో విని సాధన మొదలుపెట్టవద్దు. ఈ మహాప్రయోగం ఎవరికి ఎంతవరకు అవసరమో అంతవరకు లభింపచేయడం నా బాధ్యత. ఈ స్థూలశరీరం లేకపోయినా, నా సూక్ష్మశరీరంలో ఇంకొక 100 సంవత్సరాలు నా కర్తవ్యాన్ని నిర్వహిస్తూనే ఉంటాను.

(సమాప్తం)

**వ్యవస్థను తిడుతూ కూర్చునేదాని కన్నా దానిని మార్చడం ఎలా అని ఆలోచించడం మంచిది**

శబ్దబ్రహ్మ - నాదబ్రహ్మ - 7

# శబ్దాలకుండే ప్రచండ శక్తి

తెలిసి కానీ, తెలియక గానీ మన నోటి నుండి ఉచ్చరించే పదాలు మన జీవితాన్నీ, అలవాట్లనీ, వ్యవహారాన్నీ ప్రభావితం చేస్తాయని ఆధునిక విజ్ఞానం నిరూపించింది. మనిషి తెలీకుండా ఏదో ఒకటి మాట్లాడుతూ ఉంటాడు. ఏవేవో శబ్దాలను ప్రయోగిస్తూంటాడు. మామూలు మాటలేగా అని అనుకుంటాం కాని, వాటిలో మన జీవితాన్ని కూర్చగల శక్తి, కూల్చగల శక్తి కూడా ఉంటుందని తెలుసుకోము. శబ్దాలు రెండు రకాలుగా ఉండచ్చు. శుభకరమైన సాత్వికశబ్దాలు-'మహాశయ! మహారాజ, బంధువు, మహాత్మ, ప్రియతములు, రామ, కృష్ణ, హరి, ఓం' మొదలైనవి. రెండవది అశుభకరమైన కుత్సితశబ్దాలు-'రాక్షసుడు, పాపాత్ముడు, దుష్టుడు, వెధవ' మొదలైన తిట్లు. మన రోజూవారి జీవితాల్లో ఏరకమైన మాటలు వాడుతున్నామో, వాటి ప్రభావం ఎలా ఉంటోందో మనకి తెలియదు.

నోటి నుండి పలికే ప్రతి మాట, ప్రతి స్వరం (దాని అర్థం ఏదైనాసరే) అది మన పూర్తి శరీరాన్ని నడిపిస్తూ ఉంటుంది. మన సూక్ష్మనాడులు స్పందిస్తాయి. ఏదైన మాట్లాడిన ప్రతీ సారి ముఖమండలంలోని అవయవాలన్నీ ఒక ప్రత్యేక రీతిలో ముడుచుకుంటూ, విచ్చుకుంటూ ఉంటాయి. పెదవులు కదులుతాయి, వాటితో పాటు కళ్ళలో, చెంపల మీద, ముఖం మీద ఒక ప్రత్యేకమైన వెలుగు కనిపిస్తుంది.

ప్రతి పదానికి దాని అర్థముతోపాటు, ఎన్నో భావాలు, నానార్థాలు ముడిపడి ఉంటాయి. మనకు ఇష్టమైన మాట మాట్లాడినప్పుడు, బైటికి తెలియకపోయినా, ఆ మాటకి సంబంధించిన సమస్త భావాలు, ఆలోచనలు, కథలు, ప్రభావం అన్నీ మన శరీరంలో ఒక్కసారిగా విహరిస్తాయి. వాటితో మనకి ఆత్మిక బలం సంక్రమిస్తుంది. మహాత్మాగాంధీకి తూటా తగిలినప్పుడు ఆయన నోటి నుండి "హే రామ్!" అన్న మాట వచ్చింది. ఆ మాటంటూనే ఒక్క సారిగా నేల మీదకు పడిపోయారు. ఆ మాటలను ఉచ్చరించి గాంధీజీ గూఢమైన ఆత్మికశక్తిని అనుభవించారు. హిందూ సైన్యాలు "మహావీర హనుమంతునికి జయము జయము" అంటూ ఎన్నో యుద్ధాలు గెలిచాయి. చాలామంది "శివ శివ" అంటూంటారు, మరి కొందరు "హరే కృష్ణ" అని, "రాధా కృష్ణ" అని అంటూంటారు. ప్రాచీనకాలం నుండి భారతీయులు దేవతల పేర్లు చెప్తూ చెప్తూ శక్తిని సంగ్రహిస్తూ వస్తున్నారు. "నారాయణ కృప, గురువు రక్షిస్తాడు, సత్ శ్రీ అకాల్, ప్రభువు దయ" మొదలైన ఎన్నో మాటలు మన దైనందిన జీవితంలో వినియోగిస్తూంటాము. ప్రతీమాటతో సంబంధించిన ఆలోచనలు మనసులో నిండుతాయి.

ఈ సాత్వికపదాలను ఉచ్చరించడం వల్ల మన మానసిక జగత్తులో ఒక శక్తివంతమైన, పవిత్రమైన ఆలోచనాధార మరియు పరిశుద్ధ సాత్వికభావాలు విస్తరిస్తాయి. మానసిక వాతావరణం మొత్తం అదే స్వరంతో, అదే ఆలోచనలతో కమ్ముకుంటుంది. శరీరంలోని అణువణువు ఆ మాటతో మారు మ్రోగుతుంది, ఈ క్రొత్త మాటకు తగ్గ విధానంలోనే మారుతూ వస్తుంది.

ఏదైనా మాటను పూర్తి నమ్మకంతో ఉచ్చరించండి, అలా చేసేటప్పుడు అద్దంలో మీ ముఖ ఆకృతిని చూసుకోండి. ఆ మాట యొక్క ఉచ్చారణతో మీ ముఖంలో ఎటువంటి మార్పులు ఏర్పడ్డాయి? ఆ శబ్దంలోని భావం లేదా అర్థానికి అనుగుణంగా మీ ముఖాకృతి మారుతూ కనిపిస్తుంది. కోపం, ఆవేశాలతో, చిరాకుగా ఏవైనా దుర్భాషలాడిన వెంటనే సౌమ్యంగా ఉండే ముఖం ముడుచుకుంటుంది, పెదాలు వణుకుతాయి, మొత్తం శరీరంలో ఏదో ఆందోళన అనిపిస్తుంది, కళ్ళు ఎరుపెక్కుతాయి. బాహ్యంగా కనిపించే ఈ మార్పులే కాకుండా, లోపల సమగ్రమైన మానసిక జగత్తులో కూడా ఒక వింత కోలాహలం, తత్తరపాటు చెలరేగుతాయి. కోపంతో తిట్లు తిడుతున్నంత సేపూ, ఆంతరిక మానసిక సామ్రాజ్యంలో కూడా ఒక భయావహ వాతావరణం నెలకొని ఉంటుంది. బైట లాగే కటువైన, అస్థిర పరిస్థితి ఆంతరికంగా కూడా నెలకొంటుంది. హృదయం క్రోధాగ్నిలో రగులుతూంటుంది. గుండె దడ పెరుగుతుంది. శరీరంలో వాత పిత్త కఫాల ప్రకోపం ఎక్కువవుతుంది. చాలాసేపు కోపంతో తిడుతూ ఉంటే తల భారంగా అనిపిస్తుంది, నడుము కూడా నొప్పెడుతుంది.

*- పూజ్యగురుదేవుల వాఙ్మయం 18*

*అనువాదం: శ్రీమతి జయలక్ష్మి*

**ఆవేశాలతో సమస్యలు పరిష్కారం కావు**

జీవన దేవత సాధన, ఆరాధన - 7

# జీవన సాధనకు మూలసూత్రాలు-2

*(గత సంచిక తరువాయి...)*

సాప్తాహిక విశేష సాధనలో నాలుగు విశేష నియమాలను అనుసరించవలసి ఉంటుంది. 1. ఉపవాసం 2. బ్రహ్మచర్యం 3. ప్రాణ సంచయం 4. మౌనం. వీటిలో రెండింటికి కొన్ని విశేష కృత్యాలు చేయవలసి ఉంటుంది. జిహ్వ, జననేంద్రియం – ఈ రెండే పది ఇంద్రియాలలో ప్రబలమైనవి. వీటిని సాధన చేయడం ద్వారా ఇంద్రియసంయమనం సిద్ధిస్తుంది. ఈ ప్రథమ చరణం పూర్తి అయితే తరువాతి చరణమైన మనోనిగ్రహంలో విశేషమైన కష్టమేమీ ఉండదు.

జిహ్వ యొక్క అసంయమనం తినగూడని పదార్థాలను అధికంగా తినాలని కోరుతుంది. కటువైన మాటలు, అబద్ధాలు, అతివాగుడు, అన్యాయపుమాటలు నాలుక ద్వారానే వెలువడతాయి. అందువల్లనే జిహ్వకు నాలుక, వాణి– ఈ రెండు ఇంద్రియాల పేర్లు ఉన్నాయి. జిహ్వను సాధన చేయడానికి అస్వాద (రుచులను కోరని) వ్రతాన్ని తీసుకోవాలి. ఉప్పు, మసాలాలు, తీపి, పులుపు మొదలైన రుచులు జిహ్వను తిండిపోతును చేస్తాయి. సాత్వికమైన, తేలికగా జీర్ణమయ్యే పదార్థాలను అది తిరస్కరిస్తుంది. బాగా వేగిన, మసాలాలతో నిండిన, తియ్యటిపదార్థాలలో దొరికే చిత్రవిచిత్రమైన రుచుల కోసం నాలుక ఆశపడుతుంది. దానికి అభక్ష్యపదార్థాలే రుచిగా అనిపిస్తాయి. పదార్థాలను అతిగా కడుపులో చేర్చిన ఫలితంగా–కడుపు చెడిపోవడం ప్రారంభం అవుతుంది. ఆ పదార్థాలు కుళ్లిపోవడం వల్ల రక్తం విషపూరిత మవుతుంది. చెడిపోయిన రక్తము అనేక రకాలైన వ్యాధులకు కారణ మౌతుంది. ఈవిధంగా జిహ్వ యొక్క వికారాలు తినేవారిని పతనకూపంలోకి త్రోసివేస్తాయి; ఆరోగ్యానికి గొడ్డలిపెట్టు అవుతాయి. ఈ రెండు విపత్తుల నుండి రక్షింపబడడంలో జిహ్వపై నిగ్రహం ఒక తపస్సాధన అవుతుంది. రోజు కుదరక పోతే కనీసం వారంలో ఒకరోజయినా జిహ్వకు విశ్రాంతి ఇవ్వాలి. ఆవిధంగా జిహ్వ తన దుర్గుణాల నుండి బయటపడే ప్రయత్నం చేయగలుగుతుంది.

ఉపవాసం పొట్టకు సాప్తాహిక విశ్రాంతి. దీనివలన ఆరు రోజుల ఎగుడు దిగుడులు సర్దుకుంటాయి. తరువాతి రోజులలో సరైన మార్గాన్ని అనుసరించే అవకాశం లభిస్తుంది. నీరు మాత్రం తీసుకొని ఉపవాసం ఉండలేనివారు కూరగాయల రసం కాని, పండ్లరసం కాని తీసుకోవచ్చు. పాలు, మజ్జిగతో కూడ ఉండవచ్చు. అదీ కుదరకపోతే, ఒక పూట నిరాహారంగా ఉండవచ్చు. రోజంతా మౌనంగా ఉండలేకపోయినా, ఏదో ఒక సమయంలో రెండుగంటల సేపు మౌనం పాటించవచ్చు. ఈ చిహ్నపూజ ద్వారా కూడా రెండు ప్రయోజనాల ఉద్దేశ్యం స్మరణలో ఉండి, భవిష్యత్తులో పాటించవలసిన నియమాలపై ధ్యానాన్ని కేంద్రీకరించవచ్చు. జిహ్వపై నియంత్రణ సాధించడం సాప్తాహిక విశేష సాధనలో తొలిమెట్టు.

రెండవ ఆధారం – బ్రహ్మచర్యం. నిర్ణీతమైన రోజున శారీరిక బ్రహ్మచర్యం పాటించవలసిందే. లైంగికచర్యకు దూరంగా ఉండవలసిందే. మానసిక బ్రహ్మచర్యాన్ని కూడా అనుసరించాలి. ఇందుకోసం చెడు దృష్టినీ, అశ్లీల కల్పనలనూ వదిలివేయాలి. పురుషుడు స్త్రీని దేవిగా, స్త్రీ పురుషుడి దేవతగా చూడాలి. పూజ్య భావనలు మనసులో పొంగాలి. అన్న–చెల్లెలు, తండ్రి–కూతురు, తల్లి–బిడ్డలు – అనే దృష్టితో ఇరువురూ పరస్పరం పవిత్ర భావన కలిగి ఉండాలి. చివరకు భార్యాభర్తలు కూడా ఒకరికి ఒకరు అర్థాంగులు అనే ఉన్నత స్థాయి ఆత్మీయతను పెంపొందించుకోవాలి. అశ్లీలత అనాచారంలో భాగం. కనుక– అటువంటి చెడు ఆలోచనలను దగ్గరకు రానీయ కూడదు. శరీర సంయమనంతో పాటు మానసిక పూజ్య భావం సమన్వయపడినపుడే సంపూర్ణ బ్రహ్మచర్యం సాధ్యపడుతుంది. దీనివలన మనోబలం వృద్ధి చెంది, కాముకతతో కూడిన అనేక దుర్భావనల నుండి సహజంగానే విముక్తి లభిస్తుంది. వారంలో ఒకరోజు ఈ లక్ష్యంపై భావనలను కేంద్రీకరిస్తే, దాని ప్రభావం తరువాతి ఆరురోజుల వరకు ఉంటుంది.

మూడవ సాప్తాహిక అభ్యాసం–ప్రాణసంచయము. ఏకాంతంలో కళ్లు మూసుకొని అంతర్ముఖులమై సమస్త విశ్వం

**బెత్తంతో, అరుపులతో పిల్లలను సంస్కరించలేము - ప్రేమతోనే వారిని సంస్కరించగలము**

ప్రాణ చైతన్యంలో నిండి ఉన్నదని ధ్యానం చేయాలి. ఆహ్వానించి ఆకర్షించినపుడు అది ఎవరికైనా ఎప్పుడైనా అధికంగా లభిస్తుంది. దీనికోసం ప్రాణాయామం చెయ్యాలి. ప్రాణాయామానికి అనేక పద్ధతులున్నాయి. వాటిలో అన్నిటికంటే తేలికైనది–

వెన్నెముకను నిటారుగా ఉంచి కూర్చోవాలి; కండ్లు మూసుకొని ఉండాలి. రెండు చేతులు రెండు మోకాళ్లపై ఉంచాలి; శరీరాన్ని స్థిరంగా ఉంచి, మనసును ప్రశాంతంగా ఉంచుకోవాలి.

గాలి పీల్చే సమయంలో విశ్వవ్యాప్తమైన ప్రాణచేతన నాసికా మార్గం ద్వారా మొత్తం శరీరంలో వ్యాపిస్తున్నదని భావన చేయాలి. దానితో ప్రాణం బలంగా శరీరం, మనసు, అంతః కరణలతో కలగలసిపోతున్నదనీ, తన శరీరంలో, మనసులో చొరబడి ఉన్న వికారాలు గాలితో పాటు బయటకు వస్తున్నాయనీ, అవి తిరిగివచ్చే మార్గం మూసుకుపోయిందనీ భావన చేయాలి. ఈ బహిష్కరణతో పాటు మనలో నిండి ఉన్న అవాంఛనీయ తత్త్వాలు తొలగిపోతున్నట్లు అనుభూతి చెందాలి; వ్యక్తిత్వం పూర్తిగా తేలికవుతున్నట్లు అనుభూతి చెందాలి; తీక్షత, ప్రామాణికత నిలిచియున్నట్లు అనుభూతి చెందాలి;

సాప్తాహిక అభ్యాసంలో నాలుగవది మౌనసాధన. మౌనం రెండు గంటలకు తగ్గకూడదు. మౌనకాలంలో ప్రాణసంచయన సాధన కూడ జరగవచ్చు.

నిర్ధారించబడిన ఈ పనులతో బాటు రోజువారీ సాధన, స్వాధ్యాయం, సంయమనం, సేవ అనే 4 కార్యక్రమాలలో ఏది ఎంత వరకు జరుపగలమో దానికోసం అంత ప్రయత్నం చేయాలి. సేవా కార్యక్రమాలకు ప్రత్యక్ష అవకాశం లేకపోతే, దానికి బదులు ప్రతి రోజూ ఇచ్చే ఆర్థిక అంశదానంతో పాటు ఇంకొంత దానం ఇచ్చే ప్రయత్నం చేయాలి. ఈ డబ్బును సత్‌జ్ఞానం పెంపొందించడానికి అవసరమైన జ్ఞానయజ్ఞం కోసం ఉపయోగించాలి. పీడితుల సహాయం కొరకు అవకాశమున్న ప్రతిసారీ ఏదో కొంత చేస్తూ ఉండడం సామాన్య సాధనా క్రమంలో సమ్మిళితమై ఉండాలి. జ్ఞానయజ్ఞం ఉన్నత స్థాయి బ్రహ్మయజ్ఞం, దీనిలో లోకకళ్యాణం మిళితమైయున్నది. సాప్తాహిక సాధన చేసే రోజున ఇట్టి శ్రేష్ఠమైన సత్కర్మలలో లగ్నమై ఉండాలి.

అర్ధసంవత్సర సాధనలు ఆశ్వయుజ, చైత్రమాసాలలో తొమ్మిదిరోజుల పాటు చేయాలి. ఈ నవరాత్రులలో గాయత్రీ మంత్రం 24,000 సార్లు చేయడం ప్రాచీనకాలం నుండి పరిపాటిగా వస్తూన్నది. ప్రతి సాధకుడూ అలా చేయాలి. జాతి లేదా లింగ భేదం లేకుండా ఏ అధ్యాత్మ ప్రేమికుడైనా దీనిని నిస్సంకోచంగా చేయవచ్చు. కొద్ది లోపం జరిగినా, ఈ సాత్విక సాధనలో ఏవిధమైన నష్టం జరగదు. తొమ్మిది రోజులలో ప్రతిరోజూ 27 మాలల గాయత్రీ జపం చేయడం ద్వారా 24 వేల జప సంఖ్య పూర్తి అవుతుంది. చివరి రోజు కనీసం 24 ఆహుతులు అగ్నిహోత్రములో వేయాలి. చివరి రోజున హవనయజ్ఞం జరపడానికి అవకాశం లేకపోతే, మరొకరోజు దానిని జరపవచ్చు.

అనుష్ఠానాలలో దిగువ నియమాలను పాటించాలి – 1. ఉపవాసానికి వీలుపడకపోతే, ఒక పూట భోజనం చేయాలి, లేదా అస్వాదవ్రతాన్ని ఆచరించాలి. 2. బ్రహ్మచర్యాన్ని పాటించడం. లైంగిక చర్యపై, అశ్లీల ఆలోచనలపై నిగ్రహం. 3. తన శారీరిక అవశ్యకతలను వీలయినంతవరకు తానే తీర్చుకోవడం. 4. హింస ద్వారా తయారైన చర్మవస్తువులను ఉపయోగించకుండా ఉండడం. మంచంపై కాక, చెక్కబల్లపై లేక నేలపై పరుండడం.

ఈ నియమాల ఉద్దేశ్యం ఈ 9 రోజులూ విలాసవంతమైన లేక అస్తవ్యస్తమైన విచ్చలవిడి జీవితం గడపకుండా ఉండడం; జీవితంలో తపసంయమనాల విధివిధానాన్ని అధికంగా అనుసరించడం; తొమ్మిది రోజుల అభ్యాసం రాబోయే ఆరునెలల వరకు మనల్ని ప్రభావితం చేయడం; సంయమనంతో నిండిన జీవితమే ఆత్మకళ్యాణాన్నీ, లోకకళ్యాణాన్నీ సాధిస్తుందనే భావన నిలచి ఉండడం. అందువల్ల జీవన చర్యను ఈ దిశలో మలచుకోవాలి.

అనుష్ఠానం అంతంలో పూర్ణాహుతిగా బ్రహ్మభోజనం జరపడం ప్రాచీన సంప్రదాయం. సరియైన బ్రాహ్మణుడు దొరకని కారణంగా నేడీ పని తొమ్మిదిమంది కన్యలకు భోజనం చేయించటం ద్వారా పూర్తవుతోంది. కన్యలు ఏ కులం వారైనా కావచ్చు. ఈ విధానంలో స్త్రీని దేవీ స్వరూపంగా గౌరవించడం అనే భావం ఇమిడి ఉన్నది. బ్రహ్మచారిణులు కనుక కన్యలు మరింత పవిత్రులు.

**బయటి సమస్యలను ఇంట్లోకి తీసుకురాకండి**

చలామణిలో ఉన్న బ్రహ్మభోజనపు రెండవ రూపం పంచడం ప్రసాదంగా ఏదైనా తీపిపదార్థాన్ని కొద్ది కొద్దిగా పంచే నియమం కూడా ఉన్నది. దీనిలో ఎక్కువమందికి అందించే ఉద్దేశ్యం ఉన్నది. ఒకరి కడుపునింపడం కంటే వందమందికి నోరు తీపి చేయడం మేలు. ఎందుకంటే– ఇచ్చేవారూ, పుచ్చుకునేవారూ దాని మహిమనూ, దాన్ని వ్యాప్తి చేసే అవసరాన్నీ గుర్తిస్తారు.

పరమాన్నాన్ని పంచడం కంటే – చౌకగా యుగసాహిత్యాన్ని పంచడం వలన ఆశయాన్ని పూర్తి చేయవచ్చు. "యుగనిర్మాణ సత్సంకల్పం" అనే అతి చౌక అయిన పుస్తకం ఇందుకు మరింతగా ఉపయోగపడుతుంది. ఇటువంటివే ఇతర చిన్న పుస్తకాలు కూడా యుగనిర్మాణ యోజన ద్వారా ప్రచురింప బడ్డాయి. వీటిని పంచవచ్చు, లేదా తక్కువ ధరకు అమ్మవచ్చు. సత్సాహిత్యాన్ని ప్రసాదంగా పంచే ప్రక్రియ నవరాత్రి అనుష్ఠానాలలో అంతర్భాగం కావాలి.

స్థానికంగా ఉండే సాధకులు సామూహిక సాధన చేయవచ్చు. చివరలో సామూహిక యజ్ఞం జరుపవచ్చు. కలసి భోజనం చేసే ఏర్పాటు చేయవచ్చు. దీనికి తోడుగా కథా ప్రవచనం, కీర్తన, ఉపన్యాసం ఏర్పాటు చేయగలిగితే– బంగారానికి తావి అబ్బినట్లు అవుతుంది.

## ఆరాధన, జ్ఞానయజ్ఞం

**శారీరిక ఆరోగ్యానికి మూడు గుర్తులున్నాయి – 1. మంచి ఆకలి 2. గాఢమైన నిద్ర 3. పని చేసేందుకు స్ఫూర్తి. ఆత్మిక సామర్థ్యానికి మూడు గుర్తులున్నాయి 1. ఆలోచనలలో ఉత్కృష్టత 2. శీలం పట్ల నిష్ఠ 3. వ్యవహారణలో పుణ్య సంపాదనకు ప్రాధాన్యం. వీటినే ఉపాసన, సాధన, ఆరాధన అంటారు.** ఆత్మిక ప్రగతి యొక్క లక్ష్యం మనుష్యులలో దేవత్వం పెంపొందడం. ఇచ్చేవారిని దేవత లంటారు. దీనిని ధర్మధారణ అనీ, సేవాసాధన అనీ అనవచ్చు. వ్యక్తిత్వంలో అణకువ పెరిగితే, సేవ చేయాలనే కోరిక కలుగుతుంది. సేవాసాధన వలన గుణకర్మ స్వభావాలలో సదాశయం నిండుతుంది. శిష్టాచారం పెరిగినపుడు మనిషి పరమార్థ పరాయణుడు కాకుండా ఉండలేడు. భూమిపైన మానవ శరీరంలో నివసించే దేవతలను 'భూసురులు' అంటారు. సాధువులు, బ్రాహ్మణులు భూసురులు అవుతారు. బ్రాహ్మణులు ఒక పరిమిత క్షేత్రంలో పరమార్థ కార్యాలలో నిమగ్నులై ఉంటారు. సాధువులు పరివ్రాజకులుగా సత్ప్రవృత్తులను పెంచే ఉద్దేశ్యంతో అవసరమైన స్థలాలకు చేరుతుంటారు. వారి కార్యకలాపాలు గాలి వలె ప్రాణాన్ని ప్రవహింపజేస్తాయి. మేఘాలవలె వర్షించి పచ్చదనాన్ని నింపుతాయి.

ఆత్మిక ప్రగతి ప్రయోజనాన్ని గుర్తించడానికి గీటురాళ్లు రెండు: ఆలోచనలో, శీలంలో మానవతా గరిమ కనబడడం; పరమార్థపరాయణత చేతలలో ఉండడం.

స్థూలంగా దాన పుణ్యాన్ని పరమార్థమని అంటారు. దుర్ఘటన బారిన పడినవారికి, ఆకస్మిక కష్టాలలో చిక్కిన వారికి తాత్కాలిక సహాయం అవసరమవుతుంది. వికలాంగులకు, అసమర్థులకు జరుగుబాటు దొరకాలి. లేమిలో ఉండేవారిని, వెనుకబడినవారిని స్వావలంబులుగా చేయడానికి పరోక్షంగా సహాయం చేయాలి. మానవోచితమైన జరుగుబాటు కలిగిఉండే విధంగా వారికి పని ఇచ్చి, దానికి మూల్యం చెల్లించాలి. పని లేనివారికి పని దొరుకుతుందనే దృష్టితోనే గాంధీజీ ఖాదీకి ప్రాముఖ్యం ఇచ్చారు. ఇతర కుటీరపరిశ్రమలు ఇదే శ్రేణిలోకి వస్తాయి. నిరుద్యోగాన్ని దూరం చేసే సాధనాలను ఏర్పరచి, లేమిలో ఉండేవాళ్లకు సహాయం చేయవచ్చు. ఉచితంగా పొందే అలవాటు మంచిది కాదు. దీనివల్ల సోమరితనం అలవాటు అవుతుంది; నిర్లక్ష్యం, వ్యసనాలు పెరుగుతాయి. తీసుకునేవారికి చిన్నతనం కలుగుతుంది. ఇచ్చేవారిలో అహంకారం పెరుగు తుంది. ఈ రెండు ప్రవృత్తులు మంచివి కావు. అందువలన ఔచిత్యాన్నీ, సత్ఫలితాన్నీ దృష్టిలో ఉంచుకొని దానం ఇవ్వాలి. అలా కాకపోతే, దానం పేరు మీద ధనం దురుపయోగం అవుతుంది. దానివల్ల స్వావలంబన పట్ల ఉత్సాహం నశిస్తుంది.

దానాలలో సర్వ శ్రేష్ఠమైనది జ్ఞానదానం. దీనిని బ్రహ్మ యజ్ఞమని కూడ చెపుతారు. సద్భావనలను, సత్ప్రవృత్తులను పెంచే ప్రయత్నమే పరమార్థం. సదాలోచన లోపం వల్లనే జనం అనేక దుర్గుణాలను అలవరచుకుంటారు, పతన పరాభవాల కూపంలో పడిపోతారు. సరైన ఆలోచన చేయగలిగితే, సర్వసమర్థుడైన మనిషికి తన సమస్యలను తానే పరిష్కరించుకునే మార్గం లభిస్తుంది. వికలాంగులు, అసమర్థులు, దుర్ఘటనలలో

**కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలి**

చిక్కుకున్నవారు తప్ప – స్వరైన ఆలోచన చేసే మార్గాన్ని కనుగొన్న వారు ఉన్నత స్థానం పొందెదరు; ప్రగతిమార్గంలో పయనించెదరు; తమ సమస్యలను తామే పరిష్కరించుకొనెదరు. జన మానసాన్ని సంస్కరించడానికి, సత్ప్రవృత్తులను పెంపొం దించడానికి తన యోగ్యతకు, పరిస్థితులకు అనుగుణంగా ప్రయత్నించడం ఆత్మిక ప్రగతికి అనుసరించవలసిన విధానం.

సమకాలీన సమస్యలు ఉంటాయి. పరిస్థితులకనుగుణంగా వాటికి పరిష్కారం వెదకవలసి ఉంటుంది. ప్రాచీన పురాణాల ద్వారా, ధర్మ శాస్త్రాల ద్వారా యుగధర్మాన్ని నిరూపించలేము. దానికోసం నేటి ఆచార వ్యవహారాలను, వాతావరణాన్ని దృష్టిలో ఉంచుకోవాలి. అందువల్ల యుగ మనీషులకే ఎల్లప్పుడూ గౌరవం లభిస్తూ వచ్చింది. నేడు కూడ ఇదే ప్రక్రియను అవలంబించాలి. యుగ మనీషుల బోధనలను అనుసరించాలి. సత్‌జ్ఞానాన్ని పెంపొందించుకొనే విధానం ఇదే. అక్షరాస్యతవలె ఇది వ్యక్తి, సమాజాల ముందున్న సమస్యలను పరిష్కరించ గలుగుతుంది. ఆత్మోన్నతి కోసం ఆరాధనను, సేవా సాధనను ఈ ఆధారంపై కనుగొనవలసి ఉంటుంది. జన మానస సంస్కరణకూ, సత్ప్రవృత్తుల అభివృద్ధికీ సర్వోత్తమ ఆధారంగా బౌద్ధిక, నైతిక, సామాజిక రంగాలలో యుగధర్మాన్ని ప్రతిష్ఠించాలి.

దూరదృష్టి కల వివేకవంతులందరూ భావ విప్లవంలో నిమగ్నులు కావాలి. దీనికోసం–ప్రజలు యుగధర్మాన్ని గుర్తించి పని చేయడానికి ప్రేరణ లభించే విధంగా కలాన్నీ, వాణినీ, దృశ్య, శ్రవణ మాధ్యమాలను ఉపయోగించాలి. సార్వజనీనం, సర్వవ్యాపకం అయిన జ్ఞానయజ్ఞమే నేటి సర్వశ్రేష్ఠ పరమార్థం. దీనిని ఉపేక్షించి–చౌకబారు పొగడ్తల కోసం చిల్లర మల్లర ప్రచారాలు చేయడం వల్ల వాస్తవిక ప్రయోజనం సిద్ధించదు.

ఈ చైతన్యాన్ని మరింతగా ప్రజ్వలింపజేయడానికై ప్రాథమిక అవసరం యుగ సాహిత్యం.దానిని ఆధారం చేసుకొనే చదవడం – చదివించడం, వినడం–వినిపించడం సాధ్యపడుతుంది. చదవగలిగిన వారిచేత చదివించడం ద్వారా, చదువురానివారికి వినిపించటం ద్వారా ప్రజా సమూహానికి సరైన దిశ ఇవ్వగలుగు తాము. దీనికోసం ప్రజ్ఞాయోగ సాధకులు సంచీ – పుస్తకాలయాన్ని నడపడానికి తమ సమయాన్ని, డబ్బును ఉపయోగించాలి. సత్సాహిత్యాన్ని కొనడం పలువురికి కష్టమే. భౌతిక, స్వార్థ సాధనాలు తప్ప మిగిలినవేవీ పట్టని ఈ రోజులలో ఆదర్శాలను గురించి చదివే, వినే అభిరుచే ఉండడం లేదు. కనుక – యుగసాహిత్యాన్ని చదివించడానికి, తిరిగి తెచ్చుకోవడానికీ చదువుకున్నవారి ఇళ్లకు వెళ్లాలి. వారికి చదువదగిన పుస్తకాలను ఇచ్చి తిరిగి తెచ్చుకోవాలి. ఈ చిన్న పని వల్ల జ్ఞానయజ్ఞ మహా ప్రయోజనం పూర్తవుతుంది. చదువు రానివారికి వినిపించడాన్ని దీనితో కలిపి నిర్వహించాలి.

గోష్ఠులకూ, సభా సమ్మేళనాలకు, కథా ప్రవచనాలకు తగు ప్రాముఖ్యం ఉన్నది. వీటిని సత్సంగం అంటారు. కలం ద్వారా, వాణి ద్వారా ఈ పనులను ఏదో ఒక రూపంలో ఎక్కడైనా జరుపవచ్చు. **తాను ఉదాహరణగా నిలబడడం అన్నిటి కంటే ఎక్కువ ప్రభావం చూపిస్తుంది.** ఆదర్శాలనేవి కేవలం వినటానికీ, చదవటానికీ మాత్రమేననీ నిత్యజీవితంలో వాటిని అమలుజరపలేమనీ ప్రజలు భావిస్తున్నారు. జ్ఞానయజ్ఞాన్ని నిర్వహించేవారు, భావవిప్లవాన్ని ప్రస్తావించేవారు ఏమి చెపుతారో, ఇతరుల చేత ఏమి చేయించాలని కోరుతారో వాటిని స్వయంగా తాము ఆచరించి చూపించాలి. ఇతరులను మార్చటం కంటే తమను తాము మార్చుకోవడం చాలా తేలిక. **ఉపదేశం ఇచ్చేవాళ్లు, ఆత్మిక ప్రగతి కొరకు ఆరాధనావ్రతం చేసేవాళ్లు తాము చెప్పేదీ, చేసేదీ ఒకటే అని చూపించాలి.**

ఆదర్శవాదంలో ప్రజలకు శిక్షణ ఇవ్వడానికి ఇది తప్పని సరి. అయినప్పటికీ ఇందులో పూర్ణత్వం లభించేంతవరకు ఖాళీగా కూర్చొనవలసిన అవసరం లేదు. ఆరవ తరగతి చదివే వాడు ఐదవతరగతి చదివే వానికి కొద్దో గొప్పో సహాయం చేయగలడు. తమకంటే తక్కువ యోగ్యత, స్థితి కలవారికి మార్గం చూపటంలో ఎవరైనా సమర్థులు, సఫలురు కాగలుగుతారు.

ఈ రోజులలో పైన చెప్పిన ప్రయోజనాలు యంత్రాల సహాయంతో చాలావరకు సాధించవచ్చు. ప్రాచీనకాలంలో పుస్తకాలను చేతితో వ్రాసేవారు. కాని ఇప్పుడు ముద్రణా లయాలలో యంత్రాల సహాయంతో ముద్రిస్తున్నారు. దృశ్య, శ్రవణ మాధ్యమాలలో కూడా చాలా సౌలభ్యాలు ఉన్నాయి. వాటిని జ్ఞానాన్ని విస్తరింపచేయటానికి ఉపయోగించవచ్చు. టేప్‌రికార్డులతో లౌడ్‌స్పీకర్‌ను ఉపయోగించి సంగీతాన్నీ, ప్రవచనాలను వినిపించవచ్చు. స్లయిడ్ ప్రొజెక్టర్ తక్కువ పెట్టుబడితో ప్రజారంజనంతో పాటు లోకకళ్యాణం అనే

**అవినీతి ముందు శిరస్సు వంచకు**

ప్రయోజనాన్ని సాధించే ఉపకరణం. దీనికోసం వీడియోలు తయారుచేసి టి.వి.లో చూపించవచ్చు.

గోడలపై ఆదర్శవాక్యాలను వ్రాయడం ఒక మంచి పద్ధతి. వీటికి యాంత్రిక సంస్కరణ ఫర్నీచర్‌పై, హేండ్‌బ్యాగులపై అంటించే "స్టిక్కర్". దీని ఆధారంగా సదాలోచనలకూ సద్భావనలకు మంచి ప్రచారం జరుగుతుంది. సినిమా థియేటర్లలో స్లయిడ్లు చూపించడం ద్వారా అసంఖ్యాకులకు ఉపయోగకరమైన ప్రేరణలను కలిగించవచ్చు.

ఎక్కడ కొద్దిమంది చేరతారో అక్కడ సంగీత బృందాలు తమ ప్రచార కార్యాన్ని ఆరంభించవచ్చు. లౌడ్‌స్పీకర్ల నుండి రికార్డులను, టేపులను వినిపించవచ్చు. ఈ సందర్భములో దీపయజ్ఞ ప్రణాళిక చౌక, సుగమం, సఫలం ఐన ప్రక్రియ. దీని ద్వారా ఆత్మనిర్మాణం, మధ్యాహ్న కాలంలో మహిళా సమ్మేళనాల ద్వారా కుటుంబ నిర్మాణం, రాత్రి కార్యక్రమంలో సమాజ నిర్మాణం అనే సంస్కరించే ప్రక్రియను, స్థాపన విధానాన్ని ప్రవేశపెట్టవచ్చు.

రాత్రి సమయంలో కుటుంబంలో కథలు చెప్పడంలో ప్రత్యేక ప్రయోజనం ఉన్నది. దీనికోసం ప్రజ్ఞాపురాణం లాంటి కథల పుస్తకాలు ఉపకరిస్తాయి. ఆలోచనల కలబోత, వాద ప్రతివాదాల పోటీలు, కవిసమ్మేళనాలు కూడా బాగా ఉపయోగకరమైనవి. ప్రతి వ్యక్తి కవితలు స్వయంగా అల్లలేక పోవచ్చు. కానీ ఇతరులు రచించిన ప్రేరణ ఇచ్చే కవితలను వినిపించే ఏర్పాటు ఎక్కడైనా చేయవచ్చు. చిత్ర ప్రదర్శనాలను కూడా వీలున్న స్థలాలలో ఏర్పాటుచేయవచ్చు. ఆలోచిస్తే – ఇటువంటి కార్యక్రమాలు అనేకం స్ఫురిస్తాయి. భావవిప్లవం, సత్ప్రవృత్తుల అభివృద్ధి, దుష్ప్రవృత్తుల నిర్మూలనల కోసం ఏ కొద్దిగానైనా, ఏ పద్ధతిలోనైనా చేయాలని అనుకుంటే – ప్రతిచోటా, ప్రతి ఒక్కరికీ ఏదో ఒక మార్గం తప్పక లభిస్తుంది. అన్వేషించేవారు అదృశ్యంగా ఉన్న పరమాత్ముణ్ణి సైతం చేరగలరు. జ్ఞానయజ్ఞ ప్రక్రియ విస్తరణకు మార్గం తప్పక లభిస్తుంది. కావలసిందల్లా – దాని గొప్పతనాన్ని అర్థం చేసుకోవడం, దానిపట్ల శ్రద్ధవహించడం.

ఉపాసన ద్వారా భావన, జీవన సాధన ద్వారా వ్యక్తిత్వం, ఆరాధన ద్వారా క్రియాశీలత సంస్కరించబడి వికసిస్తాయి. ఆరాధన ఉదారమైన సేవా సాధన ద్వారానే సిద్ధిస్తుంది. సేవా కార్యక్రమాలలో సామాన్యంగా ప్రజలకు సౌకర్యాలు అందించేవి ఉంటాయి. మరొకరి బాధనూ, కొరతనూ తొలగించడం మరింత గొప్ప సేవ. పతనస్థితి నుండి తప్పించి, వ్యక్తిని ఉన్నతస్థితికి తేవడం ఉత్తమోత్తమమైన సేవ. సౌకర్యాలను పెంచే సేవనూ, బాధలను తొలగించే సేవనూ ధనికులు ఎవరైనా చేయగలుగుతారు. కానీ, పతనాన్ని నివారించే సేవ ఆత్మచేతన కలిగిన వ్యక్తి ద్వారానే సాధ్యపడుతుంది. భౌతిక సంపద ద్వారా కాక–దైవీ సంపద ద్వారా జరుగుతుంది ఈ సేవ. దైవీ సంపద ఇచ్చిన కొలదీ తరిగిపోదు, పెరుగుతుంది. కనుక, అది అందరికీ సులువైనది, శ్రేష్ఠమైనది.

సంత్‌లు, ఋషులు పతన నివారణ సేవకు ప్రాధాన్యం ఇస్తూ వచ్చారు. కనుకనే, వారు పూజ్యులు అయ్యారు. సేవను పొందినవారు కూడ గొప్పవారు అయినారు. జ్ఞానయజ్ఞమనే ఈ ఉత్తమోత్తమ సేవను ఎవరైనా చేయగలుగుతారు. తద్వారా వారు స్వయంగా ప్రయోజనం పొందుతారు; లెక్కలేనంతమందికి ప్రయోజనాన్ని చేకూర్చి, పుణ్యాన్ని సంపాదించగలుగుతారు.

*– అనువాదం: ఊటుకూరి సత్యన్నారాయణ గుప్త*

## 9 రోజుల సంజీవనీ సాధనా శిబిరం

*గాయత్రీతీర్థ్, శాంతికుంజ్, హరిద్వార్‌లో ప్రతి సంవత్సరం జరిగెడి 9 రోజుల సంజీవని సాధనా శిబిరం తెలుగు భాషామాధ్యమంగా 11 మే నుండి 19 మే 2015 వరకు జరుగును. ఈ శిబిరంలో పాల్గొనదలచినవారు ఈ క్రింది సమాచారాన్ని తెలుపుచూ శాంతికుంజ్‌నకు లేఖను వ్రాసి వారి స్థానాన్ని ఖరారు చేసికొనవలసిందిగా కోరడమైనది.*

*1. పూర్తిపేరు మరియు చిరునామా; 2. విద్యార్హతలు; 3. వయస్సు & పుట్టినతేది*

*శిబిరంలో పాల్గొనెడివారు శాంతికుంజ్‌నకు 10 వ తేది ఉదయానికి తప్పక చేరుకొనవలయును.*

*లేఖను వ్రాయవలసిన చిరునామా:*
*శ్రీ వేదమాతా గాయత్రీ ట్రస్టు, శాంతికుంజ్,*
*సౌత్‌సెల్, హరిద్వార్ (ఉత్తరాఖండ్)*

**స్వచ్ఛమైన బంగారానికి కూడా మెరుగు అవసరమే**

ఉగాది ప్రత్యేకం

# సామూహిక సాధన ప్రాముఖ్యత

ఈసారి మార్చి 21వ తేదినాడు నూతన సంవత్సరము ఆరంభం కానున్నది. దానితోపాటే పాడ్యమినాడు ఉగాది వేడుకల ప్రారంభంతో చైత్రనవరాత్రులు జరుపుకొంటారు. ఈరోజు బ్రహ్మకు మరోరూపమైన కాలపురుషుడిని సాంగో పాంగముగా పూజించే పద్ధతి ఆచారంలో ఉన్నది. 'అతి ప్రాచీనమైన వైదికకాలము నుండి నూతన సంవత్సర వేడుకలు మహాపర్వము రూపములో జరుపుకొనబడుతున్నాయి. షడృతువుల సమ్మిళిత స్వరూపముగా ఏర్పడి తిరిగే ఒక చక్రము 'సంవత్సరం' అని పిలువబడుతుంది'

అమరకోశము ననుసరించి 'సర్వర్తుపరిత్రస్తు స్మృతః సంవత్సరో బుధై' అనగా ఏదో ఒక ఋతువునుండి ఆరంభమై తిరిగి సరిగ్గా అదే ఋతువు మరల రావటానికి ఎంత కాలము పడుతుందో; ఆ కాలమానమును 'సంవత్సరం' అని పిలుస్తారు. 'ఋతువు' అన్న పదమునకు అర్థము నిరంతర గతిశీలత కలిగి ఉండునది. ఋతువులే కాలము యొక్క గతి! ఋగ్వేదము(10/85/10)లో చంద్రుడు ఋతువులను రచించే నిర్మాణాత్మకకర్తగా వర్ణించబడి ఉన్నాడు. ఈ కారణముగానే ధర్మగ్రంథములలో భారతదేశమున సంవత్సర కాలమానము 'చంద్రసంవత్సరము' అని ప్రముఖంగా ప్రస్తావించబడినది. భారతీయ జ్యోతిషశాస్త్రములో చంద్రగ్రహము ద్వారా మనస్సు నియంత్రించబడుతుందనే విషయము ప్రస్తావించబడినది. చాంద్రమానము చైత్రమాస శుక్లపక్షపాడ్యమితిథినుండి ప్రారంభమై; చైత్రమాస కృష్ణపక్ష అమావాస్యతిథివరకు నడుస్తుంది. వసంతఋతువుతో మొదలయ్యే ఈ సంవత్సరకాలము అన్ని ఋతువుల పరిక్రమ పూర్తయిన పిమ్మట చివరలో తిరిగి వసంతఋతువుతోనే సమాప్తమవుతుంది. వసంతఋతువును 'ఋతువులకు రాజు' అని చెపుతారు.



ఈసారి చైత్రశుక్లపాడ్యమినుండి 2051వ సంవత్సరము ఆరంభమౌతున్నది. బ్రహ్మదేవుని ద్వారా సృష్టి నిర్మాణము ఆరంభమైన తిథినుండి ఈ కాలమానము లెక్కించబడుతున్నది. ఇందువలన ఇది 'సృష్టియొక్క జయంతి' అని కూడా భావించ బడుతున్నది. భారతీయ జ్యోతిష్యశాస్త్ర కాలగణననను సరించి 'చైత్రశుక్ల రాత్రి' నుండి క్రొత్త సంవత్సరము మొదలవుతుంది. ఈసారి వచ్చిన నూతన సంవత్సరము పేరు 'మన్మథ!' అయితే మనము చెప్పుకునే ఆ సంవత్సరము పేరు ఎంత మహత్త్వ పూర్ణమైనదంటే ప్రతి ధార్మికకృత్యములో చెప్పబడే సంకల్పములో సంవత్సరము యొక్క పేరును తప్పక పలుకుతారు. అంతే కాకుండా తీసుకునే సంకల్పము 'రోజు-ముహూర్తము-సమయము-స్థానము-వ్యక్తి' మొదలైనవాటితో ముడిపడి ఉంటుంది కనుక సంకల్పంలో తప్పకుండా సంవత్సరము పేరును ప్రస్తావిస్తారు. ఇలా చెయ్యటం వలన వ్యక్తి మనస్సులో 'తాను సంకల్పము తీసుకున్నాననీ, దానిని పూర్తి చెయ్యాలి అనే తపన ఏర్పడుతుంది. ఇది ఒక హెచ్చరికలాగా అతనిని వెన్నాడుతూ ఉంటుంది.'

మన ఋషులు, మునులు నూతన సంవత్సర వేడుకల శుభారంభమును శక్తి-ఆరాధనతో ముడిపెట్టారు. ప్రకృతే శక్తికి మూలస్రోతము! జగదంబయే ప్రకృతిమాత రూపములో సమస్త సృష్టి యొక్క పాలన-పోషణ కావిస్తూవుంటుంది. పార్వతీదేవియై శంకరభగవానుని అర్ధాంగిగాకూడా ఉండేది ప్రకృతిమాతయే! విభిన్న దేవీ-దేవతల రూపములలో ఆ ఆది శక్తియే సృష్టియొక్క కార్యనిర్వహణాభారమును సంబాళిస్తూ ఉంటుంది. మనందరి జీవితములు ప్రకృతితో ముడిపడి ఉన్నాయి. ఈ ప్రకృతిలో ఏరకమైన వికృతులు తలెత్తినా మనస్సు, శరీరములలో రోగములు పెచ్చరిల్లుతాయి. మన మనస్సు-

శ్రమను కించపరచుట నిర్వీర్యతకు చిహ్నం

శరీరములు ఆరోగ్యముగా ఉన్నప్పుడే మనము జీవితములోని ఆనందమును అనుభూతిచెందగలము. అందుచేత మనస్సు, శరీరములను పరిమార్జనము చేసుకుని, సంస్కరించుకున్నప్పుడే అవి ఆరోగ్యప్రదముగా వుంటాయి. అలాగే సంయమనమును పాటించినప్పుడే ఆరోగ్యము తొణికిసలాడుతుంది. ఈ కారణముగానే నవరాత్రి ఉత్సవములను శక్తి-ఆరాధన, వ్రతము-అనుష్ఠానము మొదలైనవాటితో జోడించారు మన పెద్దలు. ఆ తొమ్మిదిరోజుల అభ్యాసము ద్వారా మనము మన జీవితములో సంయమనమును అలవరచుకోగలుగుతాము, మన శక్తిని సదుపయోగము చేసుకోగలుగుతాము.

మన శరీరము ప్రాకృతిక తత్త్వములచే తయారు చేయబడినది. ఆ ప్రకృతిలో ఉన్న శక్తి ద్వారానే శరీరము సంచాలితము గావించబడుతూ ఉంటుంది. ప్రకృతిలో ఒక ముఖ్య భాగమైన ప్రాణవాయువే శరీరములో శక్తిసంచారమును గావిస్తుంది. ఈ శరీరము నుండి జీవాత్మ విడిపోయినప్పుడు ఈ శరీరము తిరిగి ఈ ప్రకృతిలోనే విలీనమైపోతుంది. ఈవిధంగా చూసినప్పుడు జీవాత్మకు ఆకారమునిచ్చే పనిని ప్రకృతే నిర్వహిస్తుంది. ఒకరకముగా చెప్పాలంటే ఈ శరీరము జీవాత్మకు ఆవాసము!

మనమందరము మన జీవితములో విజయమును అంది పుచ్చుకోవాలనుకుంటాము. ఐతే శక్తిమంతుడే సాఫల్యమును హస్తగతము చేసుకుంటాడు. శక్తి అన్నది ధర్మము వైపు నిలిచినా లేక అధర్మము వైపు నిలిచినా ఈ ప్రపంచములో శక్తియే విజయమును వరిస్తుంది. మనిషి ఎంత తెలివిగల వాడైనప్పటికినీ, ప్రతిభావంతుడైనప్పటికినీ అతను శక్తిహీనుడైతే, శక్తి యొక్క కృప లేకపోతే మాత్రము విజయమును సాధించ లేడు. ఈ కారణముగానే భగవంతుడైన శ్రీరామచంద్రమూర్తి రావణునితో యుద్ధమునకు తలపడే ముందు శరన్నవ రాత్రులను అనుష్ఠించాడు. మహాభారతయుద్ధము ఆరంభించే ముందు అర్జునుడు శక్తి యొక్క ఉపాసన చేశాడు. అందుచేతనే వీరిరువురు విజయప్రస్థానములో సఫలురయ్యారు.

ఈనాడు మనము స్వయముగా మన చేతులతోనే ప్రకృతి యొక్క సంతులనమును దెబ్బతీశాము. ప్రాకృతిక ఆపదల రూపములో దాని ఫలితము మన కళ్ళెదుట కనిపిస్తూనేవున్నది. దీనికితోడు ప్రకృతి యొక్క నియమాలను అవహేళనచేసి కృత్రిమ జీవనశైలిని అవలంబిస్తూ మనము అనేకానేక రోగము లను, వ్యాధులను కొనితెచ్చుకుంటున్నాము. ఇక ఇప్పుడు పరిస్థితులను చక్కదిద్దుకోవాలనుకున్నా, జీవితమును తీర్చిదిద్దు కోవాలనుకున్నా, సంస్కరించుకోవాలనుకున్నా తప్పకుండా ప్రకృతిమాతను సంరక్షించుకుంటూ, దానిలో సంతులనమును తేగలిగే ఉపాయములను గురించి ఆలోచించాలి. అంతే కాకుండా మనము ప్రకృతికి అనుగుణముగా జీవించటమును అలవరచుకోవాలి. అలా చేసినప్పుడే ఈ నూతన సంవత్సరము మన పాలిట వరప్రదాయినిగా నిలుస్తుంది.

యుగనిర్మాణయోజన 2014వ సంవత్సరమును 'సామూహిక సాధనా సంవత్సరముగా' చేపట్టి, ఇప్పటికీ దానిని కొనసాగిస్తున్నది. ఈ కారణముగానే పలుచోట్ల సామూహిక జప-అనుష్ఠానములు, సాధనల క్రమము మలిదశకు చేరుకుంటున్నవి. ఒకవేళ మనిషి కనుక ఒంటరిగా ఏదైనా పనిని చేసినచో అది శ్రేష్ఠమైన రీతిలో సుసంపన్నమైతే కనుక అది మహోన్నతమైన కార్యము అని చెప్పబడుతుంది. కానీ ఒక పనిని సామూహికముగా చేపట్టి, పూర్తిచేసినచో దాని ప్రభావము ఒంటరిగా చేసినదానికంటే గొప్పదిగాను, వ్యాపకముగాను ఉంటుంది. వర్తమానకాలములో ప్రాకృతిక అసంతులనమును, కాలుష్యమును నివారించటానికి తప్పకుండా సామూహిక ప్రయత్నములే చెయ్యవలసిన అవసరం ఉన్నది. యుగనిర్మాణసంస్థలో **'గంగా స్వచ్ఛతా అభియానము, వృక్ష-గంగా అభియానము'** మొదలగు అనేక రకములైన మహోన్నత కార్యక్రమములు సామూహికముగా జరుగుతున్నాయి. మనమందరము శ్రేష్ఠమైన కార్యక్రమములకు మన సంపూర్ణ సహకారమును సామూహికంగా అందించాలి. ఈ నవరాత్రి పర్వము మనందరి జీవితాలను ఆవరించి ఉన్న అవాంఛనీయతత్త్వములను దూరము చేసుకుంటూ, ప్రకృతిని స్వచ్ఛముగా ఉంచుకుంటూ, సంస్కారవంతమైన జీవనశైలిని అలవరచుకునే దిశగా ముందడుగు వెయ్యాలి' అన్న సందేశమును ఇస్తున్నది. ఆ సందేశమును అక్షరాలా పాటించి కాలుష్యమును నివారించుకుని ప్రకృతిని పరిరక్షించు కుందాము, మన జీవితాలను ఆనందమయముగా తీర్చిదిద్దు కుందాము.

– *అనువాదం: శ్రీమతి లక్ష్మీరాజగోపాలు*

**గుడ్డివాడు, కుంటివాడు కూడా పరస్పర సహకారంతో నదిని దాటవచ్చు**

వ్యక్తి నిర్మాణం

# ఆత్మవిశ్వాసమే ఆశావహుల ఆభరణం

చిన్నప్పుడు విన్న తాబేలు-కుందేలు కథ గుర్తుందా? కుందేలు, తాబేలుని గెలిచేయడానికి తనతో పరుగు పందెంలో పాల్గొనమందట. ఎవరు ముందు గమ్యస్థానాన్ని చేరుకుంటే వారు పందెంలో గెలిచినట్లన్నమాట. పోటీ ప్రారంభమైంది. తాబేలు అడుగు తీసి అడుగు వేసే లోపల కుందేలు నాలుగు గెంతులు గెంతింది. కొంత సమయం గడిపిన తరువాత, కుందేలు దాదాపు గమ్యస్థానం వరకు చేరుకొని, ఎక్కడో దూరాన మెల్లిమెల్లిగా వస్తున్న తాబేలుని చూసి అది రావడానికి చాలా సమయం పడుతుందని గ్రహించి ఆ లోపు ఒక కునుకు తీద్దామని నిద్రపోయింది. ఈలోపు తాబేలు తన చిన్ని చిన్ని పాదాలతో వచ్చీ వచ్చీ నిద్రిస్తున్న కుందేలుని దాటేసింది. తాబేలు సరిగ్గా గమ్యస్థానాన్ని తాకబోతుండగా కుందేలుకి మెలకువ వచ్చింది. ఫలితంగా పరుగు పందెంలో తాబేలు గెలిచింది. ఈ కథలో నీతిని చెబుతూ కుందేలు చేసిన తప్పు గురించి చర్చిస్తారు. ఏమి చేయకూడదో చెబుతారు. కానీ, నేను తాబేలుని చూసి ఏమిచేయాలో నేర్చుకోమంటున్నాను. తనకు ఎంత ఆత్మవిశ్వాసం ఉంటే చెంగుచెంగున గెంతే కుందేలుతో పరుగు పందెం ఒప్పుకుంటుంది తాబేలు? తన మీద తనకు నమ్మకం ఉంది కాబట్టే కదా కుందేలుతో పందెం అంటే సై అంది.

మన నిజజీవితంలోనైనా అంతే... ఏదైనా గొప్ప పని సాధించాలంటే అన్నిటికన్నా ముందు మనని మనం నమ్మాలి. 'నేను చేయగలను' అన్న నమ్మకం మనలో ఉండాలి. మనం ఈ ప్రపంచంలో ఎవరిని నమ్మినా, నమ్మకపోయినా పరవా లేదు. కానీ, ఒక్కరిని మాత్రం నమ్మాలి. ఆ ఒక్కరూ ఎవరో కాదు (మీకు) మీరే. ఒక విదేశీ సామెత ప్రకారం ఎవరికైనా ఏదైనా మంచి బహుమతి ప్రదానం చేయాలంటే వారి (యొక్క) ఆత్మవిశ్వాసాన్ని పెంపొందింపజేయాలట.

మనం విజయం సాధించిన అనేకమందిని గురించి వింటుంటాం, చదువుతుంటాం, చూస్తుంటాం, మాట్లాడు తుంటాం. అందులో మనం విజయాన్ని మాత్రమే గమనిస్తాం. నిజానికి, ప్రతీ విజయగాథ ఎన్నో అపజయాల కథ కూడా... విజయం సాధించిన ఎవ్వరినైనా (ఉదాహరణకు) తీసుకోండి. వారు విజయాన్ని పొందటానికి ముందు ఎన్నో అపజయాలు, ఓటములు చవిచూచి ఉంటారు. అయితే ఆ అపజయాలు, ఓటములు, ఛీత్కారాలు, ఈసడింపులు అన్నీ ఆత్మవిశ్వాసం ద్వారా అధిగమించాలి. తమ మీద తాము నమ్మకం పెట్టుకుని అపజయాలను విజయానికి సోపానాలుగా చేసుకున్నారు / చేసుకుంటారు.

కల్నల్ సాండర్స్ గురించి మీరు విన్నారా? కేఎఫ్‌సీ ఫాస్ట్‌ఫుడ్ రెస్టారెంట్ గురించి మీకు తెలిసే ఉంటుంది కదూ... ఈ మధ్య చిన్న చిన్న పట్టణాలలో కూడా కేఎఫ్‌సీ రెస్టారెంట్ తెరవబడుచున్నది. కేఎఫ్‌సీ సృష్టికర్త కల్నల్ సాండర్స్. అతని గురించి కొన్ని విషయాలు చెబుతాను. 1890 లో ఒక నిరుపేద కుటుంబంలో సాండర్స్ మొదటి సంతానంగా జన్మించాడు. తండ్రి అవిటివాడవడం చేత ఉన్న కొద్దిపాటి పొలం కూడా సాగులోకి వచ్చేది కాదు. సాండర్స్‌కి ఐదేళ్ళ వయసులో తండ్రికి జబ్బు చేసి మరణించాడు. తల్లి టమాటాసాస్ తయారుచేసే కంపెనీలో పనిచేయడం వల్ల, సాండర్స్ ఆ కుటుంబానికి వండిపెట్టేవాడు. తన తల్లి సలహా మేరకు కోడిమాంసాన్ని ఒక ప్రత్యేక పద్ధతిలో ఉడికించేవాడు. త్వరగా వంట పూర్తిచేయాలని అన్ని మసాలాదినుసులు ఒకేసారి కోడిమాంసం కూరలో వేసేవాడు.

సాండర్స్‌కి 12 సంవత్సరాలు నిండేలోపు తల్లి మళ్ళీ పెళ్ళి చేసుకుంది. సవతితండ్రి సాండర్స్‌ని కొట్టాడు. కోపంతో అతను చదువు మానేసి ఇంట్లో నుండి వెళ్ళిపోయాడు. ఎక్కడెక్కడో తిరిగాడు. పొట్టికూటి కోసం లాంచీలు నడిపాడు. వ్యవసాయ కూలీగా చేరాడు. ఇన్స్యూరెన్స్ సేల్స్‌మెన్‌గా పని చేశాడు. ఇంకా ఎన్నో వృత్తులు చేశాడు. వ్యాపారము మొదలుపెడితే అది విఫలమై చివరికి తన అరవై ఐదో యేట రోడ్డు మీద పడ్డాడు. అమెరికా ప్రభుత్వం వృద్ధులకు దయతలచి సోషల్ సెక్యూరిటీ అన్న పేరుతో ఇచ్చిన 105 డాలర్లు తప్పించి తనకు వేరే ఆస్తి లేనే లేదు. తన దయనీయ పరిస్థితిని తలచుకుని తన మీద తనకే జాలి వేసింది. అప్పుడు సాండర్స్‌కి జీవితంలో

**మాటని అదుపులో ఉంచుకున్నవారు ఏ పనినైనా సాధించగలరు**

ఏదైనా సాధించాలి అనే తపన పుట్టింది. 65 ఏళ్ళ ముసలి వయసులో ఎవరైనా ఏమి సాధించగలరు? ఏ క్రొత్త వ్యాపారం చేయాలన్నా డబ్బు ఉండాలి కదా. ఆకలి వేయడం లేదు. నిద్ర పట్టడం లేదు. బోనులో చిక్కుకున్న పులిలా ఉంది సాండర్స్ పరిస్థితి.

ఏదైనా సాధించాలన్న తపన ఉంది. కానీ డబ్బు లేదు. ప్రపంచానికి తనేమిటో నిరూపించాలన్న కసి ఉంది. కానీ వయసు లేదు. మామూలు వాళ్ళయితే డబ్బు లేదు, వయసు లేదు అని మాత్రమే చూస్తారు. కానీ అందరికీ భిన్నంగా సాండర్స్ ఇలా అనుకున్నాడు. 'డబ్బు లేకపోయినా, వయసు మీద పడుతున్నా, నాకు నా మీద విశ్వాసం ఉంది. అది చాలు నేను ప్రపంచ ప్రసిద్ధిని పొందడానికి'.

ఏమి చేస్తే నేను విజేతనవుతాను అని తనకి తెలిసిన విద్యలన్నిటిని గుర్తుకు తెచ్చుకుంటుంటే చిన్నప్పుడు తన కుటుంబానికి వండి పెట్టేటప్పుడు కోడిమాంసాన్ని వండిన పద్ధతి గుర్తుకు వచ్చింది. అదే తనకు సరైనదని నమ్మాడు. కోడి మాంసాన్ని వండి విక్రయించాలని చూశాడు. మొదటి ఆర్డర్ సంపాదించడం కోసం సాండర్స్ ఎన్నెన్నో గడపలు తొక్కాడు.

పొద్దునే లేవడం, తన వంటకాన్ని తయారు చేసుకుని సిద్ధమవడం, గొప్ప గొప్ప వ్యక్తుల దగ్గర, పెద్ద పెద్ద రెస్టారెంట్ యజమానుల దగ్గర అపాయింట్‌మెంట్ తీసుకోవడం, వారిని వెళ్లి కలవడం, వారికి తన వంటకాన్ని రుచి చూపించడం. ఇదీ తన దినచర్య. రుచి చూసిన వాళ్ళు ఫరవాలేదు బాగానే ఉంది అని అనేవారే తప్ప భలే బాగుంది, దీనితో వ్యాపారం చేద్దామని చెప్పిన వారు ఒక్కరు కూడా లేరు.

రోజులు గడిచిపోతున్నాయి. నెలలు దొర్లిపోతున్నాయి. సాండర్స్ కనీసం వెయ్యి మంది క్రొత్త వ్యక్తులను కలిశాడు. తన వంటకాన్ని రుచి చూపించాడు. వ్యాపారము గురించి మాట్లాడాడు. కనీసం ఫంక్షన్లకైనా తన వంటకానికి అవకాశం ఇవ్వమని బతిమిలాడాడు. 1015వ వ్యక్తి సాండర్స్‌కి అవకాశం ఇచ్చాడు. అలా పుట్టింది కేఎఫ్‌సీ.

ఇప్పుడు కేఎఫ్‌సీ ఎంత పేరు సంపాదించిందంటే, ప్రజల మన్ననలు ఎంతగా పొందుతుందంటే, ఆ వంటకాన్ని తయారు చేసి, అమ్మడానికి 112 దేశాలలో 18000 లకు పైగా దుకాణాలు, రెస్టారెంట్ చైనులు కేఎఫ్‌సీతో అనుబంధమైనవి. ఇంతకీ కేఎఫ్‌సీ పూర్తి పేరు కెంటకీ ఫ్రైడ్ చికెన్. కెంటకీ అనేది అమెరికాలోని ఒక రాష్ట్రం పేరు. సాండర్స్ నివసించిన ప్రాంతం కెంటకీ. కేఎఫ్‌సీ అంటే కోడిమాంసాన్ని ఫ్రై (ఇగురు) చేసి అమ్మేచోటు. కేవలం కోడిమాంసపు వంటకానికి ఒక దుకాణముందంటే మొదట్లో నేను కూడా నమ్మలేదు. కానీ, ఆ వంటకాన్ని లొట్టలేసుకుంటూ తినే వాళ్ళ సంఖ్యను ఇంటర్నెట్‌లో చూసి ఆశ్చర్యపోయాను. రోజుకి కొన్ని లక్షల కోళ్ళు ఈ కేఎఫ్‌సీ వాళ్ళ 'ఒరిజినల్ రెసిపి' పేరు మీద ఫలహారమైపోతున్నాయని తెలుసుకున్నాను. ఈ రహస్యమైన ఒరిజినల్ రెసిపితో సాండర్స్ ఎన్ని లక్షల కోట్లు సంపాదించి ఉంటాడో ఊహించుకుంటే 'అమ్మో!' అని అనిపిస్తుంది.

టీవీలలో కేఎఫ్‌సీ గురించిన వాణిజ్య ప్రకటన మీరందరూ చూసే ఉంటారు. మన రాష్ట్రంలోనే కేఎఫ్‌సీ వాణిజ్య ప్రకటనల ఖర్చు 30 కోట్ల రూపాయలు అంటే మీరు నమ్మగలరా? ఇంతటి భారీ సంస్థ ఏర్పడటానికి అది వివిధ దేశాలలో తనదైన కీర్తిని గడించడానికి కారణం సాండర్స్ మరియు సాండర్స్‌లోని విశ్వాసం. సాండర్స్‌కి తన మీద తనకున్న విశ్వాసం అతనిని ఒక గొప్ప వ్యాపారవేత్తగా నిలబెట్టింది.

మనలో ఎంతమంది సాండర్స్‌లా వ్యవహరించగలం? తన మొదటి ఆర్డరు తెప్పించుకోవడానికి సాండర్స్ వెయ్యి మందిని పైగా కలిశాడు. వేలసార్లు ప్రయత్నించాడు. మనమైతే ఒక నాలుగు, ఐదుసార్లు ప్రయత్నించి వదిలేసేవాళ్ళం. మరీ మొండి ఘటాలైతే ఒక 50, 60 సార్లు ప్రయత్నించేవారు. ఎవరైనా వెయ్యిసార్లు అంతే ఉత్సాహంతో తమ వంటకాన్ని రుచి చూపిస్తారా? ఆ పని సాండర్స్ చేశాడు. ఒక్కసారి ఊహించండి. తన మీద, తను వండిన వంటకం మీద తనకి ఎంత నమ్మకం ఉంటే సాండర్స్ గడప గడపకి అలుపు లేకుండా తిరుగుతుంటాడు.

విజయాన్ని పొందడానికి కావలసినది – వయసు కాదు, డిగ్రీలు కాదు, అనుభవం కాదు, ఆస్తిపాస్తులు అంతకన్నా కాదు. అన్నిటికన్నా ముందు ఉండవలసినది ఆత్మవిశ్వాసం. అది ఉంటే మిగతావి కాలక్రమేణా సమకూరుతాయి. ఆత్మ విశ్వాసం లేకుండా మిగతా ఏమున్నా, వాటి ప్రయోజనం ఏమీ లేదు.

**క్రియారహితమైన ఆలోచన కుంటిది - ఆలోచనారహితమైన క్రియ గుడ్డిది**

బిథోవెన్ పేరు ఎప్పుడైనా విన్నారా? ప్రపంచ సంగీత చరిత్రలో బిథోవెన్ కాలం ఒక స్వర్ణయుగమని చెప్పక తప్పదు. 1770 లోని బిథోవెన్ గురించి చెబుతుంటే నేటికి సంగీత కళాకారులు చెవి కోసుకుంటారు. చిన్నప్పుడు సంగీత జ్ఞానం అసలు లేనేలేదని బిథోవెన్‌ని అతనికి సంగీతం నేర్పిన గురువులు తిట్టిపోస్తుండేవారు. బిథోవెన్ తండ్రి కూడా సంగీతవిద్వాంసుడే. అతను చాలా కోపిష్టి. బాల బిథోవెన్ కీ-బోర్డు ముందు కన్నీళ్ళు పెట్టుకున్న సందర్భాలు కోకొల్లలు. బిథోవెన్ ఈ లోకానికి కొన్ని గొప్ప పాటలను అందించాడు. అతని ప్రసిద్ధమైన కృతులతో 9 సింఫనీలు, 5 పియానో కాన్సర్టులు, 32 పియానో సొనాటాలు, 16 స్ట్రింగ్ క్వార్టెట్‌లు ఉన్నాయి. వీటిని సంగీత ప్రపంచం ఎప్పటికీ మరచిపోలేదు.

బిథోవెన్‌కి 26 సంవత్సరాలు వయసు వచ్చేసరికి తనకి వినికిడి లోపం ప్రారంభమైంది. అనతికాలంలోనే పూర్తిగా చెవుడు వచ్చేసింది. అయినా సరే ప్రపంచప్రఖ్యాతి గాంచిన పియానిస్టు అయ్యాడు. చాలామందికి తెలియని విషయం ఏమిటంటే బిథోవెన్ చెవిటివాడని. ప్రపంచానికి అద్భుతమైన సంగీతాన్ని, మధురమైన స్వరాలని వినిపించాడు. బిథోవెన్‌కి ఆరోగ్యం సరిగ్గా ఉండేది కాదు. ఎప్పుడూ ఏదో ఒక వ్యాధితో బాధపడుతుండేవాడు. విపరీతమైన కడుపునొప్పి, బై-పోలార్ డిసార్డర్ తన చిరకాల నేస్తాలు. నొప్పిని, వేదనను తట్టుకోలేక ఆత్మహత్య చేసుకుందామని బిథోవెన్ ఎన్నోసార్లు ప్రయత్నించాడు.

తను వేదికమీద వాయిస్తుంటే - ప్రేక్షకులు పూర్తిగా మంత్రముగ్ధులైపోవాలని బిథోవెన్ ఆరాటపడిపోయేవాడు. ప్రేక్షకులు తన సంగీతాన్ని పెడచెవిన పెట్టారని తెలిసిందో, తన ప్రదర్శన అర్ధాంతరంగా ఆపేసేవాడు. తను మిగతావారు, ప్రేక్షకులు ఏమంటున్నారో వినలేడు. కానీ, చూడగలడు. తన 9 వ సింఫనీ తరువాత ప్రేక్షకుల కరతాళధ్వనులు (చప్పట్లు) చూశాడు. వాటిని పూర్తిగా ఆస్వాదించలేకపోతున్నందుకు అందరి ముందు చిన్నపిల్లాడిలా భావుకుడై ఏడ్చేశాడు. 9 వ సింఫనీ 1824 లో జరిగింది. అంటే తన 54 ఏట జరిగిన ఘట్టమది. అంతకు 28 ఏళ్ళకు పూర్వం నుండి బిథోవెన్‌కి వినికిడి లోపం. ఒక్కసారి ఆలోచించండి. ఒక బధిరుడు ఎంతగా కృషి చేసి ఉంటే కొన్నివేలమందిని మెప్పించగలడు? 'నాకు చెవుడు వచ్చేసింది'లే అని ఒక మూలన కూర్చోకుండా ప్రపంచం మెచ్చుకునేలా సంగీత దర్శకత్వ బాధ్యతలు నిర్వహించడమేమిటి? తనమీద తనకు ఎంతో అచంచల విశ్వాసం ఉంటే గాని ఇలాంటి సాహసకృత్యానికి పూనుకోడు.

అనుకుంటే ఏదీ అవరోధం కాదు. ఏదైనా సాధించాలని నడుం బిగిస్తే, ఎంత పెద్ద అవాంతరాన్ని అయినా ఎదుర్కొన వచ్చు. దానికి కావలసినది ఆత్మవిశ్వాసం. మనం తలచుకుంటే దేన్నయినా సాధించగలమన్న ధీమా మనలో కూడా ఉండాలి. గొప్ప పనులు సాధించినవారి బాట అంతా పూల బాట కాదు. ఎన్నో పరీక్షలు, ఎన్నో అవరోధాలు, ఎన్నో ముళ్ళు వారి బాటలోనే వచ్చాయి. అయితే వాటిని తప్పించుకుని తమ గమ్యస్థానాలు చేరుకున్నారు. మనం కూడా గొప్పవారి అనుభవాల నుంచి నేర్చుకుందాం. మీమీద మీకు నమ్మకం ఉంటే ఏ పెద్ద లక్ష్యం అయినా మీ ఆత్మవిశ్వాసం ముందు చిన్నదే అవుతుంది. వయసు మీదపడుతున్నా ఫరవాలేదు, ఆస్తులు కోల్పోయినా ఫరవా లేదు, శరీరంలోని అవయవాలు కోల్పోయినా ఫరవాలేదు. శక్తి కోల్పోయినా ఫరవాలేదు. మనం ఆత్మవిశ్వాసం కోల్పోకపోతే మనం ఏదీ కోల్పోయినట్లు కాదు.

కష్టాలు అందరికీ వస్తాయి. ఒక్కసారి కష్టం వస్తే మనలో చాలామంది దిగులుపడిపోతారు. తమ సామర్థ్యం మీద తమకి అనుమానాలు వస్తుంటాయి. ఫలితంగా ఆత్మవిశ్వాసాన్ని కోల్పోతారు. కష్టాలకు, నష్టాలకు కుంగిపోతే, ఆత్మవిశ్వాసం సన్నగిల్లిపోతే 'విజయం' దూరమవుతుంది. లక్ష్యం గొప్పదై నప్పుడు కష్టనష్టాలు సహజం. మనల్ని కృంగదీసే శక్తిని మనం కష్టనష్టాలకు ఇవ్వకూడదు. కష్టం వచ్చినప్పుడు ఒక్క కన్నీటి బొట్టు రాలిస్తే రాల్చండి కానీ, కష్టాన్ని మన ఇష్టమైన లక్ష్యం మీద ప్రతికూల ప్రభావాన్ని చూపనీయకుండా చేయండి. 'నీకు అంత శక్తి లేదమ్మా' అంటూ కష్టాన్ని మన ఆత్మవిశ్వాసం అనే ఆయుధంతో తరిమేయండి. మనల్ని మరింత రాటుదేల్చే సాధనాలుగా కష్టాలని మార్చుకోండి.

ఒక్కటే గుర్తుంచుకోండి. ఆత్మవిశ్వాసముంటే అసాధ్యమైనా సుసాధ్యమైపోతుంది. ఆత్మవిశ్వాసం గలవారే అందరికంటే ఎక్కువ ఆస్తిపరులు. కాబట్టి ఏది కోల్పోయినా మీమీద మీకున్న విశ్వాసాన్ని మాత్రం కోల్పోవద్దు.

- మీరు 'శ్రీ'లు పుస్తకం నుండి

*శ్రీ అద్దంకి శ్రీధర్‌బాబు ఐ.ఎ.ఎస్. గారి సౌజన్యంతో*

**ఉదార చిత్తులు స్వయంగా కష్టాలలో ఉన్నప్పటికీ సత్కర్మలకు సహాయం చేయుటలో వెనుకంజ వేయరు**

కుటుంబ నిర్మాణం

# ధర్మపత్నిని ఉపేక్షించరాదు

మన సమాజంలో స్త్రీ మరియు పురుషుడు నిర్వర్తించెడి పనులలో ఒక సరిహద్దురేఖను నిర్వచించారు. ఇంటి పనులైన వంట చేయుట, పిల్లలను సంరక్షించుట, ఇంటిని బట్టలను శుభ్రపరచుట మున్నగు పనులు నిర్వర్తించుట గృహిణి బాధ్యతగా పేర్కొన్నారు. అట్లే ఇంటి వెలుపల పనులైన వ్యవసాయం, ఉద్యోగం చేయుట మున్నగువానిని గృహ యజమానియైన పురుషునివిగా పేర్కొన్నారు. తత్ఫలితంగా ఈ రీతిగా జరిగిన పని విభజన ఏ రీతిగా పరిణమించినదనగా, స్త్రీలు చేసెడి తేలికపాటి పనులను పురుషులు చేయుట నామోషిగా సంకోచంతో చేసెడివానినిగా పరిగణించుట జరుగు చున్నది. అట్లే ఇంటికి వెలుపల నిర్వహించెడి పురుషుల పనులను- స్త్రీలు చేపట్టుట నిందనీయమైన చేష్టగా అభివర్ణించ సాగిరి. కాని నేటియుగంలో ఈ అడ్డురేఖలు లేక లక్ష్మణ రేఖలు తొలగిపోతున్నాయి. కాని బలీయంగా పాతుకుపోయిన పూర్వసంస్కారాల కారణంగా మన దేశంలో స్త్రీ-పురుషుల కార్య క్షేత్రాలలో ఈ విభజనరేఖ ఇంకా పూర్తిగా చెరగిపోలేదు.

పై కారణంగా నేటి సామాజిక స్థితిగతులననుసరించి, ప్రగతిని ఆశించెడివారు ఈ లక్ష్మణరేఖను అతిక్రమించుటకు జంకుచున్నారు. కావున నేడు మనము ఈ దుస్థితి నుండి బయటపడుటకై తగిన రీతిగా ఆలోచించిననే గాని అడుగు ముందుకు వేయజాలం.

సామాన్యంగా భార్యభర్తలిరువురు కలసి ఒక ఉమ్మడి వ్యక్తిత్వాన్ని నిర్మించుకొని, దీనిని ఆధారంగా చేసికొని తమ ఉమ్మడి జీవనయాత్రను కొనసాగిస్తారు. అట్లే ఒకరి పనులలో మరియొకరు సాయమందించుట ఇరువురికి తప్పనిసరి. ఏలనన భార్యా-భర్తల మధ్య పనులలో విభజన చేస్తూ సరిహద్దు రేఖను నిర్దేశించుట సాధ్యం కాదు. భార్యాభర్తలిరువురు ఒకరిపట్ల మరొకరు సంపూర్ణ విశ్వాసము కలిగి అవసరాను సారం ఒకరి పనులలో మరియొకరు సాయమందిస్తూ, మద్దతిస్తూ ఇంటి పనులలో గాని లేక బయటి పనులలో కాని సహకరించుకొనుటే అసలైన దాంపత్య జీవనసారం.

సర్వసాధారణంగా భోజనం సిద్ధం చేయుట భార్య పని, ఏలనన భర్త పని మీద బయటకు వెళ్ళివచ్చుట మరియు భార్యకు ఇతర పనులేమి లేకుండుట, అట్టి వేళలందు భార్య భోజనాన్ని సిద్ధం చేయుట ఉత్తమం! అట్లుకాక, అవసర సమయాల్లో భోజనాన్ని సిద్ధం చేసెడి బాధ్యతను భర్త స్వీకరించి భార్యలా ఉత్సాహంగా పూర్తిచేయాలి! కాని ఎక్కువమంది పురుషులు పొయ్యిని ఊదుట సిగ్గుచేటని భావించెదరు. ఇది ఎంత భేద బుద్ధితో కూడినది. భార్య తన జీవనపర్యంతం పొయ్యిని ఊదుతూ భర్తకు భోజనాన్ని సిద్ధం చేస్తూ ఎల్లవేళలా అందిస్తూ ఉంటుంది. ఆమె రోగగ్రస్తురాలైనప్పుడు లేక భయం, బాధలతో సతమతమౌతూ అసమర్థురాలైనచో ఆమె భర్త ఆమె పనులు చేయుటను అవమానంగా భావించుట నేరము కదా!

కాని సమర్థుడైన భర్త- తన భార్యకు సరిజోడిగా నిలచి ఆమెను అర్థం చేసికొని, తన భార్య పనులను చేయుటకు ఎన్నడూ సంకోచించదు. దీనికి నిజజీవితంలో ఉదాహరణ రష్యా దేశపు నాయకుడు లెనిన్ మహాశయుడు. ఆయన గృహస్థ జీవితాన్ని అధ్యయనం చేసినవారికి లెనిన్ తన భార్యకు ఎంత గొప్ప సహచరునిగా మసలుకొన్నాడంటే, ఆయన ప్రతిపనిలో తన భార్యకు సహాయసహకారములందించాడని తెలుస్తుంది. లెనిన్ బజారుకు కాలినడకతో వెళ్ళి చిల్లర సరకులను తెచ్చి తన భార్యకందించెడివాడు. అట్లే వంట చేయుటను కూడా లెనిన్ దంపతులు సమయానుసారము పంచుకొన్నారు. ఒకరు ఒక సమయంలో చేస్తే, మరో సమయంలో రెండవవారు చేసెడివారు.

ఇట్టి సహాయసహకారములు అవసరమేకాక, అనివార్యం కూడా. ఏలనన భార్యతోపాటు భర్త కూడా కుటుంబ నిర్వహణ పరమైన అన్ని పనులలో సమర్థుడై ఉండుట ఉత్తమం. మీకు గుర్తుండే ఉంటుంది. నలుడు పాకవిద్యలో నిపుణుడు. ఈ కారణం చేతనే స్వయంవర సమయమందు దమయంతి, నలుడిని గుర్తించగలిగింది. అట్లే గదాధారియైన భీమసేనుడు- విరాట్‌రాజు కొలువులో ప్రధాన వంటవానిగా నియుక్తుడైనాడు. అట్లే స్వామి వివేకానందుడు తన స్వహస్తాలతో అత్యంత రుచికరమైన భోజనాన్ని తయారుచేసెడి వాడు. అట్లే గాంధీ కూడా ఇంటి పనులలో తన భార్యకు సంపూర్ణ సహాయ సహకారములను అందించెడివాడు. మంచి భోజనాన్ని

**నిజాయితీతో కూడిన శ్రమతో లభించిన సంపదే హితకరం**

తయారుచేయుట దగ్గర నుండి, అంట్లు తోమి, ఇంటిని శుభ్రపరచుట వరకు అన్ని పనులలో బాపూ ఇంటి పనులను చేసేవాడు. వీనికి తోడు మన ఇతిహాస గ్రంథాలలోని మహాపురుషులలో ఏ ఒక్కరు, ఇంటి పనులలో తన భార్యకు సహాయ సహకారములను అందించుటలో సంకోచించుట కాని, జీవితాలలో కలసి ముందుకు పయనించుటలో భార్యకు చేదోడు-వాదోడుగా నిలవని వారులేరు. భార్య తన జీవితాంతం భర్త-పిల్లల బట్టలను ఉతికి శుభ్రపరుస్తుంది. వారికి సేవలు కూడా చేస్తుంది. ఇంకా అవసరమైన వానినన్నింటిని వారికి సమకూర్చుటకెటువంటి సంకోచాన్ని ప్రదర్శించదు. కాని ఇంతలా సేవలందించుటకు భర్త సంకోచిస్తాడు. భర్త అవమానంగా భావిస్తాడు. ఈ రీతిగా పత్నికి సేవలు అందించుటకు సంకోచించెడివాడు, ఉత్కృష్టునిలా ఎలా తయారుకాగలడు? కాని యథార్థంగా అట్టి భర్త ఎన్నటికి ఉత్కృష్టునిగా ఎదగజాలడు.

కుటుంబ పరివారమంతటిలో స్త్రీలు రాత్రింబవళ్ళు పనిలో నిమగ్నమై ఉంటారు. వారికి విశ్రాంతి పొందుటకు ఒక్క క్షణం కూడా అవకాశం లభించదు. దీనికి భిన్నంగా పురుషులలో ఎక్కువమంది వారి సమయంలో ఎక్కువ భాగాన్ని వ్యర్థంగా సోమరిగా గడుపుతూ, మజా చేస్తూ, పేకాట, చదరంగ మాడుతూ గడిపెదరు. కాని వీరు గృహిణి నిత్యకృత్యాలలో ఏమాత్రం సహకారమందించుటకు ఇష్టపడకపోగా, ఆమె నిస్సహాయురాలిగానున్నను, సోమరిలా తమ సమయాన్ని వృథాగా వెళ్ళబుచ్చెదరు. భార్య ఏ రీతిగా అలుపెరుగక నిరంతరం కుటుంబానికి తన సేవలనందిస్తూ ఉంటుందో అదే రీతిలో భర్త శ్రమించుట తన కర్తవ్యంగా భావించాలి. అట్లే అవసర మేర్పడినప్పుడు భార్యకు తప్పనిసరిగా భర్త సేవచేయాలి. అట్లే భార్య యొక్క విశ్రాంతిని ఆరోగ్యాన్ని ఎల్లప్పుడు దృష్టిలో నుంచుకొని భర్త ఆమె పట్ల తగిన శ్రద్ధ వహించాలి. ఇట్లు చేయుట వలన వ్యాకులతకులోను కాదు ఆ కుటుంబం.

కావున మీ దాంపత్యజీవితాన్ని సుఖ సంతోషములతో నింపుకొన నెంచిన మరియు భార్య ఆరోగ్యాన్ని, క్షేమాన్ని కోరుకొనుచున్నచో భార్య చేసే అన్ని పనుల్లో చేదోడు వాదోడుగా నిలచి ఆమెకు తగిన సహాయ సహకారములను అందించుట తప్పనిసరి. అట్లే ఏదైనా కారణం చేత భార్య భోజనం తయారుచేయలేని పరిస్థితి ఏర్పడినచో, భర్తే అదే సద్భావనతో తన భార్య చేసిన రీతిలో భోజనాన్ని తయారుచేయాలి.

భార్య జబ్బుపడినచో ఆమెకు శుశ్రూష మరియు సేవ చేయవలసి వచ్చినచో ఏమాత్రం తటపటాయించరాదు. తదుపరి భార్యకు సేవలందించవలసిన అవసరమేర్పడినచో, ఆమె జీవనపర్యంతం అప్పటివరకు తనకు, కుటుంబానికి అందించిన సేవా-ఋణాన్ని తీర్చుకొనుటకై లభించిన అవకాశంగా దీనిని భావించి, భర్త ఆమెకు తగిన సేవలను ప్రేమాస్పదంగా అందించాలి. తద్వారా భార్యను అనవసర వ్యాకులత నుండి దూరముగావించగలడు. భార్యను తగిన రీతిలో రంజింపచేస్తూ ఆమె ఆరోగ్యాన్ని కాపాడుతూ, ఆమె ఆహార విహారాదులలో ఆనందించేలా భర్త చూడాలి. అట్లే పండుగ వేళల్లో, ఉత్సవ సమయాల్లో ఆమె సహచరులతో ఆనందంగా గడపనెంచినచో ఆమెకు తగిన సహాయ సహకారములను అందించి, భర్త తాను ఇంటివద్ద ఉండి ఇంటి బాధ్యతలను నిర్వహించాలి. అన్నింటికన్నా అత్యంత మహత్త్వ పూర్ణమైన విషయము భార్య-భర్తల నడుమ ఎటువంటి భేద భావములకు తావివ్వక, సరిహద్దురేఖలు గీచుకొనక, మమేకమై వ్యవహరించాలి.

*- మూలం: పూజ్య గురుదేవుల సాహిత్యం నుండి*
*సంకలనం: ఎ. వేణుగోపాలరెడ్డి*

## మాతా గంగా ప్రక్షాళన అభియాన్

*గంగానది ప్రక్షాళన కార్యక్రమం శాంతికుంజ్ హరిద్వార్ వారి సారథ్యంలో 11 మే నుండి 13 మే 2015 వరకు కాశీనగరం ఉత్తరప్రదేశ్‌లో జరుగనున్నది. దీనిలో పాల్గొనదలచినవారు తగిన శారీరక దారుఢ్యాన్ని కలిగి, శ్రమిస్తూ 3 రోజులపాటు గంగానదిలోని కాలుష్య, మురికి పదార్థాలను తొలగించెడి పనిని చేయగలిగి ఉండాలి. అట్టివారు మాత్రమే దీనిలో పాల్గొనుటకు అర్హులు. ఆసక్తి ఉన్న గాయత్రీ పరివార్ సభ్యులు తమ రాకను, తమ పూర్తి వివరాలను తెలుపుచూ శాంతికుంజ్, సౌత్‌సెల్, హరిద్వార్‌కు జాబు వ్రాసి అనుమతి పొందవలసినదిగా కోరడమైనది.*

*లేఖను పంపవలసిన చిరునామా:*
*శ్రీ వేదమాత గాయత్రీ ట్రస్టు*
*శాంతికుంజ్, సౌత్‌సెల్, హరిద్వార్, ఉత్తరాఖండ్*

**మధురంగా మాట్లాడితే మంగళకరం**

# భవిష్యత్తులో మానవుడు ఎలా ఉంటాడు?

'ఈ సృష్టి ఏవిధంగా ఉత్పన్నమైనది, మానవుని ఆవిర్భావము ఎలా జరిగింది? అనేక రకాలైన నాగరికతలకు చెందిన మజిలీలలను దాటుకుంటూ అతడు ఈనాటి ఉన్నత స్థితికి ఏవిధంగా చేరుకున్నాడు? ఈ మజిలీలగుండా ప్రయాణించే టప్పుడు అతడు ఎలాంటి ఎగుడుదిగుళ్ళను ఎదుర్కొనవలసి వచ్చింది?' మొదలైన ఎన్నో ప్రశ్నలను మానవుడు ఎంతకాలం నుండి ఎదుర్కొంటున్నాడో తెలియదు. ఈ ప్రశ్నలకు సమాధానాలను వెదకటానికి అతడు తన బుద్ధిని పరిగెత్తిస్తాడు, ఎన్నోవిధాలుగా ఊహిస్తాడు, తథ్యాలను, ఋజువులను చూపించవలసి వచ్చినప్పుడు ఆ ఊహల్లో నుండి ఉపయుక్తమైనవాటిని ఎంచుకొని, పనికిరానివాటిని వదలివేస్తాడు. అయినా ఇప్పటివరకు అతనికి కచ్చితమైన సమాధానం ఏదీ లభించలేదు. ఒక అభిప్రాయమునకు వచ్చేముందే, మరియొక అభిప్రాయము తలెత్తుతుంది. అంతేకాదు ఈ రెండవ అభిప్రాయము మొదటిదానిని ఛిన్నాభిన్నము చేసివేసి తనను తానే ప్రతిష్ఠించుకుంటుంది. ఈ క్రొత్త అభిప్రాయమునకు ఋజువుగా వాస్తవాలన్నీ జోడింప బడటము లేదు. ఈవిధంగా మానవుడు తన 'ఆవిర్భావము' ఎలా జరిగిందనే విషయమును ఇప్పటివరకు నిర్ణయించు కొనలేకపోతున్నాడు. అసలు అతని ఉనికి ఎలా ఏర్పడింది? ఈ సృష్టిక్రమములో ఎదురయ్యే ఝంఝూవాతాల నడుమ పడుతూ లేస్తూ అతడు తన ఉనికిని సురక్షితముగా ఎలా ఉంచుకొనగలిగాడు? ఎలా ముందుకు సాగగలిగాడు?

ఆదిమానవుడు మనువు అని, ఆయన సంతానమే మానవులని పౌరాణికుల అభిప్రాయము. నిషిద్ధఫలాన్ని తినుటవల్ల ఆడమ్, ఈవ్ స్వర్గంనుండి క్రిందికి త్రోసివేయబడ్డారని క్రైస్తవుల భావన. బ్రహ్మదేవుడు సృష్టిని ప్రారంభించి అన్నింటి కన్నా సర్వశ్రేష్ఠమైన ప్రాణిగా మానవుడిని సృజించినట్లు భారతీయుల ధర్మగ్రంథాలలో వర్ణించబడినది. ఈవిధమైన పౌరాణిక వ్యాఖ్యానాలతోను, ప్రతిపాదనలవల్లను అభివృద్ధికి సంబంధించిన సమాధానమేదీ లభించనందున విజ్ఞానశాస్త్రము వైపుకు దృష్టి మరల్చవలసివచ్చింది. విజ్ఞానవేత్తలు గట్టి ఋజువులను ఆధారముగా చూపిస్తూ దీనికి కొంత సంతోషకర మైన సమాచారమును ఇవ్వటానికి ప్రయత్నములు చేశారు. కానీ ఆ సమాధానముల వలన కూడా సంపూర్ణమైన పరిష్కారము లభించటము లేదు.

అసలు మొట్టమొదట ఏ భూభాగము మీద మానవుడు అవతరించాడు? అన్న ప్రశ్న గురించి వైజ్ఞానికుల మధ్య అభిప్రాయ భేదములున్నాయి. అయితే ఈ విషయమై పరిణామ క్రమమును అనుసరించే వికాసశాస్త్రజ్ఞులు 'ఇప్పటికి 35 కోట్ల సంవత్సరములకు ముందు మన పూర్వీకులు -అమీబా, చేప వంటి చిన్న చిన్న జలజంతువుల రూపములో ఉండేవారు' అనే అభిప్రాయముతో ఏకగ్రీవముగా ఏకీభవిస్తున్నారు. 27 కోట్ల సంవత్సరములకు పూర్వము వారు భూమిపై-నీటిలో రెండువిధాలుగా సౌకర్యముగా తిరుగగలిగేవిధంగా వారి శారీరక నిర్మాణము ఉండేదని తెలుస్తున్నది. 20 కోట్ల సంవత్సరములకు మునుపు పాకే జంతువుల ఉనికి ఉండేదనీ, 7 కోట్ల ముందు నుండి మాత్రమే అవి స్థనపానము చేసేవిగా తయారైనవని చెప్పబడుతున్నది. మనిషి వంటి ఆకారము గలిగిన ప్రాణి ఉనికి అసలు ఎప్పుడు ఏర్పడింది? 5 లక్షల సంవత్సరములకు పూర్వము అని దీనికి సమాధానము చెప్తున్నారు. అయితే అప్పుడు కూడా వారి ఆకృతి, ప్రకృతి ఈనాటి మానవునికి భిన్నంగా ఉండేది. వాళ్ళను వన్యమానవుల వంటి కోతుల జాతిలో ఉంచవచ్చు. ఈ రూపములో ఉన్న ఆదిమానవుడిని పెకిన్ అనేవారు. వెడల్పైన కనుబొమ్మలు, వాటి క్రింద ముందుకు పొడుచుకువచ్చిన ఎముకలతో అతడు నిజముగా చాలా విచిత్రమైన పద్ధతిలో ఉండేవాడు. వైజ్ఞానిక ఊహను అనుసరించి ఆదిమానవుని రేఖాచిత్రమును తయారు చేస్తే బహుశా చూడటానికి గూడా భయంకరముగా, వికృతముగా ఉంటుందేమో!

మనిషిలాగానే ఇతర జీవజంతువులలో కూడా పరిణామ క్రమము జరిగిందని చెప్పబడుతున్నది. పూర్వకాలమునాటి కాయోట్ (कायोट) నుండి గొఱ్ఱెల ఉనికి ఏర్పడినట్లు చెప్తున్నారు. కాయోట్‌లకు ఈనాటి గొఱ్ఱెలకు మధ్య అసాధారణమైన తేడా

**శ్రమ అనెడి పెట్టుబడితో ఉపార్జన లభిస్తుంది**

ఉన్నది. అది కొన్ని అంశాల్లో పెరిగింది, కొన్ని అంశాల్లో తగ్గింది.

ప్రాచీనకాలపు మహాగజములు, పాకే జంతువులు ఈనాటి ఏనుగులు, తొండలతో పోలిస్తే ఎన్నోరెట్లు పెద్దవి, అత్యధికముగా శక్తివంతమైనవి, కానీ మానవ శరీరము, శారీరక శక్తిదృష్ట్యా చూస్తే అతడు తన పూర్వీకులకన్నా బలహీనముగానే అవుతూ వస్తున్నాడు. కానీ జ్ఞానము, నైపుణ్యము, సాధనములు, ఉపకరణముల విషయానికి వస్తే చాలా అభివృద్ధిని సాధించాడు. ఈవిధంగా ఒకవైపు తగ్గుదల, మరియొకవైపు ఎదుగుదల తమ తమ క్రమాలలో సాగిపోతున్నాయి. ఈ రెండు చక్రాలమీద ఆధారపడి ఉన్న ప్రగతి రథం అటుఇటు ఊగుతూ కదులుతు ఇక్కడిదాకా ప్రయాణించింది.

మానవుని జీవితానికి సంబంధించిన పరిణామక్రమములో ఇప్పటిదాకా జరిగిన ఉన్నతిని చూస్తే 'భవిష్యత్తులో మానవుడు ఎలా ఉంటాడు?' అన్న ప్రశ్న సహజముగానే తలెత్తుతుంది. ఈ ప్రశ్నకు సమాధానముగా చాలామంది వైజ్ఞానికులు ఇతిహాసకాలముకన్నా ముందున్న యుమాకు-ఈనాటి పెద్ద పిల్లికి మధ్య ఎంతటి వ్యత్యాసమున్నదో; ఇప్పటినుండీ 5 వేల సంవత్సరముల మునుపు మనిషికీ ఇప్పటి మనిషికీ మధ్య అంతటి తేడా ఉండవచ్చని' వివరిస్తున్నారు. ప్రస్తుత కాలములో మానవుని తెలివి, అతడి సాధనోపకరణములలో అసాధారణమైన అభివృద్ధి ఉన్నదనే విషయము సర్వవిదితమైన సత్యము. తత్ఫలితముగా అతడి పరిణామక్రమము కూడా అసాధారణమైన వేగముతోనే ఉండవచ్చు. పరిణామము-అభివృద్ధి ఈ రెండింటి యొక్క అభివృద్ధి శాతము ముందటికన్నా ఎన్నో రెట్లు పెరిగింది, ఇకముందుకూడా అదేస్థాయిలో దినదినాభివృద్ధి చెందుతుంది. గడచిన 5వేల సంవత్సరాలలో మానవుడు సాధించిన అభివృద్ధి, అంతకుముందు 5 లక్షల సంవత్సరాలలో అతడు సాధించిన అభివృద్ధికన్నా ఎంతో ఎక్కువ. అదేవిధముగా గడచిన 5 వేల సంవత్సరాలలో మానవుడు ఎంత అభివృద్ధిని సాధించాడో దరిదాపు అంతే అభివృద్ధిని గత 500 సంవత్సరాలలో సాధించగలిగాడు. ఇక గత 50 సంవత్సరముల అభివృద్ధికి సంబంధించిన ఖాతాలను పరిశీలిస్తే మానవుడు గత 500 సంవత్సరములలో పొందలేనంత జ్ఞానమును ఈ సమయములో అంటే గడచిన 50 సంవత్సరముల కాలములోనే పొందగలిగాడనే విషయము సుస్పష్టమవుతుంది.

ఈ ప్రగతిక్రమము పెరుగుతూనే ఉంటుంది తప్ప తరగదు. పరిణామక్రమంలో ఇప్పటివరకు వికసించిన మానవజాతి యావత్తు నశించిపోయే ఏదైనా యుద్ధముకానీ, ప్రకృతి సహజమైన విపత్తుగానీ వస్తే తప్ప ఈ సభ్యత ఇదేవిధంగా ముందుకు సాగిపోతూనే ఉంటుంది. చిన్న చిన్న యుద్ధాలైతే ఎప్పుడూ జరుగుతూనే ఉంటాయి, సుమారు వందమంది మొదలుకొని వేలు, లక్షలదాకా జనము మరణించే యుద్ధములకు సంబంధించిన విపత్తులు ఎల్లప్పుడు సంభవిస్తూనే ఉంటాయి. యావత్తు మానవ నాగరికతను నశింపజేయగలిగే యుద్ధము ఎదురయ్యే వరకు అభివృద్ధి పథము క్షీణించే అవకాశమేమీలేదు. అయితే ప్రస్తుతములో అలాంటి భయంకర యుద్ధాలు వచ్చే అవకాశములు బహు స్వల్పముగా ఉన్నాయి. కాబట్టి మానవుడు అభివృద్ధిపథములో మరింత ముందుకు సాగగలడనటములో ఎటువంటి సందేహము లేదు.

రాబోయే తరాలలో మానవుడు సాధించబోయే అభివృద్ధితో పోలిస్తే, గడచిన 5 వేల సంవత్సరాలలో అతడు సాధించిన అభివృద్ధి చాలా స్వల్పమైనదని విజ్ఞానశాస్త్రవేత్తల నమ్మకము. కాబట్టి రాబోయే పరిణామక్రమములో మానవ నాగరికత యొక్క స్వరూపము ఏవిధంగా ఉంటుంది? అన్న ప్రశ్న అన్ని రంగాలలోను తలెత్తుతున్నది. భవిష్యత్తులో మానవుడు ఎలా ఉంటాడు? అన్న ప్రశ్నకు సమాధానము అతడి కోరిక, ఆవశ్యకతలను బట్టి నిర్ధారించవలసి ఉంటుంది. ఆలోచనా ప్రవాహము వర్తమాన స్థాయిలోనే ఉండి, ప్రగతి అనేది జీవ శాస్త్రవేత్తల చేతులలోనే ఉంటే గనుక, వారు క్రొత్త పద్ధతులలో జీవకణములను మలచడము ప్రారంభిస్తారు, తద్వారా గ్రహాంతర పరిస్థితులలో కూడా జీవించగలిగే మానవులను ఉత్పన్నము చేస్తారు, దీనిని ఆధారముగా చేసుకొని ప్రస్తుత కాలములో ఉన్న మానవుల శారీరిక, మానసిక స్థితులను భావికాలములో ఉండబోయే పరిస్థితులలోకూడా సౌకర్యముగా, సుఖంగా ఉండే రీతిలో మలచవచ్చు. వారి శరీరాలనే కాదు, మనస్సులనుకూడా మార్చవచ్చు. ఈనాడు

**ఇతరులకు సహాయం చేయడం అనగా మనకి మనం సహాయం చేసుకోవడమే**

విజ్ఞానశాస్త్రము చేతిలో కేంద్రీకృతమై ఉన్న శక్తిని చూస్తే దేనిని అసంభవము అని చెప్పలేము. విజ్ఞానశాస్త్రము యొక్క ఈ శక్తిని పరిపాలకుల సహాయముతో ఉపయోగించుకుని బహుశః వైజ్ఞానికులు తలచుకున్న రీతిలో మనుష్యులను మార్పు చెందించగలరేమో! అంతేకాదు, ప్రస్తుతము ఉన్న మానవులను తొలగించి, వారి స్థానములో క్రొత్త మానవులను సృజించ గలరేమో కూడా!

కృత్రిమ జీవకణాలను ఆధారముగా చేసుకొని మానవ జాతిలో ఎటువంటి మార్పునైనా తీసుకురాగలమా? ఈ ప్రశ్నకు సమాధానంగా బ్రిటన్‌కు చెందిన జేమ్స్‌డేనియల్ అనే జీవ శాస్త్రజ్ఞుడు 'కృత్రిమ జీవకణములతో తాను రూపొందించిన ప్రాణిని ఉత్పన్నము చేయగలడు, దాని ఆకృతి, ప్రకృతి... దానిని నిర్మించినవాడు కోరుకున్నవిధంగానే ఉండవచ్చుకూడా! అన్య గ్రహములలోకూడా జీవితమును నిర్వహించగలిగే మనుష్యులను మలచడము కూడా సాధ్యమేనని అంటున్నాడు.

సహజముగా శరీర నిర్మాణ ప్రక్రియలో క్రొత్తతరము తయారుకావటము లేదా సంతానోత్పత్తి క్రమములో వంశ పరంపరానుగతముగా శరీరకణములే తమ భౌతిక ప్రత్యేకతను, ఒక తరంనుండి మరియొక్క తరమునకు అంద జేస్తుంటాయి. స్వభావము కూడా వెన్నంటే ఉంటుంది. గతములో అమెరికా దేశములోని వీలర్ విశ్వవిద్యాలయానికి చెందిన వైద్యుడు జ్యార్జ్ అంగర్ ద్వారా నిర్వహించబడిన ప్రయోగములలో ఈ వాస్తవము బయటకొచ్చింది. అంగర్ ఈవిధమైన ప్రయోగాలకోసము తన ప్రయోగశాలలో కొన్ని ఎలుకలను పెంచాడు. చీకటిలో విద్యుత్ తీగలతో కలిగే షాకుల తాలూకు భయమును వాటిలో కలిగించి, అవి వెలుతురులోనే ఉండేలాగా అలవాటుచేశాడు. నెమ్మది నెమ్మదిగా ఈ ఎలుకలు షాకుల తాలూకు భయముతో వెలుతురులోనే ఉండటానికి అలవాటు పడ్డాయి. మొదట్లో అవి షాక్ తాలూకు శబ్దము వినగానే భయముతో వెలుతురులోకి వచ్చేవి. తరువాత తరువాత షాక్ శబ్దము రాకపోయినాకూడా చీకటిలోనుండి పారిపోయి వెలుతురులో జీవించడము ప్రారంభించాయి, ఆ ఎలుకలలో ఈ అలవాటు మూడు తరాల వరకు కొనసాగింది.

ప్రయోగములో తరువాతి చరణముగా ఈ ఎలుకల మెదడులోనుండి స్మృతి తాలూకు రసాయనమును బయటికి తీసి, దానిని ఇతర సాధారణ ఎలుకల శరీరంలోనికి ప్రవేశ పెట్టాడు. రసాయనము ప్రవేశపెట్టబడిన సాధారణ ఎలుకలు కూడా చీకటిలో ఉండటానికి భయపడి వెలుతురులోకి వచ్చేసేవి. ఎలుకల మెదడులోనుండి బయటకు తీయబడిన ఈ రసాయనము పేరు స్కోటోఫోవిన్ అని చెప్పబడినది. ఎలుకల తరువాత ఈ రసాయనమును చిన్నచిన్న ఇతర జీవాల మీద కూడా ప్రయోగించడము జరిగింది. తద్వారా ఈవిధమైన రసాయనిక మార్పుల వల్ల, స్వభావములోని ప్రత్యేకతలను కూడా బదలీ చేయవచ్చని నిరూపించబడినది. ఒక ప్రాణి యొక్క మస్తిష్కీయ తత్త్వమును మరియొక ప్రాణి శరీరము లోనికి ప్రవేశపెట్టగలము, తద్వారా దాని స్వభావములో కూడా కోరుకున్న మార్పులను తీసుకురాగలము. వంశపారంపర్యంలో కూడా ఈ సిద్ధాంతము చాలావరకు పని చేస్తుందనేది గమనించ వలసిన విషయము. ఇతర ప్రాణులవలె, ఎలుకలవలె ఈ ప్రయోగమును మనుష్యుల మీద కూడా చేయవచ్చును. ప్రయోగము చేయబడిన మనుష్యుల కోర్కెలను, అలవాట్లను, క్రియాకలాపాలను వైజ్ఞానికులు, పరిపాలకులు కోరుకున్న విధంగా మలచవచ్చు, మార్పు చెందించవచ్చు. అనకూడదు గాని ఇప్పుడు 'ప్రభుత్వము-విజ్ఞానము' ఈ ఇద్దరు కలిసి సంయుక్తంగా ఎంత శక్తివంతులైనారంటే, మానవుడు ఎప్పుడో, ఎక్కడోగానీ వారిని ఎదుర్కొనలేపోతున్నాడు. ఇది మానవజాతి తలమీద నిరంతరము వ్రేలాడుతూ ఉండే కత్తితో సమానమని చెప్పవచ్చు.

స్వభావగతమైన ప్రత్యేకతలలోనేగాక, శారీరిక ప్రత్యేకతలలో కూడా మార్పు తీసుకురావడములో విజ్ఞానము సఫలీకృతమైనది. అమెరికన్ రిపోర్టర్ పత్రికలో 'విజ్ఞాన స్తంభము' అనే శీర్షిక క్రింద బ్రిస్‌బేన్‌కు చెందిన కొందరు జీవశాస్త్రవేత్తలు కుక్కలలో అత్యంత చిన్నదైన కుక్కజాతిని తయారుచేసినట్లు ప్రచురించ బడినది. ఈ కుక్క ఎత్తు 7 సెంటీమీటర్లు, పొడవు 15 సెంటీ మీటర్లు కాగా బరువు విషయానికొస్తే అది 250 గ్రాముల బరువున్నది. ఓవర్‌కోట్ జేబులో పెట్టుకొని ఈ కుక్కను బయటికి కూడా తీసుకు రావచ్చును. పత్రికలో వ్రాసినదానినిబట్టి ప్రజలుకూడా సంశోధించబడిన ఈ కుక్కపిల్లలను చాలా ఇష్టపడినట్లు తెలుస్తున్నది. అమెరికా ప్రజలకు కుక్కలను పెంచడము మహాఇష్టమనేది ఇందుకు ఒక కారణమైతే, పెరిగి పోతున్న జనసంఖ్య కారణముగా నివాసస్థలము తగ్గిపోవడము

**ఆచరణలోనికి రాని జ్ఞాన సంపద నిరర్థకం**

మరియొక కారణము. ఈవిధంగా స్వల్పకాయమున్న ఈ కుక్కలు తమనే ప్రేమించే యజమానుల ఇబ్బందులను కొంతమేరకు తగ్గించగలిగినాయి. కుక్కలకు ఆహారమును సమకూర్చడములో ఖర్చు, తాము పనికి వెళ్ళేటప్పుడు వాటిని ఖాళీ ఇంటిలో వదిలి వెళ్ళడము వల్ల కలిగే అశాంతి, ప్రతిసారీ వెంట తీసుకువెళ్ళే అలవాటు ఇవన్నీ పెద్ద కుక్కలను పెంచడంలో ఎదురయ్యే ఇబ్బందులు. ఐతే ఇప్పుడు అల్పకాయమున్న కుక్కల వలన పై ఇబ్బందులన్నీ తొలగిపోయాయి. జనం తమతోపాటు తమ కుక్కలని ఎంతో ఇష్టంగా ఎక్కడికైనా తీసుకెళ్ళ గలుగుతారు. తక్కువ ప్రదేశములో, తక్కువ ఖర్చుతో వాటిని పోషించగలుగుతున్నారు.

భవిష్యత్తులో మానవుని స్వరూపము ఎలా ఉంటుందనేది సమయమే చెప్పాలి. మానవజాతి అదృష్టమును, ఏయే తథ్యములను దృష్టిలో ఉంచుకుంటూ నిర్ధారించగలము? ఐతే యుద్ధము భౌతికవాదానికి, ఆధ్యాత్మికతకు మధ్యనే ఉంటుందనేది మాత్రము నిశ్చయంగా చెప్పవచ్చు. భౌతిక వాదానికే ప్రాముఖ్యత నిస్తే మానవజాతి భవిష్యత్తు అంధకార మయము కావటము కచ్చితము. ఐతే వర్తమాన పరిస్థితులు భౌతికవాదానికే ప్రాముఖ్యత ఇస్తున్నట్లు కనపడుతున్నాయి. కానీ తెలివితేటలున్న ఆధ్యాత్మికత కూడా తనమానాన తాను నిశ్శబ్దంగా కూర్చొనలేదు. మానవజాతిని వినాశనము నుండి, అడ్డదారులలో సర్వము స్వాహా చేయగలిగే ఆపదల నుండి వెలికితీయటానికి, తన వంతు కర్తవ్యమును నిర్వహించడానికి కటిబద్ధమైయున్నది. మానవీయ అదృష్టము, భవిష్యత్తు యొక్క మంచిచెడులను నిర్ణయించే సమయం ఆసన్నమైన ఈ తరుణములో దైవీశక్తికూడా నిష్క్రియాత్మకంగా ఉండబోదు. భగవంతునిచే ప్రసాదించబడిన మానవుని యొక్క సనాతన రూపమును శాశ్వతముగా కాపాడటానికి ఆధ్యాత్మికశక్తులు, దృశ్యాదృశ్య రూపములలో పనిచేస్తున్నాయి. ఆధ్యాత్మికశక్తికే విజయము లభిస్తే మానవుడు మహనీయుడు అవుతాడు. తీవ్రమైన మార్పులకు లోనవుతున్న ప్రస్తుత జగత్తు, అతనిని అతి మానవునిగా, మహామానవునిగా కూడా తయారు చేయగలదు. సూక్ష్మదర్శులైన మహాఋషులు అవకాశాల కోసము ఎదురుచూస్తున్నారు. ఇటువంటి అవతరణల యొక్క ప్రభావము వల్ల మానవుని చేతనత్వము దైవీస్థాయికి చేరుకొన గలదు, తద్వారా భూమిపైన స్నేహసౌజన్యముల అమృతధార వర్షించడముతోపాటు, ఈ ప్రపంచములోనే స్వర్గీయ వాతావరణం ఏర్పడే అవకాశాలు సాకారము కాగలవు.

*– అఖండజ్యోతి, సెప్టెంబర్ 1980*

*అనువాదం: శ్రీమతి కృష్ణకుమారి*

## సద్భావం - సత్‌జ్ఞానం - సత్కర్మ

*సత్యం, ప్రేమ, న్యాయంతోకూడిన సందేశం వ్యక్తి వ్యక్తికి చేర్చబడే ఉద్యమం మొదలయినట్లుగా **జరథుస్త** అనే ఆయనకు అవగతమయ్యింది. ఈ ఉద్యమాన్ని తీవ్రతరం చేయాలంటే సంస్కారవంతులు, సమర్థులు ఐన వ్యక్తుల అవసరం ఎంతగానో ఉన్నది అని ఈయన గ్రహించి, ఇరాన్‌లోని బల్క్ సామ్రాజ్యం యొక్క పాలకుడు, సత్పురుషుడు ఐన **గుస్తాస్ప్** యొక్క స్వప్నంలో ప్రత్యక్షమవుతాడు. ఆయనకు ఒక పచ్చనిమొక్కను ఇస్తూ – "ఇది సద్భావాలకు ప్రతీక, కాబట్టి పచ్చని మొక్కలు నాటు. పరమాత్మ ఒక్కడే. ఆ ఒక్కని అనుశాసనాన్ని తు.చ. తప్పక పాటిస్తూ ఆయన నిర్దేశించిన బాటలో పయనించడం, ఇతరులను పయనింపజేయటం పట్ల ఆసక్తి కలిగి ఉండు!" తర్వాత ఒక పుస్తకాన్ని ఇస్తూ ఇది సత్ జ్ఞానానికి ప్రతీక. దీనిని నీవు పూర్తిగా అర్థం చేసుకొంటూ ఇతరులకు కూడా అవగతమయ్యేలా చూడు. ఇదే నీ ముఖ్యమైన కార్యక్రమంగా భావించు అని పలుకుతాడు. తరువాత ఒక అగ్నిపిండాన్ని ఇస్తూ "ఇది యజ్ఞాగ్ని" సత్కర్మకు ప్రతీక. దీనిని దశదిశలా విస్తరింపచేయి, నీకు పవిత్రమైన యశస్సు లభిస్తుంది. నీ రాజ్యం సుఖసమృద్ధులతో తులతూగుతుంది. సద్భావం, సత్ జ్ఞానం, సత్కర్మ వీటివల్ల చమత్కారికమైన సత్పరిమాణాలు కలుగుతాయి." అని పలుకుతాడు. ఈ స్వప్నం గుస్తాస్ప్‌ని అత్యంత ప్రభావితం చేసింది. ఈయన తనకున్న సమస్త సాధనాలను సదుపయోగం చేసి వాతావరణం యావత్తుని దైవీ వాతావరణంగా మార్చివేశాడు.*

– ప్రజ్ఞాపురాణం నుండి

*అనువాదం: శ్రీమతి నేమాని గౌరీసావిత్రి*

**పట్టుదలతో కృషి చేస్తే సంపూర్ణ విజయం తథ్యం**

బోధ కథ

# గృహస్థాశ్రమంలోనే ఉన్న సద్గురువు

ఆరోజుల్లో హిమాలయాలలోని "రాణీఖేత్" ప్రాంతంలో ఒక సైనిక నిర్మాణం గురించి అనుకోవటం జరిగింది. దాని సంబంధంగా సైనిక యుద్ధ పనులకు చెందిన విభాగం నుండి ఒక యువకుడైన కర్మచారిని "దానాపూర్" నుండి అక్కడకు పంపుట జరిగింది. అతడు అక్కడకు చేరి గుడారంలో బస ఏర్పాటు చేసుకొని నివసిస్తూ ఉండేవాడు. పని పెద్దగా ఉండేది కాదు, కాని ఏదో కొంత పనిని కొద్ది సమయంలోనే పూర్తిచేసి, మిగిలిన సమయమంతా అటూ-ఇటూ తిరుగుతూ, కూలీలతో, బంట్రోతులతో పిచ్చా-పాటి కబుర్లు చెప్పుకుంటూ కాలం గడుపుతూ ఉండేవాడు.

హిమాలయ పర్వత సానువుల్లో గొప్ప సిద్ధపురుషులు ఉంటారని అతనికి ముందు నుండి తెలుసు. ఆ ప్రాంతమంతా సిద్ధపురుషుల, యోగుల తపోభూమి అని తెలిసినా కొద్దిరోజుల క్రితమే రావటం చేత అంతగా గమనించకుండా, మాటల సందర్భవశాన కొంతమంది కూలీల ద్వారా అక్కడ నుండి 15 మైళ్ళ దూరంలో ఉన్న 'ద్రోణగిరి' ప్రాంతంలో నేడు కూడా గొప్ప శక్తిసంపన్నుడైన ఒక మహాయోగి నివసిస్తున్నాడని తెలిసి; ఎందుకో తెలియదుగానీ అతని మనసు ఆనందంతో నాట్యమాడసాగింది. 'ద్రోణగిరి' - ఈ పేరులో ఏ మాయ ఉందో తెలియదు. అది తనను రమ్మని పిలుస్తూ అటు వైపుకు లాగుతున్నట్లు అనిపించసాగింది. అందువల్ల ఒకరోజు సూర్యోదయం కాక మునుపు అతడు ద్రోణగిరి వైపు బయలు దేరాడు.

దారి మొత్తం కొండల ప్రాంతం. దారికిరువైపుల దేవదారు వృక్షాలు ఎత్తుగా పెరిగి ఆకాశాన్ని అంటుకుంటున్నట్లుగా ఉన్నాయి. ప్రకృతి సౌందర్యాన్ని ఆనందంతో ఆస్వాదిస్తూ ముందుకు నడుస్తూ తాను తిరిగి వెనక్కు రావాలనే విషయం కూడా మరచి తన్మయత్వంతో ప్రకృతిశోభను తిలకిస్తూ అలా ముందుకు పోసాగాడు. అతడు ద్రోణగిరి చేరేటప్పటికి సూర్యాస్తమయం కాబోతోంది. సంధ్యాకాలం కాబోతోంది. నందాదేవి హిమశిఖరాన్ని, సాయం సమయంలో అపూర్వ కాంతులీనుతున్న ఆ ప్రాంతాన్ని తన్మయత్వంతో మైమరచి చూస్తూ ఉండిపోయాడు.

అకస్మాత్తుగా ఎవరో పిలుస్తున్న శబ్దం అతని చెవులకు వినిపించింది. "శ్యామాచరణ్! అరే... ఓ... శ్యామాచరణ్!" అని ఎవరో తనను పిలుస్తున్నట్లు అనిపించింది. అతడు ఆశ్చర్యంగా నలుదెసలు చూడసాగాడు. ఇటువంటి మారుమూల అటవీ ప్రాంతంలో, అసలింతవరకు తానెవరో తెలియనివారు తనను పేరుపెట్టి పిలిచేవారెవరై ఉంటారు. ఇక్కడ తనను ఎవరూ గుర్తు కూడా పట్టలేదింతవరకు. ప్రభుత్వము వారి టెలిగ్రామ్ అందుకొని దానాపూర్‌నుండి 500 మైళ్ళ నుండి ఈ ప్రాంతానికి తాను చేరి కూడా రెండు రోజులే అయ్యింది. మనసులో భయం తోపాటు కుతూహలం కూడా కలగసాగింది. అయినప్పటికి అనుకోకుండానే శబ్దం వచ్చిన వైపుకు అడుగులు ముందుకు పడ్డాయి. కొద్దిదూరం ముందుకుపోగానే ఒక కొండ గుహ ద్వారం వద్ద అతడు ఒక మహాయోగిని చూశాడు. ఆయనే అక్కడ నిలుచుని తనను పిలిచాడు అని మదిలో అనుకొన్నాడు.

ఆయన వద్దకు ఇతడు చేరగానే, మహాయోగి ఆనందంతో పులకించిపోతూ ప్రేమ నిండిన స్వరంతో అతనితో ఇలా అంటున్నాడు. "నీవు వచ్చావా... శ్యామాచరణ్! రా... ఇటు వచ్చి... కూర్చో... కొంత ఆయాసం తీర్చుకొని విశ్రాంతి చెందు! నిన్నే... నేను పిలిచింది.'

అతడెంతో సంభ్రమాశ్చర్యాలకు లోనై, ఏం చెప్పాలో తెలియక ఒక నీరసమైన ప్రణామం సమర్పించి, ఆయన ఎదురుగా నిలుచుండిపోయాడు. కాని అతని మదిలో ఎన్నో ప్రశ్నలు ఉప్పొంగిపోసాగాయి. అన్నిటికన్నా పెద్ద ప్రశ్న ఆయనకు తన పేరు ఎలా తెలిసిందని? కలవరపాటుతోపాటు కళ్ళను పైకెత్తిచూడగా, ఆ మహాయోగి అతనివైపు ఎంతో పరిచయమున్నట్లుగా చూస్తూ చిరుమందహాసం చేయసాగాడు.

మితంగా భుజిస్తే ఆరోగ్యకరం

ఆయన నవ్వుతూ – "నాయనా! నీ గురించి నాకన్నీ తెలుసు. నీ పేరు శ్యామాచరణ్, నీ తండ్రి పేరు గౌర్‌మోహన్, మీ ఇల్లు కృష్ణనగర్ వద్ద ఘుర్ణీ గ్రామంలో ఉంది. చిన్నతనంలోనే నీ తల్లి చనిపోయింది. దాని తరువాత మీ నాన్న నిన్ను తీసుకొని కాశీ చేరాడు. 18 సంవత్సరాల వయసులో నీకు వివాహం జరిగింది. 23 సంవత్సరాల వయసులో నీవు ఈ ఉద్యోగంలోనికి చేరావు. ఏమిటి నేనంతా సరిగ్గానే చెప్పానా?

ఇంత వివరంగా తన గురించి చెప్పటంతో విస్మయానికి లోనై ఇలా అంటున్నాడు – "ఆశ్చర్యంగా ఉంది. తమకు ఇవన్నీ ఎలా తెలిశాయి?"

"నాకుగాక మరెవరికి నీ గురించి తెలుస్తుంది? ఇన్ని రోజుల నుండి నేను నీ రాకకొరకై ఎదురుచూస్తూ ఉన్నాను. సరే... కొంచెము ఆలోచించి చెప్పు. ఇంతకు ముందు ఎప్పుడైనా ఇక్కడకొచ్చావా?" అని యోగి అడిగాడు.

శ్యామాచరణ్ జవాబు ఇస్తూ–"ఎన్నడూ రాలేదు! నేనిక్కడికి మొదటిసారే వచ్చాను." మహాయోగి కిలకిలా నవ్వి – "మంచిది, నాతోపాటు ఈ గుహ లోపలికి రా!" ఆయనను అనుసరిస్తూ శ్యామాచరణ్ గుహ లోపలికి వచ్చాడు. అక్కడ ఒక మూల వెలుగుచున్న 'ధుని', దాని సమీపంలో పులిచర్మం దండ, కమండలాలుండుట చూశాడు. యోగి వీటిని చూపి – "ఈ వస్తువులన్నీ నీవే! ఇప్పుడైనా గుర్తుకొచ్చిందా?' అని అడిగాడు. శ్యామాచరణ్ కంగారుతో – లేదు! అన్నాడు.

అప్పుడా దేవపురుషుడు శ్యామాచరణ్ ప్రక్కకు వచ్చి అతని వెన్నెముకను గట్టిగా వత్తేటప్పటికి శ్యామాచరణ్‌కి ఒక్కసారిగా మతిమరపు ఆవరణ తొలగి, తన పూర్వజన్మ స్పష్టంగా కనిపించ సాగింది. అరే... అవును... ఈ వస్తువులన్నీ నావే... ఈ పులిచర్మం... ఈ దండ–కమండలాలు... ఇంకా తన ప్రక్కనే నిలుచున్న ఆయన తన పూర్వజన్మలోని తన 'గురువే' నని గుర్తించగలిగాడు.

శ్యామాచరణ్ అశ్రుపూరిత నయనాలతో, రోమాంచిత శరీరంతో గురుచరణాల మీద ఒరిగిపోయాడు. ఆయన్ని లేపి గురువు ఇలా అంటున్నాడు – "శ్యామా... ఇప్పటికి నీవెవరవో తెలుసుకొన్నావు గదా! సాధనలో ఉన్నతమార్గంలో పయనిస్తూ ఉన్న సమయంలో నీవు నీ పూర్వ శరీరాన్ని వదలవలసి వచ్చింది. కాని పరమాత్మ ఇచ్ఛానుసారం నీవు ఈ లోకంలో కొంత చేయవలసి ఉంది. అందువల్ల నీ సాధన –సంపద న్యాసరూపంలో నా వద్ద ఉంచబడి ఉంది. నిన్ను తిరిగి సాధనా మార్గంలో దీక్షితునిగా చేయుట కొరకే నేనిక్కడకు రావటం జరిగింది.

శ్యామాచరణులు మరలా–మరలా ఆ దేవపురుషుని పాదాలను పట్టుకొని ఇలా అన్నాడు. "గురుదేవా! ఇప్పుడు మిమ్ము వదలి నేనెక్కడకు పోను. నన్ను మీ నుండి వేరుచేయకండి ప్రభూ!

ఆ మహాయోగి నవ్వుతూ – "అరె, నీవిప్పుడు సంసారం లోకి వెళ్ళవలసి ఉంది. నీవీలోకంలో యోగసాధన గురించి ప్రచారం చేయవలసి ఉంది. కొద్ది రోజుల్లోనే నీవు తిరిగి "దానాపూర్" వెళ్ళవలసి ఉంటుంది. నీవు విచారించకు. చూడు... నిన్ను నేనే ఇక్కడకు పిలిపించుకున్నాను. నీవు నీ పై అధికారి నుండి టెలిగ్రామ్ అందుకొని ఇక్కడకు వచ్చావు... కాని ఇది మీ పై అధికారి పొరబడి నీకా టెలిగ్రామ్ ఇచ్చుట జరిగింది. ఆయనకు ఈ పొరపాటుని నేనే కలిగించి నిన్నిక్కడకు రప్పించుకొన్నాను. మరువవద్దు శ్యామాచరణ్ నీవు మీ కార్యాలయ కారణంగా ఇక్కడకు రాలేదు. ఐతే కార్యాలయము – నీ కారణంగానే ఇక్కడకొచ్చింది. అందువల్ల ఎప్పటివరకు ఇక్కడ ఉంటావో, రోజు నాతో కలవటానికి వస్తూ ఉండు.

ఆ రాత్రి శ్యామాచరణ్ అక్కడే ఉండిపోయాడు. మరుసటి రోజున రాణీఖేత్‌కు వచ్చి, తన ఆఫీసును ద్రోణగిరి దగ్గరలో ఏర్పాటు చేసుకొన్నాడు. ఉదయం తన పనులన్నీ ముగించుకొని, రోజంతా తన గురువు చెంత ఉంటున్నాడు. గురువు తినటానికి ఏదిస్తాడో– దాన్నే తినేవాడు. మూడవరోజు గురువుగారు ఒక పాత్రను చూపి ఇలా అన్నాడు. "శ్యామాచరణ్... ఇందులో ఏది ఉందో దాన్నంతా త్రాగి వెయ్యి... శ్యామాచరణ్ ఆ పాత్రను తీసుకొని చూడగా అందులో నూనెవంటి ఏదో పదార్థం ఉంది. ఇందులో ఏదో పొరపాటు జరిగిందేమో ననుకుంటా అంటూ గురువుగారి వైపుకు చూశాడు. గురువు –"నా ముఖం దేనికి చూస్తున్నావు. దాన్ని మొత్తం త్రాగేసెయ్!" శ్యామాచరణ్ గురువు ఆజ్ఞను శిరసావహించి దాన్ని తాగేశాడు.

**అత్యాశకుపోనివాడు అసంతృప్తికి గురికాడు**

అప్పుడు గురువు మరొక ఆదేశమిస్తూ – "ఇప్పుడు వెళ్ళి దగ్గరలో ఉన్న నది ఒడ్డున పడుకొని ఉండు!" అన్నాడు. పోయింది. హఠాత్తుగా నదిలో వరద వచ్చి అతన్ని ప్రవాహంలో తీసుకుపోసాగింది. శ్యామాచరణ్‌కి ఆ సమయంలో ఏం చేయాలో ఎంతమాత్రం తెలియకుండా ఉంది. అయినప్పటికి తనను తాను రక్షించుకొనే ప్రయత్నంలో ఆ జలంతో పోరాడ సాగాడు. అలా ఈదుతూ–ఈదుతూ బాగా అలసిపోయాడు. శరీరంలో శక్తి లేకుండా పోయింది. అప్పుడా నది ఒక్కసారిగా శాంతించింది. దేహంలో ఒక క్రొత్త స్ఫూర్తి సంచారమవ సాగింది. పుంజుకున్న శక్తితో శ్యామాచరణ్ లేచి తన గురువు వద్దకు వచ్చి నిలుచుండిపోయాడు. ఆయన్ని చూస్తూ గురువు "శ్యామా! నీ దేహంలోని మలినమంతా పోయి ఇప్పుడు స్వచ్ఛమైంది. నేటిరోజు బాగా ఉంది. సాయంకాలం నేను నీకు తిరిగి ఈ జన్మకి దీక్షనిస్తాను.

సాయంత్రం కాగానే గురువు ఆయనకు దీక్షనిచ్చి యోగసాధన ప్రక్రియను తెలియపర్చాడు. అతడు ఉత్తమ అధికారి, ఉచిత సత్‌పాత్రతను పొంది ఉండినందున సహజంగానే యోగసాధన లభించింది.

కొన్ని రోజుల అనంతరం గురుదేవులిలా అన్నాడు. "శ్యామాచరణ్! ఇప్పుడు నీవిక తిరిగి వెళ్ళే సమయమైంది. ఈనాటి నుండి ఏడవరోజున నీకు టెలిగ్రామ్ వస్తుంది. నీవు తిరిగి 'దానాపూర్' వెళ్ళవలసి ఉంటుంది.

"గురుదేవా! ఇప్పుడు నేనేమి కోరుకోను... నన్ను తమరు తమ శ్రీచరణాల చెంతనే ఉండనివ్వండి." శ్యామాచరణ్ స్వరంలో లోతైన కలతతోపాటు అభ్యర్థన ఉంది!

"అరె, ఏమంటున్నావు? నేను నీకు ముందే చెప్పాను గదా! నీవు యోగసాధన ప్రచారం చేయాలని! నీవు గృహస్థునిగానే ఉండాలి. సాధువు కారాదు! ఒకవేళ నీవు సాధువైతే అప్పుడు నీ నుండి ఎంతోమంది యోగసాధనపు లాభాన్ని అందుకోవలసిన వారంతా ఏమైపోతారు?

గురువు అన్న ఈ మాటతో చింతామగ్నుడై అన్నాడు – "సరే గురూజీ! అలాగైతే నాకొక మాటనివ్వండి... నేను ఎప్పుడు మిమ్ములను పిలిచినా మీరు వెంటనే నాకు దర్శనమివ్వాలి" గురుదేవులు కొద్దిగా ఆలోచిస్తూ – 'సరే మంచిది... అలాగే' నని అన్నారు.

ఏడవరోజు టెలిగ్రామ్ వచ్చింది. గురుదేవుల నుండి సెలవు తీసుకొని శ్యామాచరణ్ దానాపూర్‌కి బయలుదేరాడు. దారిలోని 'మురాదాబాద్'లో ఆయన కొంతమంది ఆత్మీయ వ్యక్తులతో కలవటం కొరకు ఆగాడు. వారితో మాట్లాడే సమయంలో యథాలాపంగా చర్చ సాధువుల మీదకు మళ్ళింది. వారంతా 'నిజమైన సాధువులు ఇప్పుడెక్కడున్నారని' అనుకోసాగారు. శ్యామాచరణులు వారు చెప్పిన దానిని ఖండిస్తూ 'ఉన్నారు. ఇప్పుడు కూడా గొప్ప సాధువులున్నారు. నేను స్వయంగా వారిని దర్శించుకున్నాను కూడా' అని చెప్పగానే వారంతా "ఒకవేళ నీవు చూసి ఉంటే మాకు కూడా వారి దర్శనం కలిగించు... అలా చేయకపోతే ఇది కూడా నీవు చెప్పే మరొక "గప్పా"గా భావిస్తాము" అంటూ అనసాగారు.

శ్యామాచరణ్ గొప్ప ధర్మసంకటంలో పడ్డాడు. ఒక సామాన్య విషయం మీద తన ఆరాధ్య గురుదేవులను పిలుచుట మంచిది కాదు. అలా పిలవకపోతే ఈ అవిశ్వాసులకు ఏవిధంగా విశ్వాసం కలిగించాలి? అందుచేత ఆయన ప్రక్కనున్న గదిలోకి వెళ్ళి తలుపులు మూసి, కూర్చుని తన ఆరాధ్య గురుదేవులను పిలవసాగాడు.

శ్యామాచరణులు మనస్ఫూర్తిగా పిలిచిన పిలుపుకు స్పందించిన మహాగురుదేవులు సూక్ష్మశరీరంతో ఆ గదిలోకొచ్చి, స్థూలశరీరాన్ని ధరించి ప్రక్కనే ఉన్న ఆసనం మీద కూర్చున్నారు. ఇలా అన్నారు. "శ్యామాచరణ్! నీవు పిలచిన మీదట నేడు నేను రావటం జరిగింది. అయితే ఇంత సామాన్య చిన్న విషయం కొరకు నన్ను పిలుచుట ఉచితమా? నీకు తెలుసా... ఎంతదూరం నుండి నేను వచ్చానో... ఇటువంటి తమాషాలు చూపేటందుకా... నేను నీలోపల శక్తిని నింపింది? ఇందుకేనా నిన్ను యోగవిభూతికి అధికారిగా చేసింది?

గురుదేవుల మాటలను వినగానే 'శ్యామా'కు భయంతో పాటు సిగ్గుతో వణుకు కలిగింది. ఆయన గొంతు ఎండిపోయి మాట పెగలలేదు. తిరిగి గురుదేవులిలా అన్నారు – "శ్యామా చరణ్... విను! నేనన్నమాట మీద, నీ గౌరవం దక్కించుటకొరకు నేను నేడు ఇక్కడకు వచ్చాను. కాని ఇక ముందు నీవు పిలిస్తే

**విద్య జీవితానికి వెలుగును, వికాసాన్ని ఇస్తుంది**

నేను రాను. ఎప్పుడైనా నా అవసరం నీకు ఏర్పడితే అప్పుడు నేనే స్వయంగా నీ వద్దకొస్తాను" శ్యామాచరణ్ గురుదేవుల శ్రీచరణాల మీద పడి రోదిస్తూ క్షమించవలసిందిగా ప్రార్థించ సాగాడు. గురువుని వేడుకుంటూ ఇలా అన్నాడు – "గురుదేవా! ఈసారికి నన్ను క్షమించండి. నేను ఈ అవిశ్వాసులందరికి మనసులో శ్రద్ధ కలిగించుట కొరకు తమరిని పిలవటం జరిగింది. ఇక ఇప్పుడు తమరు ఎలాగు వచ్చారు కాబట్టి నా మీద దయ ఉంచి వీరికి ఒకసారి తమ దర్శనమివ్వండి.

గురువుగారి అనుజ్ఞమేరకు శ్యామాచరణుడు తలుపులు తెరవగానే తన ఆత్మీయమిత్రులందరూ ఆ దేవగురువుకు వందనాలు చెల్లించి, ఇదేమీ ఇంద్రజాలం కాదని దృఢంగా విశ్వాసము పొందారు. ఇటువంటి విభూతిపరులైన మహాపురుషులు నేడు కూడా ఈ భూమిమీద నడయాడుతూనే ఉన్నారు.

శ్యామాచరణ్ దానాపూర్ చేరి తన పనిలో నిమగ్న మయ్యాడు. పగలంతా పని, రాత్రి సమయంలో యోగసాధన! ఫలితంగా మెల్ల–మెల్లగా ఒకదాని తరువాత మరొకటి చొప్పున అన్ని శక్తులు ఆయనకు ప్రాప్తించాయి. ఆయన చేతన యొక్క ఉచ్చస్తరీయతలానికి చేరగలిగాడు. 1885 సంవత్సరములో ప్రభుత్వోద్యోగం నుండి విరమణ పొంది, కాశీకి చేరి స్థిరపడ్డాడు. వారి యోగవిభూతి యొక్క కీర్తి దానాపూర్‌లో ఉన్న సమయంలోనే బాగా విస్తరించింది. అదిప్పుడు ఇంకా వ్యాపించి వీరు "కాశీబాబాగా" లేక "యోగిరాజ్" పేర్లతో సర్వేసర్వత్రా ప్రసిద్ధులయ్యారు. వీరు ఎందరికో దీక్షలనిచ్చారు. వీరికి అనేక మంది గృహస్థులు, సాధువులు శిష్యులయ్యారు. వీరి సాధు–శిష్యులలో స్వామి ప్రణవానంద, ముక్తేశ్వరగిరిల పేర్లు ఎంతో గొప్పగా చెప్పుకోబడ్డవి. ఐతే ఈయన మాత్రం స్వయంగా ఎన్నడూ సన్యాసాన్ని స్వీకరించక గృహస్థుగానే జీవించాడు. గురువు యొక్క ఆదేశాన్ని ఉన్నది ఉన్నట్లుగానే పాలన చేయటమే సాధన యొక్క మూలమంత్రం. దీన్నే ఆయన ఎల్లప్పుడూ ఆచరించాడు. మనందరికి ఈ మార్గమే అనుసరణీయం.

*– అఖండజ్యోతి, జనవరి 2000*

*అనువాదం: జి. చెన్నకేశవరావు*

## శాంతికుంజ్ స్థల విశిష్టత

*ప్రస్తుతం ఉన్న శాంతికుంజ్ ఆశ్రమ ప్రాంగణ మూల సంస్కారాలను గురుసత్తా చాలా ముందుగానే గుర్తించుట జరిగింది. 1968 సంవత్సరంలో ఆశ్రమం ఏర్పాటు గురించి వందనీయ మాతాజీకి, వారి దేవకన్యల కొరకు, ఇంకా అఖండజ్యోతికి ఒక తపోభూమిని 'హరిద్వార్ పట్టణ' సమీపంలో స్థలంకొరకు వెతికే పనిలో ఉన్నారు. గురూజీ మంచి–మంచి స్థలాలను చూసి కూడా నచ్చక వదిలివేసి, చివరకు ఊబితో నిండి బురద పేరుకుపోయిన స్థలాన్ని ఎన్నిక చేశారు. ఈ స్థలం రాజమార్గానికి చాలా దూరంగాను, గంగానదికి సమీపంగాను ఉన్న కారణంగా భూమిని చూపించిన మధ్యవర్తికి ఆశ్చర్యమేసింది. గురుదేవులు ఆ భూమిమీద నడచుకొంటూ వెళ్ళి ఊబితో, గడ్డితో నిండిన ఒక ఖాళీస్థలంలో ఉన్న దిబ్బవంటి దానిమీద నిలుచుని ఒకసారి కళ్ళుమూసుకొని, ఆ భూమినే కొనేందుకు నిర్ణయించుకొన్నారు. ఈ స్థలం వెల తక్కువకు వస్తుందని అనుకొంటున్నారని దళారి మనసులోకొచ్చింది. కానీ విషయం అది కాదు. వారు తమతో వచ్చిన కార్యకర్తలతోనే ఇలా అన్నారు – "నేను ప్రాణశక్తితో వెలుగుచున్న ఒక ప్రయోగశాలను తయారుచేయాలని కోరుకుంటున్నాను. ఆ ప్రయోగశాల ఎటువంటిదంటే, అక్కడకు వచ్చెడి మానవుల ఆంతరిక–సంరచనలో మార్పు తెచ్చే దానిలాగా ఉండగలగాలి. ఈ భూమి సామాన్యమైనది కాదు. పూర్వం గంగామాత యొక్క ఒక ధార బ్రహ్మర్షి విశ్వామిత్రుని తపోభూమి ప్రక్క నుండి ప్రవహించేది. ఆ స్థానం ఇదే. నా దివ్యసత్తా ఈ స్థానాన్నే నిర్దేశించారు. ఇక్కడ ఋషిపరంపర యొక్క బీజారోపణ శిబిరాలలో పాల్గొనేవారు ఈ తథ్యముతో పరిచయం కలిగి ఉన్నట్లైతే, వీరి తపస్సులోని కణకణాన్ని పీల్చుకొనే ప్రయత్నం చేసుకోగలిగితే... అటువంటి వారందరూ ధన్యులే.*

*– అనువాదం: జి. చెన్నకేశవరావు*

**సాధనా మార్గంలో పాత్రతకి మాత్రమే తావున్నది - యాచనకు లేదు**

సాధనా విజ్ఞానం

# యోగసాధనకు రెండు రథచక్రాలు

యోగాభ్యాసము రెండు భాగములుగా విభజింపబడినది. అవి 1) ధ్యానయోగము, 2) క్రియాయోగము. అభ్యాసము అనేది ధ్యానయోగ విభజనకు చెందుతుంది. అభ్యాసములో సాధకుడు అంతర్ముఖుడై అంతరంగము లోతుల లోలోపలి గహ్వరములోకి వెళతాడు. గజఈతగాళ్ళు సముద్రపు అట్టడుగు లోతులలోకి చేరుకుని మణిమాణిక్యములను, ముత్యములను అన్వేషించే ప్రయత్నములు చేస్తారు. సాధకుడు కూడా అంతర్ముఖ స్థితిలో ఇలాంటి ప్రయత్నము చేస్తాడు. ఈ ధ్యానయోగ ప్రక్రియను గనులను త్రవ్వి బహుమూల్యమైన ఖనిజములను వెలికితీయుటతో సరిపోల్చవచ్చును. ఆలోచనలు చెల్లాచెదరై ఉంటున్నప్పుడు ఆ ఆలోచనల సామర్థ్యము, శక్తి తెలియరాదు. తుపాకిగొట్టము నుండి దూసుకువెళ్ళే మందుగుండుసామగ్రి అది తగిలినచోటును కాల్చివేస్తుంది, తుపాకిగుండు లక్ష్యమును ఛేదిస్తుంది. అలాగే ధ్యానయోగములో ఆలోచనలను ఒకచోట కేంద్రీకృతము చేసినచో ఇలాంటి ఫలితమునే పొందుతాడు సాధకుడు. ఒకచోట కేంద్రీకృతమైన ఆలోచనలు ఎంత శక్తి వంతమైనవంటే మెస్మరిజం, హిప్నాటిజం మొదలైనటువంటి వాని ప్రయోగరూపములో ప్రత్యక్షముగా దర్శించవచ్చును. దాని పరోక్ష పరిణామము మరింత అధిక ఆశ్చర్యకరమైనది అని తెలిసికోవాలి.

శారీరిక క్రియల సహాయముతో మనస్సును నిరోధించే అభ్యాసము క్రియాయోగములో చెయ్యబడుతుంది. పని చేస్తున్న సమయములో అందులో వెచ్చించబడుతున్న శ్రమ మనో యోగము ఆధారముతో ఎంచుకున్న ఉద్దేశ్యము మీదనే ధ్యానమును నిలుపుతుంది. తత్ఫలితముగా బలముగా వేయబడిన ముద్రల చేత మనోక్షేత్రము ప్రభావితమౌతుంది. ఆలోచనల –కర్మల సమన్వయము చేత సంస్కారములు రూపుదాలుస్తాయి అన్న తథ్యము మనోవిజ్ఞానశాస్త్రమును అధ్యయనము చేసే విద్యార్థులకు తెలుసు. కేవలము చింతన ద్వారాకూడా స్వీయ సమ్మోహనము, స్వ-సంవేదన, క్రమశిక్షణ (నియమపాలన), స్వ–నిర్దేశనము అన్నవి సంభవమేకానీ వాటికొరకు తీవ్రమైన మనోశక్తిని సముపార్జించుకోవలసి ఉంటుంది. లేకున్నచో కపోత కల్పనల ఊహాలోకాలలో తేలియాడుట ద్వారా అనుకున్న లక్ష్యము నెరవేరదు. తనను తాను నియంత్రించుకునేందుకు మనస్సును తిరిగి వెనక్కు లాక్కొచ్చుకునేందుకు సంకల్పశక్తి ఉండాలి. సంకల్పశక్తిని సముపార్జన చేసినమీదటనే ధ్యానము ద్వారా ఉపలబ్ధమయ్యే సఫలతల ద్వారములు తెరుచుకుంటాయి. ఇందువలన ధ్యానయోగము ఉచ్చస్తరీయమైన సాధన అని భావించబడుతున్నది. దీనికి ముందు క్రియాయోగమును ఒకటవ తరగతి విద్యగా పూర్తిచేయవలసి ఉంటుంది.

క్రియాయోగము యొక్క సరళమైన సాధనలలో తీర్థ యాత్రలు, ప్రదక్షిణలు, ఆసనములు, ప్రాణాయామములు, జపము, హవనము, పూజ–అర్చన, దానము–పుణ్యము, వ్రతములు, ఉపవాసములు మొదలైనవి పరిగణనలోకి వస్తాయి. అత్యున్నత ఉద్దేశ్యము నిమిత్తము ఆచరించబడే శారీరిక కర్మ లేదా శ్రమ 'క్రియాయోగము' అని చెప్పబడినది. శ్రమను చేయుట వెనుక ఉన్నతమైన ఉద్దేశ్యములు ఉన్నప్పుడు ఆ మనో–ఏకీకరణ యొక్క ప్రతిఫలము 'సంకల్పశక్తి' వికసించే రూపములో హస్తగతమౌతుంది. ఈ ఇనుమడించిన మనో బలమును ధ్యానయోగ పరిధిలోకి వచ్చే సాధనల నిమిత్తము వినియోగించుకొనవచ్చును.

కొన్ని సాధనలలో అయితే క్రియాపరమైన సాధనలతో పాటు అభీష్ట లక్ష్యమును చేరుకునేందుకు సాధారణ స్థాయి కన్నా అధిక మనోబలమును ఇష్టపూర్వకముగా కేంద్రీకృతము చెయ్యవలసి వస్తుంది. తీర్థయాత్రలు, వ్రతములు, ఉపవాసము లలో శారీరిక కష్టము అధికముగా ఉంటుంది. మనస్సుకు తక్కువ పని ఉంటుంది. అయితే కొన్ని యోగాభ్యాసాలలో మనస్సు చంచలముగా ప్రవర్తిస్తే కనుక పని నెరవేరదు. వాటిలో కేవలము కర్మలకు మాత్రమే ప్రాధాన్యత ఉండదు. కర్మతోపాటు అధిక మనోయోగమును కూడగట్టుకుని కేంద్రీకృతము చెయ్యవలసిన ఆవశ్యకత ఉంటుంది. బంధనములు, ముద్రల స్వరూపము ఇటువంటిదే. ఖేచరీముద్రలో నాలుకతో తాలువును

**తోటివారికి చేతయినంత సాయం చేయడం మానవధర్మం**

తాడిస్తూ లేక స్పృశిస్తూ బ్రహ్మరంధ్రము నుండి వర్షించే అమృత పాన రసాస్వాదన చేయటానికి అధిక మనోయోగమును కేంద్రీకృతము కావించనిచో ప్రయత్నము అసంపూర్ణముగా ఉండి, శ్రమంతా నిరర్థకమైపోతుంది. సోఽహమ్‌సాధనకు కూడా ఇదే విషయము వర్తిస్తుంది. ఈ సాధనలో శ్వాస-ప్రశ్వాసలను సంతులితముగా ఉంచుటతోపాటు మహా ప్రాణము యొక్క పరబ్రహ్మ స్వరూపములోకి ప్రవేశిస్తున్నాను అనే భావభరితమైన అనుభూతికూడా తోడవ్వాలి. అంతే కాకుండా శ్వాసతోపాటు అహంకారము బయటకు వెళ్ళి పోతున్నది అని దృఢసంకల్పశక్తితో విశ్వాసముతో భావించాలి. ఇంతకు తక్కువస్థాయి భావనతో అనుకున్న లక్ష్యము నెరవేరదు.

విశుద్ధధ్యానయోగములో భావనలతోపాటుగా శారీరిక కర్మలను కూడా సరిసమానముగా ఉపయోగించవలసి ఉంటుంది. ఇందులో భావనల స్థాయిలోనే అధికాధిక ప్రయత్నములు సాగుతాయి. ఏకాగ్రత, సంకల్పముల యొక్క సమన్వయముతో ప్రచండ ఆత్మశక్తి ఉద్భవిస్తుంది. ఆ ప్రచండ ఆత్మశక్తితో అంతరంగము లోలోపల ప్రసుప్తస్థితిలో ఉన్న శక్తికేంద్రములను గట్టిగా ఢీకొంటూ వాటిని జాగృతపరచే ప్రయత్నము చెయ్యబడుతుంది. షట్చక్రవేధన, కుండలినీ జాగరణ సాధనలు ఈ ఆధారముగానే సంపూర్ణమవుతాయి.

మంత్రజపముతోపాటు అభీష్టలక్ష్యముపైన ధ్యానమును ఉంచుట అన్నది ఆవశ్యకము. కేవలము శబ్దములు ఉచ్చరించుట, మననము గావించుట చేత అనుకున్న లక్ష్యము నెరవేరదు. చిలుకకూడా ఈ పనిని చక్కగా చేయగలదు. టేప్ రికార్డర్ ద్వారాకూడా ఏవైనా కొన్ని ధ్వనులను నమోదుచేసి వాటిని తిరిగి వినగలము. చిలుక పలుకులు పలికినచో మంత్ర జపము ఫలితము చేతికందుట అసాధ్యము. మంత్రజప సమయములో మనస్సు ఎక్కడెక్కడికో పరుగులు పెట్టి వెళ్ళిపోతే ఏకాగ్రతను సాధించలేము. జపముతోపాటు భావనల యొక్క సమన్వయము జరుగనిచో శ్రద్ధ ఎట్లా జాగృతమవుతుంది? నిప్పు రగలటానికి, అగ్నిజ్వాల ఎగసిపడటానికి 'అగ్ని-ఇంధనము-గాలి' ఈ మూడు ఉండవలసినదే. వీటిలో ఏ ఒక్కటైనా ఉండి, మిగతా రెండూ లేనట్లయితే ఉద్దేశ్యము సంపూర్ణమవ్వదు. ఇదేవిధముగా మంత్రోచ్చారణలో ఆకాంక్ష యొక్క ముద్రలతో పాటు కల్పన కూడా జోడింపబడాలి. అంతేకాకుండా దానికి తోడు సమర్పణ-శ్రద్ధ కూడా అతి గాఢముగా అనుసంధానించబడాలి. భావన, ఆలోచనలతో పాటుగా జపప్రక్రియ సమన్వయం తోడయినట్లయితే క్రియ సంపూర్ణమైనదై, ఉపయుక్తమైన ప్రతిఫలము లభించే అవకాశం ఉంటుంది. మంత్రశబ్దముల కూర్పునకు, ఉచ్చారణ ప్రక్రియకు తమదైన మహత్వమున్నది. అయినప్పటికీ వాటితోపాటు ధ్యానము, శ్రద్ధ అవశ్యం సమన్వయింపబడాలి. అసంపూర్ణ చిహ్నపూజ చేసేవారు అసఫలతను నిందిస్తుండటము కనిపిస్తూనే ఉంటుంది.

దీనికి వ్యతిరేకముగా హాని కలిగే సమయములో ఆవశ్యకమైన పవిత్రత, అప్రమత్తతతో వ్యవహరిస్తే ముప్పు తొలగిపోయి లక్ష్యము నెరవేరుతుంది. సరియైన వస్తువులను ఉపయోగించుట, విధివిధానములో అప్రమత్తతను పాటించుట, సమగ్రతను కలిగి ఉండుట చేత అనుకూలమైన వాతావరణము ఏర్పడుతుంది. సందర్భమునకు అనుగుణంగా భావన ఉండుట అన్నది ప్రత్యేకమైన ధర్మకార్యములోను, సాధనా విధానము లోను ఆవశ్యకము. కానీ క్రియాయోగమునకు సంబంధించిన విషయాలలో ఇవి తక్కువపాళ్ళలో ఉన్నప్పటికీ పని జరిగి పోతుంది.

భావనాప్రధాన హృదయము గల జనులకు భక్తియోగము; బుద్ధివాదులకు జ్ఞానయోగము; పురుషార్థపరాయణులకు కర్మయోగసాధనలు ఇష్టముగాను ఉంటాయి, సరళముగాను అనిపిస్తాయి. ఆత్మీయత, ఏకాత్మత, దగ్గరితనములు 'రసాను భూతులు' అని చెప్పబడినాయి. దాంపత్యజీవితములో ఈ ఆధారంగానే రెండు శరీరాలు-ఒకటే ఆత్మ అని చెప్పిన మాట చరితార్థమౌతుంది. మిత్రుడు-మిత్రుని కొరకు ప్రాణాలను పణముగా పెడతాడు. ఈ కారణముగానే తల్లీ-బిడ్డల మధ్య సంతోషము, ఉల్లాసములు అల్లుకుంటాయి. దీపము-దీపపుపురుగు వంటి; పాలు-పంచదార వంటి; నదీ-పిల్లకాలువ వంటి; సముద్రం-నీటిబిందువు వంటి ఏకాత్మతను స్థాపించుకోవాలనే భావసంవేదనలో భక్తుడు మునిగిపోతాడు. దాని ఫలితంగా తిరిగి భగవంతుని నుండి ఎంతో పొందుతాడు. కట్టె నిప్పుల్లో కాలుటవల్ల అగ్నివలె మారిపోతుంది. భక్తుడు కూడా తన అహంకారమును విరాట్ మహానతలో లీనం చేసి తనకు తాను పరమాత్మకు సమునిగా భావిస్తాడు.

**వ్యక్తి గొప్పతనం అతనికిగల గుణకర్మ స్వభావాలపై ఆధారపడి ఉంటుంది**

జ్ఞానికి దివ్యదృష్టి, దూరదృష్టి సిద్ధిస్తాయి. దూరదర్శిత్వము ఆధారముగా అతను తన గతజీవితము, అలాగే భావిజీవితపు ప్రత్యేకతలను లేక విశేషాలను దర్శిస్తాడు. రెండింటి మధ్యన అనుకూలమైన పరిస్థితులను ఏర్పరచగలిగే విధముగా వర్తమానమును నిర్ధారణ గావించుకుంటాడు. దివ్యదృష్టి ప్రాప్తించినమీదట జ్ఞాని శరీరమనే తోలుబొమ్మను ఆటలాడించే ఆత్మను దర్శిస్తాడు. ఐతే మరోప్రక్క సామాన్యజనులకు కేవలము భౌతికశరీరమే కనపడుతుంది. దానిమీద ప్రీతికూడా ఉంటుంది. జ్ఞాని ద్రష్టగా అవుతాడు. అప్పుడతనికి భవ బంధనములనుండి ముక్తి లభిస్తుంది. ఆ పిమ్మట ఈ విశ్వ–ఉద్యానవనములో పరిభ్రమిస్తూ తృప్తి, తుష్టి, శాంతులనే వాటి రసాస్వాదన చేయటానికి స్వర్గసంపదలు హస్తగతమౌతాయి.

కర్మయోగి యొక్క చింతన, నడవడిక, వ్యవహారము అనేవి కర్తవ్యపాలన మీద ఆధారపడి నిర్మించబడతాయి. అతను సామాజిక బాధ్యతలను గుర్తిస్తాడు, మర్యాదల నియమాలను అనుసరిస్తూ ఉదారత్వము యొక్క రీతిని, నీతిని పాటిస్తాడు. గౌరవమర్యాదల భారము అతని మీద ఉంటుంది కనుక దారి తప్పడు. వినమ్రత అనే రాజమార్గము మీద దారితప్పకుండా నిరంతరము సమగతితో స్థిరముగా సాగుతువుంటాడు. ఇవన్నీ సాధనాపరమైన యోగాభ్యాసములు. ఈ యోగములను కర్మ–జ్ఞానములనే రెండు భాగములుగా విభజించవచ్చును. ధ్యానయోగముతో వ్యక్తిత్వము సంస్కరించబడుతుంది. జీవన ప్రవాహము 'క్రియాయోగము ద్వారా ఆత్మకళ్యాణము, లోకమంగళము' లనే రెండు లక్ష్యములను సమానరూపములో నిలుపుకునే ప్రయత్నముతో కలుస్తుంది. ధ్యానపూర్వకమైన అప్రమత్తతతోపాటు జీవనచర్యల యొక్క క్రియ, ప్రక్రియలను అనుసరించినచో ఏ వ్యక్తి యైనా యోగి అవుతాడు.

*– అఖండజ్యోతి, జనవరి 1984*

*అనువాదం: శ్రీమతి లక్ష్మీరాజగోపాలు*

---

## గురుదక్షిణ

*'శివాజీ! నీవు బలాన్ని ఉపాసించు! బుద్ధుని పూజించు! సంకల్పవంతుడివి కా! నీ దృఢ వ్యక్తిత్వాన్ని జీవితములోకి దించుకో! ఇదే నీ యొక్క దైవ–భక్తి! భారతదేశంలో పెరుగుతున్న పాపము, హింస, అవినీతి, అనాచారములతో పాటు పెరుగుతున్న యవనుల దుష్టపన్నాగముల నుండి తప్పించుకోవాలంటే భగవంతుడు నిర్మించిన ఈ సృష్టిని సుందరంగా మార్చడం తప్ప మరోదారి లేదు' అని సమర్థ గురురామదాసు శిష్యునికి బోధించారు.*

*'తమరి ఆజ్ఞ శిరోధార్యం దేవా! ప్రస్తుతానికి గురుదీక్ష అయిపోయింది, గురుదక్షిణ ఇచ్చేందుకు కూడా నాకు అనుమతి నివ్వండి' అని ఎంతో వినయంగా, దృఢభావంతో అడిగాడు శివాజీ.*

*గురుదేవుల కళ్ళు మెఱిశాయి. శివాజీ తలపై చేయివుంచి 'గురుదక్షిణగా నాకు లక్షమంది శివాజీలు కావాలి, మాటిస్తావా' అన్నారు.*

*'ఇస్తాను గురుదేవా! ఒక సంవత్సరం ఒక రోజులో ఈ గురుదక్షిణ చెల్లిస్తాను' అని చెప్పి ఆయన చరణధూళిని తలపై ధరించి మహారాష్ట్ర నిర్మాణంలో మునిగిపోయాడు.*

## ఈశ్వరుని కృప

*అనావృష్టి వల్ల సంకటస్థితిలో పడిపోయిన ప్రజల కడుపు నింపేందుకు, వారికి బ్రతుకుతెరువు చూపేందుకు శివాజీ ఒక వంతెన నిర్మిస్తున్నాడు. ఒకరోజు దూరం నుండి దాన్ని చూస్తూ ఆ వంతెన కట్టే ప్రయత్నం చేయకపోతే ఇంతమంది ఆకలితో మరణించేవారు కదా! అనుకున్నాడు. వెంటనే అక్కడినుండి బయలుదేరిన గురురామదాసుగారిని సత్కారములతో గౌరవించి పంపుతూ తాను చేస్తున్న సహాయం గురించి చెప్పాడు.*

*గురుదేవులు మౌనం వహించి వెళ్ళిపోయి మరురోజు ప్రశాంతంగా వచ్చి కూర్చొని ఒక బండవైపు చూపి దానిని పగలగొట్టమన్నారు.*

*దానిని పగులగొట్టగానే దాని క్రింద ఒక గొయ్యి కనపడింది. అందులో నిండా నీరుంది. అందులో ఒక కప్ప బెకబెకమని తిరుగుతున్నది.*

*దాన్ని చూపించి శివాజీతో – నీ సహజస్వభావముతో ఈ కప్పకు కూడా నీవే జీవన–రక్షణ వ్యవస్థను సిద్ధం చేసినట్లుందే! అన్నారు. శివాజీ సిగ్గుతో కుంచించుకు పోయాడు.*

**మనిషి ఎదిగిన కొలది ఒద్దికగా ఉండాలి**

సమాజ నిర్మాణం

# సంస్కారపూరితమైన విద్యయే బాలబాలికల యొక్క నవనిర్మాణం కావిస్తుంది

ఈనాడు ఎంత వేగంతో కుటుంబాలు విచ్ఛిన్నమౌతున్నామో దానికంటే పలురెట్లు ఎక్కువ వేగంగా చిన్న చిన్ని పిల్లలు సమాజంలో ధ్వంసాత్మకస్థితిని ఉత్పన్నం చేస్తున్నారు. పలు ప్రాంతాలలో తెరువబడుతున్న ఉగ్రవాద పాఠశాలలో విచ్ఛిన్న కరమైన పనులు చేయుటలో దక్షతను పొందుతున్న ఈ చిన్నారులు వాటిని ఎక్కడో ఒకచోట తప్పక ప్రయోగిస్తారు. ఏ కారణంగా పసిప్రాయం అపరాధములనబడే కొలిమిలలో తపించబడుతున్నది?

మానవ మస్తిష్కం నకారాత్మక-సకారాత్మకములనే రెండు భావాలతో కలుపబడి ఉంటుంది. నకారాత్మక భావాలతో వినాశకరమైన క్రియాకలాపాలు జరిగితే; సకారాత్మక భావనల వలన నవనిర్మాణం యొక్క సుఖమైన సృజనాత్మక పనులు ప్రస్ఫుటితమౌతాయి. బాల్యావస్థ నిర్మాణాత్మకమైన కాలం. పిల్లల మొదటి గురువు వారి తల్లి. ప్రథమ విద్యాలయం వారి గృహమే. పిల్లలలో ఎటువంటి భావనలు వికసిస్తున్నాయి? ఈ అంశం వారి పాలన-పోషణ ఎటువంటి పరిస్థితులలో జరుగుతున్నది అన్నదానిమీద ఆధారపడి ఉంటుంది. మన కుటుంబవ్యవస్థ - వ్యక్తిత్వవికాసం, సుసంస్కారాలు ప్రోది చెందుట అన్న విషయాల నుండే ఆరంభమౌతుంది. సంస్కారాల తోనే పిల్లల ఆలోచనలు, ప్రవర్తన నియంత్రించబడతాయి. అందుచేత ఎటువంటి సంస్కారాలను వారికి అందిస్తే, వాటికి అనురూపమైన ఆలోచనలే కలుగుతాయి. అవే ప్రవర్తన ద్వారా క్రియలుగా పరిణతి చెందుతాయి.

అధికాధిక భౌతిక అవసరాలు శీఘ్రంగా సమకూర్చు కోవాలనే కోరిక కారణంగా కుటుంబసభ్యులు ఎప్పటికీ పూడ్చలేని కందకాలు ఉత్పన్నమవుతున్నాయి. విద్వేషం, ఒత్తిడి, భయం, అస్తవ్యస్తత అన్నవి ప్రతి కుటుంబంలోని వ్యక్తుల మనోభావాలుగా తయారౌతున్నాయి. ఛిన్నాభిన్నమైన కుటుంబం లోని పిల్లలు సమాజంలో విచ్ఛిన్నకరమైన పరిస్థితులను ఉత్పత్తి చేసినట్లయితే ఆశ్చర్యపోవలసిన అవసరం లేదు. తల్లిదండ్రులు చూపిస్తున్న ఉపేక్ష పిల్లలను పలాయనవాదులుగా తయారు చేస్తున్నది.

విషయం కేవలం పిల్లల ఉపేక్షతోనే ఆగటం లేదు. ఎంత వేగంతో తల్లిదండ్రులు పిల్లల పట్ల ఉపేక్షాపూరిత ప్రవర్తనను పెంచుకుంటున్నారో; అంతే వేగంతో వారి పిల్లలపట్ల ఆకాంక్షలు కూడా పెరుగుతున్నాయి. చదువు - భావికాలపు కార్య ప్రణాళికల ఒత్తిడులతోపాటు పరీక్షల్లో సర్వదా ఉత్తమశ్రేణి పొందుటకు మార్గదర్శనం కూడా ఇవ్వబడుతుంది. బాలల బాల్యమంతా ఛిన్నాభిన్నమై, వారి పరిస్థితి గానుగెద్దు వలె తయారవుతున్నది. అలా ఉండుటకుగాను నిరంతరం కొరడా దెబ్బలను భరించవలసి వస్తున్నది. ఒకవేళ పిల్లలు తమ ఆకాంక్షలను నెరవేర్చకపోతే తల్లిదండ్రులు సకారాత్మకమైన వైఖరిని అనుసరించుటకుబదులు వారిని తిట్టి, ఆపై కొడుతున్నారు. ఇలాంటి స్థితిలో పిల్లల భావనలు దిగజారిపోతాయి. తమ నీచస్థితి నుండి బయటపడటానికి చేసే ప్రయత్నాలు వారిని ఉగ్రవాదులుగా, ఆక్రమణదారులుగా తయారుచేస్తున్నాయి. ఉన్నత వర్గానికి చెందిన ఎక్కువమంది బాలలు నేడు ఈ కారణంగానే తమ సమయాన్ని కంప్యూటర్, టి.వి., ఇంటర్నెట్ మరియు వీడియోగేమ్‌లతో గడుపుతున్నారు. నిరంతరాయంగా హింసాత్మక దృశ్యాలను చూస్తూ ఉండటం వలన పిల్లలు వాటిని చూసి భయపడుటకు బదులు పులకింతను అనుభూతి చెందుతున్నారు. పిల్లలకు చమక్కుమని మెరిసే కళాకారులు, చలనచిత్ర తారాగణం ఆదర్శప్రాయం. వ్యాపార జగత్తు యొక్క పాత్ర కూడా పిల్లలను దిగ్భ్రాంతికి లోను చేసేదిగా ఉన్నది. వస్తువు కొనుగోలు చేయుటలో పిల్లలదే తుది నిర్ణయం అన్న విషయం అనుభవజ్ఞులైన వ్యాపారులకు తెలుసు. అందువలన వారుకూడా దీని పూర్తి లాభాన్ని పొందుతున్నారు. నేడు కేవలం పిల్లలకి కావలసిన వస్తువుల ఉత్పత్తిలో 5000 కోట్ల రూపాయల పెద్ద వ్యాపారం జరుగు తున్నది. ఈనాడు 'సాదా జీవనం-ఉన్నత ఆలోచన' అనే నిశ్చయసూత్రం గడచిపోయిన కాలంలో ఆచరించబడిన విషయంగా అయిపోయింది.

పూర్వకాలంలో విద్య దానంగా ఇవ్వబడేది. ఇప్పుడు ఇది కూడా వ్యాపార వస్తువుగా తయారయ్యింది. తమ పిల్లలను ఆంగ్లభాష మాధ్యమంగా చదివించాలనే తల్లిదండ్రుల కోరికే

**ఆనందం ఎక్కడో లేదు - నీలోనే ఉన్నది**

ఈ వ్యాపారం ఫలించి-పుష్పించటానికి పూర్తి సహాయం చేసింది. పాఠశాల యాజమాన్యం కోరినంత రుసుం చెల్లించి పిల్లలను పాఠశాలలో అప్పగించటమే తల్లిదండ్రుల బాధ్యతగా భావించబడుతున్నది. మరోవైపు చూస్తే చదువు వెలుగులు ప్రసరించని ఎంతోమంది పిల్లలున్నారు. స్వాతంత్ర్యం లభించిన ఇన్ని సంవత్సరాల తర్వాత కూడా భారతదేశంలో ప్రతి సంవత్సరం ఒక కోటిముప్ఫైలక్షలమంది పిల్లలు చదువురాని నిరక్షరాస్యులుగా ఉండుట వారి పాలిట శాపం. ప్రతి సంవత్సరం ఒక కోటీ యాభై లక్షలమంది పిల్లలు ప్రాథమిక పాఠశాలలో ప్రవేశించటానికి తగిన వయస్సులో ఉన్నారు. కానీ బడిలో చేరేవారు కేవలం 13 లక్షలమంది మాత్రమే. దయనీయమైన ఆర్థికస్థితి కారణంగా ఒక పెద్ద వర్గంవారు తమ పిల్లలను బడికి పంపే సాహసం చూపించలేకపోతున్నారు అనేదికూడా దీనికి ఒక కారణం. బడికి వెళ్ళే పిల్లలుకూడా దానిని చెరగా భావించి అక్కడినుండి తప్పించుకొనేందుకు ఏదో ఒక మార్గాన్ని వెతుకుతున్నారు.

సమాజ వ్యవస్థలో ఉన్న ఈ వికృతస్వరూపాల కారణంగానే పిల్లలు నేడు ఆక్రమణదారులుగా తయారయ్యారు. వర్షం అన్ని మొక్కలమీదా సమానంగా కురుస్తుంది. అయితే ప్రతి మొక్క యొక్క ప్రకృతిని అనుసరించి ఎరుపు, పసుపు, తెలుపు మొదలయిన విభిన్న రకాల పుష్పాలు వికసిస్తాయి. అదేవిధంగా పిల్లల వ్యక్తిత్వ నిర్మాణం వారి సంస్కారాలకి అనుగుణ్యంగానే ఉంటుంది. కుటుంబం బాలలకు ప్రథమ పాఠశాల. బాలలలో సుసంస్కారాల స్థాపన మొదటి ప్రయత్నమును కుటుంబంనుండే ఆరంభించాలి. తల్లి-తండ్రి అవ్వాలనే కోరికతో పిల్లలకు జన్మనిస్తే సరిపోదు. వారి సర్వాంగపూర్ణమైన వికాస బాధ్యతను కూడా నిర్వర్తించాలి. పిల్లల ఉజ్జ్వల భవిష్యత్తు గురించి తల్లిదండ్రులు కలలుకంటారు. దానికి అనుగుణ్యంగా మొదట తమకు తాము ఆ కలలను సాకారం చేసుకోవాలి.బాలల యొక్క ప్రతి పనిలోను తల్లి-తండ్రి ఇద్దరు దృష్టినిపెట్టాలి. పిల్లలపట్ల ఇద్దరియొక్క ప్రేమతో కూడిన సహకార దృష్టికోణం బాలలను చక్కని వికాసమార్గంపై ముందుకు నడిపిస్తుంది.

రెండవ ముఖ్య బాధ్యత పాఠశాలలది. ఆంగ్లభాషలో చదివించినంతమాత్రాన బాలలు సుసంస్కారవంతులుగా తయారైనట్లయితే ఈనాడు విదేశాలలో బాల అపరాధుల సంఖ్య ఇంత ఎక్కువ ఉండేది కాదు. బాలల నవనిర్మాణం కొరకు వ్యక్తిత్వనిర్మాణం కావించే చదువుయొక్క అవసరమున్నది. ఈనాడు చదువు చెప్పే ఉపాధ్యాయులు ఉన్నారు, ప్రొఫెసర్స్ ఉన్నారు, ప్రధానోపాధ్యాయులు, విద్వాంసులు ఉన్నారు, కానీ విద్యను అందించే ఆచార్యులు లేరు. స్వయంగా భోగి అయిన వ్యక్తి బాలలకు త్యాగం గురించి ఎలా నేర్పుతాడు? స్వార్థంతో అంధుడైన వ్యక్తి ఇతరులను తపస్వులుగా ఎలా తయారు చేస్తాడు? అంధుడు ఎవరికి మార్గమును చూపిస్తాడో వారిని తనతోపాటుగా పడేస్తాడు అన్నది సత్యం.

ఆచార్య అనే పదం యొక్క గొప్పతనాన్ని వివరిస్తూ అథర్వణ వేదంలో ఇలా చెప్పబడి ఉంది. **'ఆచార్యోం మృత్యుర్వరుణః సోమః ఓషధయః పయః'** అనగా ఆచార్యుడు మృత్యువు రూపు ధరించి ప్రపంచం యొక్క నిస్సారతను ఉపదేశించేవాడు, జలరూపం ధరించి పాపాలను కడిగివేసేవాడు, చంద్రుని రూపు ధరించి హృదయానికి ఆహ్లాదాన్ని అందించేవాడు, ఔషధ రూపుదాల్చి శరీరాన్ని క్షీణతనుండి, రోగాలనుండి రక్షించేవాడు, పాల రూపునుదాల్చి శరీరానికి పుష్టిని కలిగించేవాడు.

ఈనాడు ఆచార్యులు తిరిగి తమస్థితిని పొందవలసి ఉన్నది. తల్లి-తండ్రి తమ పిల్లలను వారికి అప్పగించి, వారిమీద ఏ విశ్వాసమును ఉంచారో, ఆ విశ్వాసాన్ని సడలనీయకుండా ఉంచే బాధ్యతను ఆచార్యులు తమ కర్తవ్యపరాయణత ద్వారా నిభాయించవలసి ఉన్నది. ఈ విషయంలో తల్లిదండ్రులు- ఉపాధ్యాయులతోపాటు సాహిత్యకారులు, మేధావులుకూడా తమ ప్రయత్నాన్ని చేయాలి. ప్రభుత్వం కూడా తన వ్యాపారాత్మక దృష్టికోణాన్ని వదిలివేసి ధర్మం, దర్శనం, సంస్కృతి వంటి రంగాలలో అత్యధికంగా దృష్టిని నిలపాలి. బాలలను చెడు దారిలో నడిపించే సాహిత్యం, టి.వి. కార్యక్రమాల మీద తక్షణమే నిలుపుదల ఆదేశాలను జారీచేస్తే ఈ దిశలో ముందంజ వేసినట్లే ప్రతి ప్రాంతంలోను సంస్కారం-అహింసలను గురించి తెలియజెప్పే చక్కని శిక్షణాకేంద్రాలను నిర్వహించి నట్లయితే ఖచ్చితంగా దారితప్పిన బాలమనస్సును సరైన దిశలో పెట్టవచ్చును. వర్తమాన సమాజ వ్యవస్థలో బాలల నవ నిర్మాణానికి ఆమూలాగ్రం మార్పు తెచ్చుటకు మన నైతిక విలువలను పెంచుతూ వారికి సరైన దిశానిర్దేశం చేయుట అన్నది తప్పనిసరి కర్తవ్యం.

*– అఖండజ్యోతి, ఫిబ్రవరి 2004*

*అనువాదం: శ్రీమతి కృష్ణకుమారి*

**లోపల ఉన్న ఆనందాన్ని బయట వెదికితే ఎలా దొరుకుతుంది**

# లోకశిక్షకుల జీవనోద్దేశ్యం, లక్ష్యం - 3

*పరమపూజ్యగురుదేవులు తమ యొక్క విశిష్టమైన ప్రబోధము ద్వారా లోకశిక్షకుల (ప్రజలకు బోధించేవారు) జీవిత లక్ష్యమును, ప్రయోజనమును నిర్దేశిస్తూ 'మానవులపైన ఆవరించియున్న అజ్ఞానమును తొలగించి, వారిని కషాయకల్మషముల నుండి విముక్తి గావించుటయే లోకశిక్షకుల యొక్క కర్తవ్యము' అని చెప్పినట్లు గత సంచికలో మీరు చదివియున్నారు. 'ఇలా చెయ్యటానికిగాను కేవలము ఉపన్యాసములు చెప్పినంత మాత్రాన సరిపోదు, లోకశిక్షకులుగా మనదలచినవారు తమ ఆచరణ ద్వారా ఇతరుల ముందు తామే ఒక ఉదాహరణగా నిలబడవలసియుంటుంది' అని చెప్తూ పరమపూజ్యగురుదేవులు 'బలమైన శ్రద్ధావిశ్వాసములు కలిగినవారు మాత్రమే తమ ఆచరణ ద్వారా ఇతరులను ప్రభావితులను చెయ్యగలరు. తమ శ్రద్ధావిశ్వాసములను మరింతగా సంస్కరించుకుంటూండేవారి శీలము, వ్యక్తిత్వము కూడా అదే రీతిలో అభివృద్ధిచెందుతాయి. తదనుగుణముగా వారు తమ వ్యక్తిత్వమును ఇతరులపై ముద్రవేయటంలో సఫలీకృతులౌతారు' అని కూడా తెలియజేస్తున్నారు. రండి! వారి అమృతవాణిని మరింతగా హృదయంగమము చేసుకుందాము!*

## కషాయకల్మషములకు కారణము అపరాధము మరియు పాపము



ఇతరులకు ఏదైనా విషయమును బోధించదలచుకుంటే ముమ్మందుగా దానిని మనము మన జీవితములో నేర్చుకోవాలి. 'మానవుడు కషాయ కల్మషములతో నిండిన జీవితము గడపటానికి కారణాలు ఏమిటి?' అన్న విషయమును బోధించదలచు కున్నాము. లోభమోహములే దానికి ముఖ్య కారణము. ఈ లోభ మోహములకు కూడా ఇంకా మరెన్నో శాఖలు ఉన్నాయి. మన దగ్గరున్న తెలివిని, శక్తిని ఉపయోగించు కొనకపోవటమనేది అందులో మొట్టమొదటి శాఖ. ప్రతీదీ మనం డబ్బుతోనే ముడిపెట్టుకుంటూంటాము. వంద రూపాయలు ఇస్తామన్నవారి దగ్గరకు వెళ్ళి ఉపన్యాసం చెప్పటం కన్నా, నూటయాభై రూపాయల ప్రతిఫల మిస్తామన్న వారి దగ్గరకు వెళ్ళి చెప్పటానికే ప్రాముఖ్యత నిస్తాము. ఇలా చెయ్యటం వలన మన మాటకు ఏమాత్రమూ విలువ ఉండదు. ఇతరులను ప్రభావితం చెయ్యాలంటే మీరు మీ లోపల ఒక అయస్కాంతమును తయారుచేసుకొనగలగాలి. అది మాటలతో తయారుకాదు. యజ్ఞం చేసే విధివిధానం ద్వారా కూడా కాదు. లోభమోహములను మీ నుండి నిర్మూలించుకొనటానికి అవసరమయ్యే ధైర్యమును మీ లోపల ఉత్పన్నము చెయ్యగలిగేదే అసలైన అయస్కాంతము.

మీరందరూ పరిపూర్ణమైన రూపంలో మాముందు కూర్చునున్నారు. ఎవరు ఒక గంట సమయమును వ్యర్థం చెయ్యటానికి ఇష్టపడదు. కానీ మేము మిమ్మల్నందరినీ ఇక్కడకు పిలిపించాము. ఇక్కడే పూర్తిగా రెండు నెలలున్నాసరే లేదా ప్రతి సంవత్సరమూ ఒక నెలరోజులు ఇక్కడ గడపటానికి అంగీకరించినా సరే, మీ పరిస్థితులు చక్కబడి మీకు అనుకూలంగా మారేవిధంగా మేము మిమ్మల్ని తీర్చిదిద్దగలము. అప్పుడు మీరు ఈ విశ్వమంతటినీ మీ కుటుంబముగానే భావించగలుగుతారు. ప్రజాహితం కోసం పాటుపడగలరు. మీ గుణగణములను మరింతగా ఔన్నత్య పరచుకొనటము మీ గౌరవంగా భావిస్తారు. అందుకోసమే మేము మిమ్మల్ని తయారుచేశాము.

## అసలు ఆధ్యాత్మికత అంటే ఏమిటి?

ఈనాడు ఆధ్యాత్మికతకు సరియైన అర్థమును ఎవరు చెప్పగలుగుతున్నారు? 'త్యాగం చెయ్యడాన్ని నేర్పించడమే అసలైన ఆధ్యాత్మికత' అనే విషయము ఇప్పుడు ఎక్కడా వినపడటం లేదు. ప్రస్తుతకాలములతో అనుభవించడము (భోగం) మాత్రమే నేర్పించబడుతున్నది. ఆధ్యాత్మికత అంటేనే

విమర్శ అనేడిది సూచనగా ఉండాలి

'భోగం'గా మారిపోయింది. మీకు సిరిసంపదలు లభిస్తాయి, కోర్కెలు నెరవేరుతాయి, సంతానం కలుగుతుంది. ఇహలోకం లోని మనోరథములన్నీ నెరవేరుతాయి. చనిపోతే బంగారు విమానం వచ్చి మిమ్మల్ని స్వర్గానికి తీసుకుపోతుంది. అక్కడ కల్పవృక్షం మీ కోర్కెలన్నింటినీ నెరవేరుస్తుంది. ఈనాటి ఆధ్యాత్మికత ఇదే. ఇది మనకు లోభాన్ని నేర్పిస్తుంది. తద్వారా భోగమోహములకు బానిసలమయ్యేలాగా చేస్తుంది. ఇది పనికి రానిది.

ఇటువంటి వ్యర్థమైన ఆధ్యాత్మికతనుండి మిమ్మల్ని విడిపించి, మీకు త్యాగము చెయ్యటము, బాధను సహించడము, కష్టమును ఎదుర్కొనడము కోసం ప్రపంచమునకు నష్టం కలిగించకుండా ఉండటం కోసం ఉపయోగపడే ఆధ్యాత్మికతను మీకు తెలియచెప్తాను. అటువంటి ఆకర్షణను మీరు ఇక్కడినుండే తీసుకొని వెళ్ళాలి. హోమం చెయ్యటం, ఉపన్యాసం చెప్పటం మొదలైనవి నేర్చుకొనటం వలన అన్నివిధములైన సాఫల్యతలు మీకు లభిస్తాయి. స్వయంగా మీ లోపల ఒకవిధమైన ఆకర్షణను మీరు ఉత్పన్నం చేసుకోవాలి. తత్ఫలితముగా మీరు ఎక్కడికి వెళ్ళినా, ఏమి చెప్పాలనుకున్నా తక్షణమే వాటంతట అవే జరిగిపోతుంటాయి. ఏవిధంగా మేము మీవంటి వేలు, లక్షలమందిని మా మార్గములోకి ఆకర్షించి తీసుకురాగలిగామో మీకు అలాంటి సామర్థ్యము లభిస్తుంది. బాలురు, బాలికలు ఏమి చెయ్యవచ్చునో, ఏమి చెయ్యకూడదో అర్థమౌతుంది.

## అర్థం చేసుకోగలిగినప్పుడే జీవితం ప్రారంభమౌతుంది

40 సంవత్సరముల వయస్సులో జ్ఞానం వచ్చిన తరువాత మనిషికి అసలు జీవితమంటే ఏమిటో అర్థమౌతుంది, ఒక అవగాహన ఏర్పడుతుంది. కాబట్టి 40 సంవత్సరముల తరువాతే మనిషి జీవించడము ప్రారంభిస్తాడు. 60 సంవత్సరాలకు అనుభవాన్ని సంపాదిస్తాడు. మనిషి జీవితంలో కొన్ని దెబ్బలు తిన్న తరువాత జ్ఞానమును పొంది, అనుభవమును సముపార్జించుకొని అప్పుడు ఏదైనా పనిచెయ్యటానికి సమర్థుడు అవుతాడు.

మీరు కొంచెం లోతుల లోలోపలికి వెళ్ళండి. అలా వెళ్ళలేక పోతే మీకు శాంతినీ, సమాధానమునూ ప్రసాదించగలిగే ఆ ఆకర్షణ, ఆ సత్యము, ఆ అయస్కాంతము లేదా ఆ ప్రభావమూ మీలో ఉత్పన్నము కాలేవు. వేలాదిమంది వ్యక్తులను జాగృతం చేసి, ప్రభావితం చెయ్యగలిగే ఆ బ్రహ్మతేజస్సు, బ్రహ్మవర్చస్సు మీలో ఉదయించలేవు. దానిని మీరు మీ లోలోపల ఉత్పన్నం కానివ్వాలి. ఇదే మా అసలైన శిక్షణ. దానిని నేర్చుకున్న తరువాతనే మీరు ఇక్కడినుండి వెళ్ళవల్సియుంటుంది.

## మా అసలైన శిక్షణ ఏమిటి?

24 అనుష్ఠానములు పూర్తిచేసిన పిదపనే మా అసలైన శిక్షణ ప్రారంభమైనది. 'మేముకూడా మీ వలెనే బార్లీరొట్టెలు తిని, మజ్జిగ త్రాగుతాము. మాకు కూడా అద్భుతాలు చెయ్యగలిగే శక్తి వస్తుందా?' అని మీరు అడుగవద్దు. అది అసంభవం. మీరు మమ్మల్ని అనుకరించదలచుకుంటే మా తపస్సుకు మాధ్యమమైన రెండు అంశములను మీరుకూడా ఆచరించండి. మేము చేసిన గాయత్రీజపం, గాయత్రీహవనం మీరు కూడా చెయ్యగలిగేటట్లు మిమ్మల్ని తీర్చిదిద్దుతాము. అందుకోసము మీరు లోభ, మోహములను త్యాగం చెయ్య వలసి ఉంటుంది.

మేము ఆధ్యాత్మిక జీవితంలో ప్రవేశించిన పిదప గాయత్రీ తపోభూమిని నిర్మించాలని నిర్ణయించుకున్నాక అది సుమారు 10 లక్షల రూపాయల పనిగా నమూనా అంచనా తయారైనది. అప్పుడు ధనమును సమీకరించడమనే పెద్ద పనిని చేపట్టవలసి వచ్చింది. జనం వద్దకు వెళ్ళి అడిగి ధనమును సమీకరించ వలసి వస్తుంది' అన్న ఆలోచన రాగానే, 'ముందుగా మేమే స్వయంగా ఏదైనా త్యాగం చేసి అప్పుడు ప్రజల వద్దకు వెళ్ళాలి' అని మా మనస్సు నిర్దేశించినది. స్వయంగా ఏదైనా త్యాగం చెయ్యాలనే నిర్ణయం కలిగినప్పుడు ప్రజల వద్దకు వెళ్ళి 'మీరు కొంత త్యాగం చేసి, ధనమును విరాళముగా ఇవ్వండి' అని ఏవిధంగా అడుగగలం? ఏవిధంగా వారిని ఒప్పించగలము?' అని కూడా యోచించాను. వారసత్వముగా వచ్చిన భూమి మొదలైనవాటిని అమ్మగా సుమారు లక్షన్నర, రెండు లక్షల రూపాయల వరకూ మాకు లభించిన సొమ్మును గాయత్రీ తపోభూమిని నిర్మించటానికిగాను జమచేశాము. పుట్టినింటి వారు-అత్తింటివారు ఇచ్చిన ఆభరణములను విక్రయించి సుమారు 14500 వేల రూపాయలు మాతాజీ దీనికోసమై సమర్పించారు. 'ఈ ధనమంతా వెచ్చించి మీ స్వంతానికి మంచి ఇల్లు ఏర్పరచుకోవచ్చును గదా?' అని మా హితైషులు సూచించారు. కానీ అంత డబ్బు పెట్టి మా ఒక్కరికోసం ఇల్లు కొనడం అనవసరమనిపించినది. పాతికరూపాయలు పెడితే మంచి ఇల్లు అద్దెకు దొరుకుతుందిగదా అని నిర్ణయించు కున్నాము. అందుచేత మావద్ద పోగైన ధనము మొత్తమును గాయత్రీతపోభూమి నిర్మాణమునకు ఖర్చుచేశాము.

**చేస్తున్న పనిని ప్రేమిస్తే ఫలితం గొప్పగా ఉంటుంది**

ఇక చూడండి, ఈ జమ చెయ్యటమనేది అద్భుతమైన అయస్కాంతము లాగ పనిచేసింది. ఫలితంగా 10 లక్షల రూపాయల విలువ చేసే గాయత్రీతపోభూమికి విరాళములు వెల్లువగా వచ్చాయి. అక్కడి ముద్రణాలయము, ఫర్నీచర్, ఇంకా తదితర వస్తువులు... అన్నీ ఎంతో విలువైనవే! అచ్చు వెయ్యటం మొదలుకొని మొత్తం ఒక విలువైన వ్యవస్థీకృత రూపంలో ఏర్పాటుచేయబడినది. ఇక సహస్రకుండీ యజ్ఞములు మొత్తం 7 మార్లు ఒకే సంవత్సరములో చేశాము. వాటన్నింటికీ ఖర్చయిన వేలాది, లక్షలాది రూపాయలు మొత్తం ప్రజాధనమే!

ఇవేకాకుండా శతకుండీయజ్ఞములుకూడా చాలా చేశాం. అన్నింటి ఖర్చూ చూసుకుంటే కోట్లరూపాయలు దాటుతుంది. మేము చెప్పిన మాటల వల్ల, మా ప్రేరణా ప్రభావములతో ఇంత డబ్బు ప్రోగైనది. ఇదంతా ఎక్కడినుండి వచ్చినది? గాయత్రీతపోభూమి స్థాపన కోసం మేము నాటిన బీజం నుండే వచ్చింది. మీరుకూడా ఇక్కడినుండి ధైర్యమును కూడదీసుకోండి. డబ్బును కూడబెట్టి ఇంట్లోవారికి ఇవ్వాలి అనే లాలస, కాంక్షను మీ మనస్సునుండి తొలగించివెయ్యాలి. న్యాయోచితమైన అవసరములు మీకు తప్పక లభించి తీరుతాయి.

### సాహసం యొక్క పేరే ఆత్మబలం

న్యాయోచితమైన అవసరములను నిర్ణయించడం అనగానే మనకు ఈశ్వర్‌చంద్రవిద్యాసాగర్‌గారు గుర్తుకు వస్తారు. వారు తమకు లభించే 500 రూపాయల వేతనములో 50 రూపాయలు తమ కుటుంబ ఖర్చులకు వినియోగించి, మిగిలిన 450 రూపాయలను పేదవిద్యార్థులకు అందించాలని యోచించేవారు. మీలోకూడా అటువంటి ధైర్యమే కనుక ఉంటే దానిని మేము 'ఆత్మబలం' అని పిలుస్తాము. మనిషి తన లోభమును, మోహమును కాలితో తన్నివేయగలిగిన అయస్కాంతం పేరే 'ఆత్మబలం!' అది సింహంతో సమానమైన, ఏనుగుతో సమానమైన బలం గలిగినది.

### పేదరికమును కప్పుకొని జీవిస్తారు సాధువులు

వానప్రస్థజీవితములోకి ప్రవేశించదలచుకున్నప్పుడు మొట్టమొదట చెయ్యవలసిన పని 'న్యాయోచితమైన రీతిలో అసలు మీకు కావలసిన కనీస అవసరములను గుర్తించ గలగటము.' సాధువులు, సన్యాసులు పేదరికముతో కూడిన జీవితమును గడపటానికి సిద్ధంగా నుండవలెననే విషయమును మీరు తెలుసుకోవాలి. పొట్ట నింపుకొనటానికి కావలసిన ఆహారము, శరీరమును కప్పుకొనటానికి అవసరమయ్యే వస్త్రములు, పిల్లల బాధ్యతలను పూర్తిచెయ్యటానికి తగినంత ధనోపార్జన చెయ్యటం–వీటితో అత్యంత పొదుపుగా జీవన యానం చెయ్యగలగటమే సాధువుల జీవితానికి పరిమిత మవుతుంది. గృహస్థు బాధ్యతలకూ, సాధువుల బాధ్యతలకు భూమ్యాకాశములకున్నంత తేడా ఉంటుంది. గృహస్థు తన కుటుంబసభ్యులను సంపన్నులను గావించటానికీ, వారిని సంతోషంగా ఉంచటానికి తాపత్రయపడతాడు. సాధువులు తమ కర్తవ్యాలను నెరవేర్చటానికిమాత్రమే పరిమితమౌతారు.

కుటుంబ నిర్వహణకు అవసరమయ్యేంత ధనం ఖర్చుచేసిన పిదప ఇక మీరు లోభం పైన అంకుశమును ప్రయోగించవలసి ఉంటుంది. అందుకోసమై కోరికలకు ఆనకట్ట వెయ్యటం మొదటిపని. కోరికలను అడ్డుకున్న పిదప, మిగిలిన సమయంను సమాజసేవలో వినియోగించడం ప్రారంభించండి. సమాజసేవ చెయ్యగలిగినంత శక్తి లేదని మీరు అనుకున్నప్పుడు ఇవ్వగలిగి నంత ధనం నేరుగా సమాజానికే ఖర్చుచెయ్యండి. తమ ఇంటి లోని కుక్కకు స్నానం చేయించటానికీ, ఆహారమునకూ, ముఖమల్ మెత్తల మీద పడుకోబెట్టడానికీ రోజుకు 25 రూపాయలు ఖర్చుచేసే సంపన్నుడైన వ్యక్తి, 25 రూపాయలు సమాజసేవకు విరాళమిస్తే అదేమంత విశేషం కాదు. పూట గడవటానికి కూడా శక్తిలేని విషమపరిస్థితులలో ఉన్నప్పటికీ, తన కొచ్చే కొద్దిపాటి ఆదాయంలోనుండి ఒక రూపాయి తీసి సమాజసేవకు అందిస్తే, అది లక్షలరూపాయలతో సమానము అవుతుంది. ఎంత శాతం ఇస్తున్నామన్నది కాదు ఇక్కడ ప్రశ్న. మనం కష్టపడి సంపాదించి దాచుకున్న ధనంలో ఎంత భాగం సమాజసేవకు అందిస్తున్నామన్నదే ముఖ్యమైన అంశము.

అటువంటప్పుడే మీ ఆకర్షణ, మీ శక్తి, బలం–ఆత్మబలం మీకు తెలియకుండానే పెరిగిపోతాయి. ఎవరినీ అడగకుండానే వృద్ధిచెందుతాయి. అప్పుడు ఎవరినీ చందాలు అడిగే అవసరం ఉండదు. ఫోటోలు ప్రచురించుకోవలసిన పని ఉండదు. లోభమును వదిలించుకొని ప్రారంభించిన ఈ కార్యక్రమమునకు ఎంతటి ఆకర్షణ లభిస్తున్నదో మేము గమనిస్తూనే ఉన్నాము. 'సహస్ర కుండీయ యజ్ఞమునకు చాలా ఖర్చవుతుంది కదా? మరి డబ్బు ఏర్పాట్లు చూస్తున్నారా?' అని మీరు మమ్మల్ని అడుగుతుంటారు. 'నాయనా! చూస్తూండండి. ఏమి చెయ్యాలో అది చేస్తాము.'

(సశేషం)

*– అఖండజ్యోతి, జులై, 2014*
అనువాదం: *శ్రీమతి కృష్ణకుమారి*

**సంకల్పం దృఢంగా ఉన్నప్పుడు ఓటమి ఉండదు**

**నా వారితో నా మాట**

# మహాశివరాత్రి యొక్క రహస్యం



ఫిబ్రవరి 17 మహాశివరాత్రి పర్వదినము. యుగ పరివర్తన అనే మహాయాత్రలో పాలుపంచుకుంటున్న వారందరికీ ఇది చాలా విశేష మహత్త్వమున్న మహా పర్వదినము. ఈ మహాయాత్రకు సూత్ర–సంచాలకుడు, సూత్రధారి, మహేశ్వరుడు అన్నీ ఆ పరమేశ్వరుడే. ఆయనకు లీలాసహచరులుగా మారితేనే మనకు, మన పరిజనులందరికీ గుర్తింపు అనేది ఉంటుంది. యుగఋషి పరమపూజ్య గురుదేవులు "మహాకాలుని యుగపరివర్తన ప్రక్రియ" అనే పుస్తకము వ్రాస్తున్నప్పుడే ఈ విషయాన్ని స్పష్టంగా తెలిపారు. ఆ తరువాత ఆయన 1990 వసంతపంచమి రోజు ఈ సత్యాన్ని మరోమారు ఉద్ఘాటిస్తూ **"వసంతపంచమి సందర్భంగా మహాకాలుని సందేశము"** అనే లేఖను విడుదల చేశారు. ఈ వసంతపంచమి ఆయన సశరీరంగా ఉన్నప్పుడు జరిపిన చివరి వసంతపంచమి పర్వదినము. ఇందులో ఆయన తన మూలస్వరూపము గురించిన కొన్ని సత్యాలను తెలియ చేశారు. వాటిని ఎవరు అర్థం చేసుకోగలరో వారు అర్థం చేసుకున్నారు, ఎవరు చేసుకోలేరో వారు జారిపోయారు, జారిపోతారు కూడా!

శివరాత్రి అనేది గురుభక్తులకు, శివభక్తులకు చాలా విశేషమైన పర్వదినము. గోస్వామి తులసీదాసుగారు **"గురుం శంకర రూపిణమ్"** అని చెప్తూ గురువు, శంకరుడు ఒకే రూపమని నిరూపించారు. మహాకాల భగవానుడిని అర్చించుకునే, ఆరాధించుకునే మహాపర్వదినమే శివరాత్రి. ఈశానసంహితలో దీని గురించి ఇలా చెప్పారు –

**మాఘ కృష్ణ చతుర్దశ్యామాదిదేవో మహానిశి ।**
**శివలింగంతయోద్భూత: కోటిసూర్య సమప్రభః ॥**
**తత్కాల వ్యాపినీ గ్రాహ్యా శివరాత్రివ్రతేతిథిః ।**

అనగా మాఘమాసంలోని కృష్ణపక్ష చతుర్దశి నాటి అర్ధరాత్రి మహాంధకారములో ఆదిదేవుడైన మహాదేవుడు కోటిసూర్య సమాన తేజస్సుతో దీప్తిమంతుడై వెలుగులు విరజిమ్ముతూ శివలింగ రూపంలో ఆవిర్భవించాడు. అందుచేత మహాంధకారము వ్యాపించిన ఈ రోజునే ఈ శివరాత్రి వ్రతమును జరుపుకోవాలి.

యుగఋషి పరమపూజ్య గురుదేవులు ఈ శివరాత్రి పర్వదిన రహస్యమంతా శివునిలోనే ఉన్నదని, శివుని రహస్యమంతా శివాలయములోనే ఉన్నదని చెప్పారు. శివాలయ రహస్యమును అర్థం చేసుకున్నవారు జీవనసాధనాత రహస్యమును, విజ్ఞానమును అర్థము చేసుకోగలుగుతారు. విభిన్న ప్రసంగాలలోను, విభిన్న ప్రకరణాలలోను ప్రతిసారి ఆయన ఈ రహస్యములను గురించి ఉద్ఘాటిస్తూనే ఉన్నారు. ప్రతి శివాలయములోను నంది, కూర్మము అనగా తాబేలు, గణేశుడు, హనుమంతుడు, జలధార, నాగులు వంటి ప్రతీకలు ఉంటాయి. వీటిలో జీవనసాధనకు సంబంధించిన సూక్ష్మ భావాలను, నిగూఢమైన జ్ఞానమును తెలియచేసే సంకేతాత్మక సూత్రాలు ఇమిడి ఉంటాయి. ప్రతి శివాలయంలోను ప్రప్రథమంగా నంది దర్శనమే జరుగుతుంది. ఇది మహాకాలుడైన శివుని వాహనం. నంది సామాన్యమైన ఎద్దు కాదు. అది ధర్మమునకు, బ్రహ్మచర్యమునకు ప్రతీకగా చెప్పబడింది. అంతేకాదు శివుడు ఆత్మకు, నంది శరీరమునకు ప్రతీకలుగా చెప్పబడ్డారు. నంది దృష్టి ఎల్లప్పుడూ సదాశివుని వైపే ఉంటుంది. అదేవిధంగా మన శరీరానికి కూడా ధర్మ పరాయణతను, బ్రహ్మనిష్ఠను అలవరచి నిరంతరము ఆత్మాభిముఖంగా ఉండేలా తయారుచేసుకోవాలి.

శివ అంటే 'కళ్యాణకరము' అని అర్థము. మన అంతఃకరణయందు ఎల్లప్పుడు అందరికీ శుభం జరగాలనే భావమే ఉండాలి. అందరికీ మంగళమే జరగాలనే ఆకాంక్ష, కామన ఉంటే జీవుడు శివమయం అవుతాడు. జీవాత్మ యందు ఇటువంటి శివత్వమును ప్రకటించుకునే సాధననే నిజమైన శివపూజగా, అసలైన శివదర్శనంగా చెప్పాలి. ఇందుకొరకై ఆత్మకు వాహనమైన శరీరాన్ని అనుకూలంగా, ఉపయుక్తంగా

**కార్యదీక్షతో కష్టపడి పనిచేస్తేనే లక్ష్యం చేరుకుంటాము**

తయారుచేసుకోవాలి. మన దేహము కూడా నందికి వలెనే ఆత్మాభిముఖంగా ఉంటూ శివమయంగా ఉండాలి. ఇది సాధించాలంటే ధర్మపరాయణులుగా ఉంటూ బ్రహ్మభావము నందు స్థిరంగా, దృఢంగా ఉండగలగాలి. అప్పుడే మనం శివుని కృపకు పాత్రులం కాగలుగుతాము. నంది తరువాత శివుని వైపుగా ముందుకు వెళితే మనకు కనిపించేది తాబేలు. నంది ఎలాగైతే మన స్థూలశరీరానికి మార్గదర్శనమును, ప్రేరణను అందిస్తుందో అదేవిధంగా తాబేలు మన సూక్ష్మ శరీరానికి మార్గదర్శనం చేస్తుంది. సూక్ష్మశరీరము అంటే మనస్సు. అది తాబేలు వలెనే కవచమును ధరించి చక్కని దృఢత్వమును కలిగివుండాలి. తాబేలు ఎలాగైతే శివుని వైపుగా కదులుతూ ఉంటుందో అదేవిధంగా మన మనస్సు కూడా శివుని వైపే కదులుతూ శివమయం కావాలి. అందరికీ శుభం జరగాలనే ఆలోచనలే ఉండాలి, ఆత్మకు మంచి జరిగే మార్గము కొరకై ప్రతి ఒక్కరూ నిరంతరం ప్రయత్నశీలురై ఉంటూ సంయమనమును కలిగి స్థితప్రజ్ఞులై ఉండాలి.

మనస్సు యొక్క ఆలోచనల ప్రవాహము, ఇంద్రియాలు చేసే పనులు శివభావముతో నిండి ఉండాలి. ఇది నేర్పించాలనే భావముతోనే శివాలయంలో తాబేలు శివుని వైపు నడుస్తున్నట్లుగా ఉంటుంది. జాగ్రత్తగా గమనిస్తే తాబేలు యొక్క దిశ ఎప్పుడూ నంది వైపు ఉండదు, శివుని వైపే ఉంటుంది. అదేవిధంగా మన మనస్సు కూడా అనవరతము, నిరంతరము దేహాభి ముఖంగా కాకుండా ఆత్మాభిముఖంగా ఉండాలి. అది ఎల్లప్పుడూ భౌతికప్రపంచం వైపు కాకుండా ఆధ్యాత్మికత వైపే కదులుతుండాలి. ఆలోచనల్లో ఎప్పుడూ శివుడే నిండి ఉండాలి. నంది, తాబేలు రెండూ శివుని వైపు కదులుతున్నప్పుడు అనగా శారీరిక, మానసిక చింతనలు రెండూ ఆత్మవైపుగా కదలాలి. అప్పుడు ఈ రెండింటికీ శివస్వరూపమైన ఆత్మసాక్షాత్కారము నకు తగిన యోగ్యత ఉన్నదా లేదా అని పరీక్షింప బడుతుంది. ఆ విషయాన్ని ప్రమాణీకరించేందుకే గణేశుడు, హనుమంతుడు ఇరువురూ శివాలయానికి ద్వారపాలకులుగా ఉంటారు.

## గణేశుడు ఎవరు? హనుమంతుడు ఎవరు?

గణనాయకుడు గణేశుడు, వరదాయకుడు హనుమంతుడు. వీరి యొక్క ఆదర్శములను జీవనసాధనలో భాగంగా చేసుకో లేకపోతే మహాదేవుని సాక్షాత్కారం, ఆత్మసాక్షాత్కారం ఏవిధంగా లభిస్తుంది? గణపతి అనగా గణేశుడు-బుద్ధికి, సమృద్ధికి అధిష్ఠానదేవత. ఈ రెండింటిని సరిగ్గా ఉపయోగించుకునేలా చేసే అధిదేవత కూడా ఆయనే. అదే ఆయన సిద్ధాంతము. అందుకు అవసరమైన గుణాలు ప్రతీకల రూపంలో ఆయన చేతిలోని ఆయుధములుగా ఉంటాయి. ఆయన చేతిలోని యమపాశము – ఆత్మనియంత్రణకు, కమలము-పవిత్రతకు, పుస్తకము-నిర్లేపతకు, ఉన్నతమైన, ఉదారపూరితమైన ఆలోచనా విధానమునకు, మోదకములు-మధుర స్వభావమునకు ప్రతీకలుగా చెప్పబడతాయి. ఆయన ఎలుక వంటి తుచ్ఛ జీవిని కూడా ఇష్టపడి ఆదరిస్తాడు. మన వ్యక్తిత్వములో కూడా అటువంటి గుణములు ఉంటేనే ఆత్మదర్శనమునకు – శివ దర్శనమునకు పాత్రులమని నిర్ధారించుకోవచ్చు.

హనుమంతుడు సేవ, సాధన, సంయమనము మరియు సదాచారములకు ప్రతీక. లోకహితము కొరకు తత్పరతతో సేవ చేయడం, సంయమనముతో ఉండడం ఆయన స్వభావం. ఆయనకు ఎక్కడా, ఎన్నడూ స్వార్థమనేదే లేదు. ఆయన ఎల్లప్పుడూ నిస్వార్థముతో, ఎటువంటి కోరికలు లేకుండా, నిష్కల్మషంగా ఉండే నిర్మలుడు. సతతము సాధనలో నిమగ్నుడై ఉంటూ సదాచారమును అనుష్ఠిస్తూ ఉంటాడు. ఆయన ఆచరణలో కానీ, సాధనలో కానీ ఎప్పుడూ ఎటువంటి లోపాలు, తప్పులు ఉండవు. 'రామ కాజ్ కీన్హే బినా మోహి కహా విశ్రామ్' (రామకార్యము చేస్తుండగా నాకు విశ్రాంతి అనేదే లేదు) అనేదే ఆయన మూలమంత్రము. రామకార్యములో హనుమంతుడు నిరంతరము నిమగ్నుడై అర్జునుని రథముపై విరాజమానుడై ధర్మము యొక్క విజయమును సునిశ్చితము చేస్తూ ఉంటాడు. ఆయన రామభక్తుడే కాదు రుద్రప్రియుడు, రుద్రాంశ కూడా. మన జీవితములో కూడా ఇటువంటి సద్గుణములు, శ్రద్ధ ఉంటే విశ్వ కళ్యాణమునకు హేతువైన ఆత్మదర్శనమునకు పాత్రులం కాగలుగుతాము.

గణేశుడు-హనుమంతుడు పెట్టే పరీక్షలలో ఉత్తీర్ణుడైన తరువాతనే సాధకునికి శివస్వరూపమైన ఆత్మసాక్షాత్కారము సంభవమౌతుంది. ఇంతచేసి కఠినమైన పరీక్షలలో ఉత్తీర్ణుడైన తరువాత అహంకారం వస్తుంది. అది సంభవమే. నేనున్నాను, నేను శ్రేష్ఠుడను, నేను పెద్దవాడిని అనే ఈ భావాలన్నీ ఆత్మ-పరమాత్మల కలయికలో ఆటంకాలుగా మారతాయి.

**భాండ శుద్ధిలేని వంట, లక్ష్యశుద్ధిలేని కార్యం సత్ఫలితాలనివ్వవు**

ఈ సత్యాన్ని గుర్తుచేయడానికే శివాలయ ప్రవేశద్వారము వద్ద ఉండే మెట్లు భూమి నుండి కొంచెం ఎత్తులో ఉంటాయి. ద్వారము కూడా కొంచెం చిన్నదిగానే ఉంటుంది. అనగా చివరి శివద్వారము వద్ద లోపలికి ప్రవేశించేప్పుడు అత్యంత వినమ్రతతో, సావధానముగా ఉంటూ తలవంచుకొని లోపలికి వెళ్ళాలి. సాధకునిలో అహంకారమనే అంధకారము ఎప్పుడు నశించిపోతుందో అప్పుడు లోపల, బయట అంతా శివ దర్శనమే జరుగుతుంది. అన్నీ మంగళకరంగానే కనిపిస్తాయి. పరమాత్మను పొందేందుకు ఆత్మబోధకంటే పవిత్రమైనది, ప్రకాశవంతమైనది మరేముంటుంది?

లోపలికి ప్రవేశించగానే కార్యమయమైన స్థూలజగత్తు, ఆలోచనలతో కూడిన సూక్ష్మజగత్తు బయటే వదిలివేయబడు తుంది. తనలో తానుగా, ఆ అంతరంగము యొక్క లోతులలో ఉండే ఆత్మానుభూతి ఏదైతే ఉందో అది వర్ణనలకు అందనిది, శివభావముతో కలిసిపోయి ఉండేది. శివాలయములో స్థాపించబడే శివలింగము- ఆత్మలింగము లేదా బ్రహ్మ లింగము. ఈ రూపంలో ఇక్కడ విశ్వకళ్యాణములో నిమగ్నమై ఉండే బ్రహ్మాకార రూపమైన, విశ్వకారణ రూపమైన పరమ ఆత్మ స్థాపించబడి ఉంటుంది. హిమాలయముల వంటి శాంతమైన, మహోన్నతమైన, శ్మశానము వంటి నిశ్శబ్దమైన, శివస్వరూపమైన ఆ ఆత్మ, భయంకర శత్రువుల మధ్య కూడా నిశ్చింతగా, ఆలోచన అనేదే లేకుండా ఉండగలుగుతుంది. ఆ స్థితిలో కాలరూపమైన సర్పమును మెడలో ధరించవచ్చు. మృత్యువును కూడా మిత్రునిగా మార్చుకోవచ్చు. కాలాతీతుడైన మహాకాలుడు అని పిలిపించుకోవచ్చు, జ్ఞాన-వైరాగ్యములను ధారణ చేయవచ్చు.

శివుని ద్వారా ధరించబడే కపాలము, కమండలములు – ఆయన పరమసంతోష స్వరూపుడని, తపస్వియని, అపరిగ్రహ వ్రతధారుడని స్పష్టం చేస్తాయి. ఆయన ధరించే చితాభస్మము- జ్ఞాన, వైరాగ్యములకు ప్రతిరూపం, నశించే స్వభావమున్న ఈ విశ్వములో దాగియున్న అవినాశితత్త్వమును పట్టు కోవడములో ఉండే రహస్యమును తెలియచేస్తుంది. డమరు నాదము-ఆత్మానందమును, నిత్యానందమును, ఆనందాను భూతిని స్పష్టం చేస్తుంది. ఆయన మెడలోని కాలనాగులు- కాలాతీతమైన సమాధిస్థితి భావమును వ్యక్తపరుస్తాయి.

త్రిదళములైన బిల్వపత్రాలు, త్రినేత్రము, త్రిపుండ్రము, త్రిశూలము-ఇవన్నీ ప్రకృతిలో ఉండే సత్వగుణము, రజో గుణము, తమోగుణము అనే మూడింటిని సమానముగాను, సంతులితముగాను చూసే భావమును వ్యక్తీకరిస్తాయి. ఇంతేకాదు చేతనత్వమును కలిగివున్న జీవులకుండే మూడు శరీరములు (స్థూల, సూక్ష్మ, కారణ శరీరములు) – త్రికాలములను దాటి (కాలాతీతస్థితి) అవతల ఉండే రహస్యమును బోధిస్తాయి. అంతఃకరణలో ఉండే భావావేశాలు, భావోద్వేగాలు శాంతస్థితిని పొంది శమనమును పొందేందుకై సాధకుడు భృకుటి స్థానములో ధ్యానమునుంచుతాడు. ఈ స్థానమునే త్రికుటి, ఆజ్ఞాచక్రము, అమృతకుంభము, బ్రహ్మకలశము, శివపార్వతుల యోగములకు స్థానముగా వర్ణిస్తారు. ఈ యోగశక్తిని పొందేందుకు అవసరమైన విధానాలన్నీ విభిన్న యోగశాస్త్రములలో చెప్పబడ్డాయి. వివేక శీలత యొక్క తృతీయనేత్రము అనగా సాధకునికి లభించే భవిష్యద్దర్శనము, అతీంద్రియశక్తి, కామదహనము వంటి సామర్థ్యములన్నింటికి కేంద్రము. జీవితములో ఉండే ఆంతరిక ఆవేశము, కోపము అన్నీ శివుని యొక్క రుద్రులే. వీటిని శమింపచేయడమే శివుని యొక్క కార్యము. త్రిమూర్తులు అనగా బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు కూడా ఈ మూడింటి పరిధిలోనే, మూడింటితో కలిసిన ప్రతీకలుగానే వర్ణించబడ్డారు. అ-ఉ-మ్ అనే ఈ మూడు అక్షరాల సమన్వయ రూపమైన ఏకాక్షరము 'ఓం' లో కూడా ఈ భావమే ఇమిడివుంది.

విశ్వకళ్యాణము కొరకు హాలాహలము, కాలకూట విషములను త్రాగి ప్రపంచములో జరిగే కోలాహలము లన్నింటికి దూరంగా ఉంటూ మృదంగము, శృంగము, ఘంట, డమరు, శంఖముల నినాదములో నిమగ్నుడై అనగా ఆత్మ స్థితుడై, బ్రహ్మలీనుడై ఉండాలనే శివుని సందేశము శివాలయములలో ప్రతీకల ద్వారా తెలియచేయబడుతుంది. శంఖము, డమరుకము మొదలైనవాటి ధ్వనులు యోగ సాధనలో ఉండే అనాహతనాదాన్ని సూచిస్తాయి. దీనిని 'నాద బ్రహ్మ' సాధనగా కూడా అర్థం చేసుకోవచ్చు. పరమేశ్వరునిపై అనవరతంగా కురిసే జలధార ఆయన శిరస్సుపై ఉండే గంగకు ప్రతీక. ఇదే జ్ఞానగంగ. స్వర్గములో ఉండే ఏ ఋతుంభరా ప్రజ్ఞను, దివ్యబుద్ధిని, గాయత్రీని లేదా త్రికాలసంధ్యను

**విజయానికి మూలం దృఢ సంకల్పం**

స్వయంగా బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు ఉపాసిస్తుంటారో అదే జ్ఞానగంగయైన గాయత్రి.

పరమేశ్వరుడు లింగరూపంలో ఉండే శివమయమైన ఆత్మ అయితే ఆయనకు నీడవలె ఉండే పార్వతి ఆ ఆత్మ యొక్క శక్తి. ఇందులోని రహస్యము ఏమిటంటే సర్వులకు కళ్యాణమును చేకూర్చడములో నిమగ్నమై ఉండే కళ్యాణమయమైన, శివమయమైన ఆత్మ యొక్క ఆత్మశక్తి సర్వకాల సర్వావస్థలలోను ఆయనను అనుసరించి ఉంటూ ప్రేరణనిచ్చే సహయోగినిగా ఉంటుంది. శివాలయంలో ఉండే జలధార ఉత్తరము వైపుకు పారుతుంది. ఉత్తరదిశలో ఉండే ధృవనక్షత్రము, ఉన్నతమైన లక్ష్యములకు ప్రతీక. శివమయమైన, కళ్యాణకరమైన ఆత్మ నుండి వెలువడే జ్ఞానప్రవాహము, ఆలోచనా ప్రవాహము ఎల్లప్పుడూ ఉన్నతమైన, స్థిరమైన లక్ష్యము వైపే మరలుతుంది. దాని లక్ష్యము ధృవనక్షత్రము వలె స్థిరంగా, అచంచలంగా ఉంటుంది. పురాతన శివాలయాలలో ఉత్తరపు ద్వారము మీద గంగామాత ప్రతిమ ఉంటుంది. దీనిని స్వర్గమునందుండే దివ్యబుద్ధి, ఋతుంభరా ప్రజ్ఞ, గాయత్రీల రూపంగా అనుభవములో తెలుసుకోవాలి. ఇది బ్రహ్మానందము నుండి అవతరించిన పరాచేతన.

శివునిపై అనవరతంగా కురిసే జలధార వలె శివునికి చేసిన అర్చన, ఆరాధనల ఫలితంగా బ్రహ్మాండీయ చేతనత్వము యొక్క అమృతధార ప్రభువు చూపించే కృపారూపంగా వర్షిస్తుంది. శివాలయము యొక్క స్వరూపము, అందులో ఉండే భిన్నభిన్న ప్రతీకలు, ఆధ్యాత్మిక సాధన యొక్క విభిన్న తత్త్వాలు, సత్యాలు, సోపానాలను గురించి మనకు తెలియ చేస్తాయి. మహాశివరాత్రి పర్వదినమునాడు వీటిన్నింటి గురించి తెలుసుకొని, అర్థం చేసుకొని ఆత్మతో అనుసంధానము చేసేందుకు ప్రయత్నిస్తూ మన వ్యక్తిత్వమును కూడా శివమయం చేసుకునేందుకు సంసిద్ధులమౌదాము.

మహాశివరాత్రివ్రతములో శివాలయములలోని ప్రతీకలతోపాటు మహాశివరాత్రికి కూడా విశేషమైన గొప్పతనం ఉంది. శాస్త్రములలో దీనిని 'మహారాత్రి' అని చెప్పారు. ఈ మహారాత్రి నాడు చేసే శివుని అర్చన-ఆరాధనల వల్ల జీవనచేతన ఊర్ధ్వగామిగా మారుతుంది. ఈ విరాట్ బ్రహ్మాండంలో సృష్టి మరియు ప్రళయములకు చెందిన సుదర్ఘీ ప్రవాహములు ఉంటాయి. అందువల్ల శాస్త్రములలో పగలు, రాత్రులను సృష్టికుండే నిత్య ప్రళయములని చెప్తారు. ఏకత్వము నుండి అనేకము వైపుకు, కారణము నుండి కార్యము వైపుకు వెళ్ళడాన్నే సృష్టి అంటారు. ఇందుకు వ్యతిరేకంగా అనేకము నుండి ఏకత్వము వైపుకు, కార్యము నుండి కారణము వైపుకు వెళ్ళడాన్నే ప్రళయము అంటారు. పగలంతా మన మనస్సు, ప్రాణము, ఇంద్రియములు అన్నీ ఆత్మచేతన నుండి బాహ్య ప్రపంచము వైపుకు నడుస్తుంటాయి. తిరిగి రాత్రి కాగానే తమ పనులను, విషయములను వదిలివేసి ఆత్మవైపుకు, అనేకత్వమును వదిలి ఏకత్వము వైపుకు, శివత్వము వైపుకు మరలుతాయి.

పగలు చేతనా ప్రవాహము కారణము నుండి కార్యము వైపుకు ప్రవహిస్తుంది. తిరిగి రాత్రి కాగానే కార్యము నుండి కారణములోనికి వచ్చేస్తుంది. ఇందువల్లనే పగలును-సృష్టికి, రాత్రిని-ప్రళయమునకు ప్రతీకలుగా చెప్పారు. నేతి-నేతి అనే ప్రక్రియ ద్వారా సమస్త ప్రపంచము, భూతముల ఉనికిని తొలగించి వేసి పరమాత్మ నుండి ఆత్మసమాధానము పొందే సాధనయే మహాశివరాత్రి రోజున చేసే మహారాత్రి సాధన. అందువల్లనే మహాశివరాత్రి నాడు రాత్రియే ముఖ్యకాలము, అనుకూల సమయము. ప్రకృతి యొక్క సార్వభౌమిక ప్రేరణతో ఆ సమయములో భక్తి సాధన, యోగ సాధన, ఆత్మ నివేదన, ఏకాత్మతానుభూతి అనేవి సహజంగానే సుందరంగా మారతాయి. వీటి యొక్క ఆధ్యాత్మిక అనుభవాలు మహాకాలుని యొక్క యుగపరివర్తన, ప్రత్యావర్తన లీలలకు దగ్గరగా ఉంటాయి. ఈ అనుభూతిని మా పరిజనులు ఈ మహాశివరాత్రి పర్వదిన సందర్భంగా అవశ్యము పొందాలని ఆశిస్తున్నాము.


*- అఖండజ్యోతి, ఫిబ్రవరి 2015*
*అనువాదం: శ్రీమతి వల్లీశ్రీనివాస్*


**యుగశక్తి గాయత్రి**
**మాస పత్రిక చదవండి !**
**చదివించండి !!**


**పిరికివాడు నిరంతరం మరణిస్తాడు - ధైర్యవంతుడు ఒకేసారి మరణిస్తాడు**

# స్ఫూర్తిదాయక గాయత్రీ పరివార్ సభ్యులు - 11

## కొమ్మి తిరుపతినాయుడు, నెల్లూరు



శ్రీమతి & శ్రీ కొమ్మి రమణమ్మ – రామానాయుడు దంపతులకు జూన్ 1967లో కాకివాయి గ్రా॥, చేజర్ల మం॥, నెల్లూరు జిల్లాలో శ్రీ కొమ్మి తిరుపతి నాయుడు (కె.టి.నాయుడు) జన్మించారు. ప్రాథమికవిద్యను కాకివాయి గ్రామంలో పూర్తిగావించుకొని, తదుపరి ఉన్నత పాఠశాల విద్యను కలువాయిలో, న్యాయశాస్త్ర విద్యను నెల్లూరులో పూర్తి చేశారు. వీరిది వ్యవసాయ కుటుంబం.

1995 ప్రాంతంలో పూజ్యులు డాక్టర్ మారెళ్ళ శ్రీరామకృష్ణ మాష్టారి ప్రసంగాల పట్ల ఆకర్షితులై కాకివాయి గ్రామ పొలిమేరలలో (ఆనాడు దుర్వాస మహాముని తపస్సు చేసిన తపస్థలిలో) నిర్మాణంలోనున్న ఆశ్రమ నిర్మాణంలో ప్రముఖ పాత్రను పోషించారు.

ఆశ్రమ స్థలదాత అయిన శ్రీ సునందనరావుగారు వృత్తి రీత్యా నీటిపారుదల శాఖలో ఇంజనీయరుగా పనిచేస్తూ కాకివాయిలో నివాసముంటున్నారు. వీరితో శ్రీ కె.టి.నాయుడు గారికి సాన్నిహిత్యం పెంపొందింది. అటుపిమ్మట మన నాయుడుగారు చిన్న చిన్న కాంట్రాక్టు పనులు చేపట్ట నారంభించారు. తదుపరి సునందరరావుగారితో కలసి, మాష్టారి ఆధ్యాత్మిక తరగతులకు, ప్రసంగాలకు హాజరు కాసాగారు. కె.టి.నాయుడుగారిలో నిక్షిప్తమై అంతరంగంలో దాగి ఉన్న ఆధ్యాత్మిక భావనల పసిగట్టిన మాష్టారు, వానిని క్రమక్రమంగా నిదురలేపసాగారు. దీనికి యువకుడైన నాయుడు బాగా స్పందించి, తనలోని ఆధ్యాత్మిక భావాలకు, నమ్మకాలకు మరింత మెరుగులు దిద్దుకొనసాగారు. దీనిలో భాగంగా అను నిత్యం, రాత్రి నిద్రకు ఉపక్రమించేవేళ భగవద్గీత ప్రవచనాలను వింటూ నిదురించుట అలవాటుగా మారింది. ఒకవైపు తన భౌతిక సంపదల ఎదుగుదలకు కృషిచేస్తూ, ఆధ్యాత్మిక సంపత్తిని మాష్టారి సంపర్కంతో పెంపొందించు కొనసాగారు. దీనిని గమనించిన మాష్టారు నాయుడుగారి భుజం తట్టి తగు రీతిలో మార్గదర్శనం చేస్తుండగా నాయుడు గారికి మాష్టారి పట్ల, గాయత్రి పట్ల మరింతగా విశ్వాసం దృఢతరం కాసాగింది. సునందనరావుగారితో కలసి కాకివాయిలోని ఆశ్రమ నిర్మాణం పట్ల మరింత శ్రద్ధ వహించి తన తన్, మన్, ధనాన్ని వెచ్చించి, త్వరితగతిన ఆశ్రమ నిర్మాణానికై శక్తికి మించిన సహాయ సహకారాలను అందిస్తూ పూజ్యగురుదేవుల పొలంలో తన చిన్న నాటనే నాటుకున్నారు శ్రీ నాయుడు. ఈ విధంగా మాష్టారి ఆదేశానుసారం స్మర్తుగామి సిద్ధక్షేత్రం (కోరినంతనే కోరికల తీర్చెడి) నిర్మాణానికి తన పూర్తి సహకారాన్ని అందించారు. అటు తరువాత అఖండ ధుని, అన్నపూర్ణాలయం, నక్షత్రశాల, సప్తర్షి కుటీరం, శ్రీ మహాకాళేశ్వరాలయం మున్నగువాని నిర్మాణంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా మాష్టారి ఆశీస్సులతో శ్రీ నాయుడు పాల్గొనుట జరిగింది.


మధ్య మధ్యలో హరిద్వార్‌లోని శాంతికుంజ్ ఆశ్రమాన్ని మాష్టారి ఆదేశానుసారం పూజ్యగురుదేవులు, మాతాజీలను సందర్శించి, వారి ఆశీస్సుల గూడ పొందుట జరిగింది. ఈ ఆధ్యాత్మిక పయనంలో తన భౌతిక జీవితంలో అనేకానేక ఆర్థిక ఒడిదుడుకులకు లోనైనారు. 1997లో 2కోట్ల రూపాయల వ్యాపార టర్నోవర్‌తో ప్రారంభమైన జీవనం, నేడు 2013 నాటికి 24 కోట్లు (గాయత్రీమంత్రంలోని అక్షర సంఖ్యకు) స్థాయిని చేరుకుంది. అనేకానేక గాయత్రీ హవన యజ్ఞాలు మరియు దీపయజ్ఞాలు చేస్తూ, 1008 కుండముల గాయత్రీ హవన యజ్ఞాన్ని కాకివాయి ఆశ్రమ ప్రాంగణంలో పూర్తి చేయుట వీరికి ఆనందదాయకం.

సమాజసేవలో భాగంగా కాకివాయి గ్రామంలో 5 వేల లీటర్ల మినరల్ నీటిని తయారు చేసెడి త్రాగునీటి పారిశుద్ధ యంత్రాలను స్థాపించి కాకివాయి మరియు చుట్టుప్రక్కల గ్రామాలకు త్రాగునీటిని అందించుటలో తన సహాయ సహకారాలను గ్రామస్తులకందించిన సమాజసేవకుడు మన నాయుడు.

వీరికి వీరి కుటుంబానికి ఆ గాయత్రీమాత మరియు పూజ్య గురుయుగ్మం తమ ఆశీస్సులను అందించి కాచి కాపాడమని యుగశక్తి గాయత్రి ప్రార్థిస్తున్నది.

**జీవితంలో సవాళ్ళు ఎదురవడం సహజం**

## శ్రీ బిజ్జుల హనుమంతరెడ్డి &
## శ్రీమతి ప్రమీల దంపతులు, హైదరాబాద్



శ్రీ బిజ్జుల రామిరెడ్డి-పుల్లమ్మ దంపతు లకు, 1938, జూన్ 24న పామాపూర్ గ్రా॥, కొత్తకోట మం॥, మహబూబ్‌నగర్ జిల్లాలో శ్రీ హనుమంతరెడ్డిగారు రెండవ సంతానంగా జన్మించారు. వీరిది వ్యవసాయ కుటుంబం. 11వ తరగతి వరకు వనపర్తిలోను, తదుపరి ఎమ్.ఎ. వరకు హైదరాబాద్ నగరంలో చదివారు. అటు పిమ్మట న్యాయశాస్త్రంలో ఉస్మానియా నుండి పట్టాను పొంది, న్యాయవాదిగా హైకోర్టులో పేరు నమోదు చేయించుకొన్నారు.

1958లో కుమారి ప్రమీలాదేవిగారితో వివాహం జరిగింది. సహధర్మచారిణిగా ప్రమీలాదేవిగారు జీవితంలో ప్రవేశించగానే హనుమంతరెడ్డిగారు జీవితం చక్కని మలుపు తిరిగి పురోగమన దిశలో పయనించసాగింది. ఉద్యోగం పురుష లక్షణం స్ఫూర్తితో రెడ్డిగారు ప్రభుత్వ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విద్యా శాఖలో ఉద్యోగిగా ప్రవేశించారు. అంచెలంచెలుగా ఎదుగుచూ, జిల్లా అధికారి స్థాయికి చేరుకొనెడి సమయంలో, బి.ఇడి డిగ్రీ అవసరాన్ని గుర్తించి దీనిని కూడా పూర్తి చేశారు.

ఆ తరువాత 1977లో జిల్లా ఎడ్యుకేషన్ అధికారిగా పదోన్నతిని పొంది కృష్ణా జిల్లాలో సుదీర్ఘకాలం పనిచేశారు. 1994లో పదవీ విరమణ చేసి, హైదరాబాద్ నగరంలోని సంజీవరెడ్డినగర్‌లో స్థిరనివాసాన్ని ఏర్పాటు చేసికొని విశ్రాంత జీవనానికి శ్రీకారం చుట్టారు.

శ్రీ హనుమంతరెడ్డిగారి సతీమణియైన శ్రీమతి ప్రమీలా దేవి గారికి ఆధ్యాత్మిక చింతన మెండు. ఆమె తమ సమయాన్ని ఎక్కువగా పూజా పునస్కారాలలో గడుపుచూ, సామూహిక కార్యక్రమాలలో పాలుపంచుకొంటూ ఉంటారు. ఈ రీతిగా ఆమె వారి ఇంటికి సమీపంలోనున్న అప్పటి గాయత్రీ చేతనా కేంద్రాన్ని తరచుగా సందర్శిస్తూ, తన భర్తయైన రెడ్డిగారిని కూడా కేంద్రానికి తీసికొని వెళ్ళుట జరిగేది. ఈ విధంగా శ్రీ రెడ్డిగారు గాయత్రీ ఉపాసన, యజ్ఞాల పట్ల అభిరుచిని పెంచుకొని పదుల సంఖ్యలో యజ్ఞాల నిర్వహణలో పాలు పంచుకొన్నారు. వీరి స్వగ్రామంలోని పరిజనులకు కూడా గాయత్రీ ఉపాసనా విశిష్టతల తెలియజేస్తూ విస్తృత ప్రచారాన్ని చేపట్టి, గురుదేవుల ఆలోచనా సరళిని నలుచెరగులా వ్యాప్తి చేశారు.

2001 తిరుపతిలో జరిగిన అశ్వమేధ యజ్ఞంలో తమ బంధుమిత్రులు అనేకమంది పాల్గొనేలా స్ఫూర్తిని అందించారు. శ్రీమతి ప్రమీలా హనుమంతరెడ్డిగారు, గాయత్రీ మహిళా మండలి ఇతర సభ్యులతో కలసి ఎస్.ఆర్.నగర్ హైదరాబాదు లోని దాసారం బస్తీలోని ఆంజనేయస్వామిగుడిలో గాయత్రీ ప్రజ్ఞామండలిని ప్రారంభించి, గాయత్రీ దీపయజ్ఞాలు, హోమాలు, సంస్కారాలు చేయిస్తూ పూజ్య గురుదేవుల ఆలోచనా సరళిని మరింతగా ప్రజలకు చేరువలోనికి తెచ్చారు.

2002లో శ్రీ హనుమంతరెడ్డిగారు విద్యార్థుల వికాసానికై, వారిని మంచి సంస్కారవంతులనుగా చేసెడి దిశలో తన శ్రీమతి గారితో పోటీగా తన వంతు కృషిలో భాగంగా భారతీయ సంస్కృతి జ్ఞాన పరీక్షలు అన్ని తరగతుల పాఠశాల విద్యార్థులకు నిర్వహిస్తూ, బాలల సంస్కరిస్తూ అవిరళ కృషి సల్పారు.

పరమపూజ్య పండిత శ్రీరామశర్మ ఆచార్యుల కార్యక్రమాలలో తన పేరుకు తగిన రీతిలో నేటియుగానికి తగిన రీతిలో హనుమంతునిలా తన సేవలనందించారు.

తన జన్మస్థలమైన పామాపూర్‌లోని గ్రామప్రజలు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషుల ప్రోత్సాహం, సహాయ సహకారాలతో గాయత్రీ మందిర నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. దేవాలయ పనులు అతి శ్రీఘ్రగతిన సాగిస్తూ నిర్మాణం ముగింపు దశకు చేరినది. గాయత్రీమాత విగ్రహము ప్రతిష్టించుటకై ఏర్పాట్లు చురుకుగా జరుగుచున్నాయి.

అట్టి శ్రీ హనుమంతరెడ్డి ప్రమీలాదేవి దంపతులకు, చక్కని ఆయురారోగ్యములు ప్రసాదించి వారు చేపట్టిన ప్రజోపయోగ కార్యక్రమాలు శ్రీఘ్రగతిన పూర్తి కావలయునని ఆ గాయత్రీ మాతను, పూజ్యగురుయుగ్మాన్ని ప్రార్థించుచున్నాం.

**ప్రతి సవాలును ఒక పాఠంగా స్వీకరించాలి**

వార్తలు

# రాష్ట్రంలో జరిగిన వివిధ కార్యక్రమాలు

## కర్నూలు జిల్లాలో

06.12.2014న పోలకల్లు రంగయ్యగారి ఆధ్వర్యంలో కర్నూలు జిల్లా రంగాపురంలోని సద్గురు నారాయణ గురుదేవుల ఆశ్రమములో దత్త జయంతి సందర్భముగా 18 కుండీల గాయత్రీ మహాయజ్ఞము యుగశిల్పి శ్రీ వేంకటేశులుగారు మరియు శ్రీమతి రమామణిగార్లచే నిర్వహించబడినది. 108 కలశములతో కలశయాత్ర కనువిందుగా సాగింది. గాయత్రీ యజ్ఞములో 1200 మంది పాల్గొన్నారు.

## బెంగుళూరులో

21.12.2014న శ్రీ రామచంద్రమూర్తిగారు మరియు శ్రీ ముద్దన్నగుప్తాగార్ల సహకారంతో బెంగుళూరులోని, ఓంకారేశ్వర మందిరములో దీపయజ్ఞ కార్యక్రమము శ్రీమతి రమామణి వెంకటేశులుగారి ద్వారా నిర్వహించబడినది. ఇందులో 400 మంది మొదటిసారిగా గాయత్రీ పరివారముతో పరిచితులయ్యారు. రూ.350/- విలువగల గురుదేవుల సాహిత్యము విక్రయించబడినది.

## సిరిసిల్లలో

24.01.2015 శుక్రవారం వసంత పంచమి సందర్భంగా కరీంనగర్ జిల్లా సిరిసిల్లలోని బి.వై.నగర్ శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో సిరిసిల్ల తంగళ్ళపల్లి గాయత్రీ పరివార్ సభ్యుల ఆధ్వర్యంలో పంచకుండీ గాయత్రీ మహాయజ్ఞం నిర్వహించ బడినది. సుమారు 100 మంది ఈ యజ్ఞ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## వైజాగ్‌లో

23.01.2015 శుక్రవారం వసంత పంచమి సందర్భంగా గాయత్రీ పరివార్ ప్రజ్ఞామండలి, వైజాగ్ వారిచే అక్కయ్య పాలెం, 80 అడుగుల రోడ్ జంక్షన్‌లోని పతంజలి యోగ కేంద్రం ఆవరణలో 24 కుండముల గాయత్రీ యజ్ఞము నిర్వహింపబడింది. 22వ తేది కలశయాత్ర, 23వ తేది యజ్ఞం జరిగింది.

అల్లే దీనికి పూర్వం 10.01.2015న మాధవధార వైజాగ్‌లో గల గ్రీన్ వ్యాలీ గృహ సముదాయమందు, శ్రీ వెంకటేశ్వర ఆలయ సమీపంలో గాయత్రీ పరివార్ ప్రజ్ఞా మండలి, వైజాగ్‌వారి సారథ్యంలో దీపయజ్ఞము నిర్వహింప బడింది. పూజ్యులు గౌడ్‌జీగారు, శాంతికుంజ్ విశిష్ట ప్రతినిధి ఆహుతులను ఆశీర్వదించారు.

తదుపరి రోజు 11 జనవరి 2015న నావికాదళ, విశాఖ పట్నం విభాగం వారు ప్రతి ఏటా నిర్వహించెడి 54 కుండముల గాయత్రీ యజ్ఞము, నౌకావిభాగ ప్రాంగణమందు నిర్వహించారు. దీనిలో డా॥ బ్రిజ్‌మోహన్‌గౌడ్‌జీగారు ప్రవచించి ఆహుతులను ఆశీర్వదించారు.

## మతవిశ్వాసాలకతీతంగా విశ్వాసమే ఆధారంగా ఫలితాలనిచ్చెడి గాయత్రీ సంస్కారాలు

*113 తాళ్ళూరు గ్రా॥, ఫిరంగిపురం మం॥, గుంటూరు జిల్లా నివాసి అయిన షేక్ రహీమ్, ఖాసింబి దంపతులు 08.02.2015న నారాకోడూరులోని గాయత్రీశక్తిపీఠం నందు పుంసవన సంస్కారమును చేయించుకొన్నారు. రహీం వృత్తిరీత్యా వైద్యుడు (ఆర్.ఎమ్.పి.) అతని భార్య హిందూ సంస్కారాల పట్ల ప్రభావితురాలై భర్తను ఒప్పించి ఈ పుంసవనసంస్కారమును చేయించుకొన్నచో మంచి గుణవంతులైన సంతానాన్ని పొందుటకు అవకాశము ఉన్నదని గాయత్రీశక్తిపీఠమునకు రావటం జరిగింది. ఆరోజు భార్యాభర్తలిరువురు యజ్ఞంలో పాల్గొని పూజ్య గురుదేవులు అందించిన సంస్కారం యొక్క ఉద్దేశ్యాన్ని తెలుసుకొని అత్యంత ప్రభావితులైనారు. ఈ సందర్భంగా ఖాసింబి మాట్లాడుతూ తన హిందూమత స్నేహితురాండ్రు ఈ సంస్కారమును చేయించుకొని ఉత్తమ సంతతిని పొందినారని విని తాను కూడా అదే రీతిలో గుణవంతులైన సంతానాన్ని పొందవలెననెడి తీవ్ర కాంక్షతో ఇచ్చటికి వచ్చుట జరిగినదని తెలిపినది.*

**భౌతిక సంపదలు తృప్తినివ్వజాలవు**

# సంస్మరణ - శ్రద్ధాంజలి



**జననం:**
**జూన్,1946**

## కీ॥శే॥ తాతా కృష్ణమూర్తి, ఎమ్.ఎస్.సి.

**మరణం:**
**26.01.2015**

*శ్రీ తాతా కృష్ణమూర్తిగారు 1946లో గోగినేనివారిపాలెం గ్రామం, పొదిలి తాలుకా, ప్రకాశం జిల్లాలో వెంకట్రావు-రంగమ్మ దంపతులకు జన్మించారు. ఆంధ్రా విశ్వవిద్యాలయం నుండి ఎమ్.ఎస్సీ భౌతికశాస్త్రంలో పట్టాను పొందారు. 1969లో వెంకటసుబ్బమ్మగారితో వివాహం జరిగింది. 1970 నుండి 2003 వరకు ఉపాధ్యాయ వృత్తిలో స్థిరపడి 2003లో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పదవీ విరమణ చేశారు. కుమారుడైన నాగేశ్వరరావు సాఫ్ట్‌వేర్ ఇంజనీయర్‌గా హైదరాబాదులో పనిచేస్తుండగా తన విశ్రాంత జీవితాన్ని కుమారుని వద్ద గడుపుటకై భార్యతో వచ్చి హైదరాబాదులో స్థిరపడ్డారు. విశ్రాంత జీవితాన్ని స్నేహితుల మధ్య, టి.వి.ల మధ్య గడుపుతున్న సమయంలో 2008లో అర్ధాంగిని కోల్పోవుటతో కృష్ణమూర్తిగారి చూపు ఆధ్యాత్మికత వైపు మరలింది. బంధువు ద్వారా గాయత్రీ చేతనాకేంద్రాన్ని దర్శించుట జరిగింది. క్రమక్రమంగా ఆయన దృష్టి యజ్ఞయాగాదులపై మరలింది. సత్సంగాలలో పాల్గొనుట ద్వారా తన మనస్సును భక్తి జ్ఞాన వైరాగ్యాల దిశగా మరల్చారు. కాలక్రమంలో ఆయన గాయత్రీయజ్ఞం పట్ల, మందిరం పట్ల పూర్తిగా ఆకర్షితులై గాయత్రీ చేతనా కేంద్రానికి తన సమయాన్ని ఇచ్చుట ద్వారా తన సేవలను 2008 నుండి అందించసాగారు. కృష్ణమూర్తిగారు అత్యంత మితభాషి, క్రమశిక్షణకు మారుపేరు. సమయసంయమనం, ఆర్థికసంయమనం, ఆలోచనా సంయమనం ఆయన సొత్తు. పూజ్యగురుదేవులు పండిత శ్రీరామశర్మ ఆచార్య మార్గాన్ని మనోవాక్కాయకర్మల సాక్షిగా అనుసరించిన ఆదర్శవాది. తన వానప్రస్థ జీవితాన్ని అర్థవంతంగా జీవించిన మానవజన్మ లక్ష్యసాధకుడు.*

*అంశదానాన్ని కూడా అత్యంత ప్రతిభావంతంగా ఆచరించి చూపిన గాయత్రీ ముద్దు బిడ్డ. మాట కరకు, కానీ మనస్సు సుతిమెత్తనిది. కాషాయరంగు వస్త్రధారణతో ఉ॥ 6 గంటలకల్లా యజ్ఞశాలకు చేరుకొని యజ్ఞకుండాలు ఏర్పాటు చేసి, సమయానికి కచ్చితంగా యజ్ఞాన్ని నిర్వహింపచేసెడివారు. యజ్ఞం పూర్తి అయిన తరువాత, మందిరంలో హారతి పూర్తిచేసిన తదుపరి మాత్రమే ప్రసాదాన్ని స్వీకరించెడివారు. శరీరాన్ని దైవమందిరంగా భావించండి అనెడి పూజ్య గురుదేవుల మాట ఆయనకు అవశ్యం శిరోధార్యం. దీనికై నెలానెలా క్రమం తప్పకుండా మెడికల్ చెకప్ చేయించుకునేవారు. శ్రమించుట, శ్రమను గౌరవించుట ఆయన ప్రత్యేకత. వీరు 26.01.2015 రథసప్తమిరోజున సోమవారం ఉత్తరాయణ పుణ్యకాలమందు పరమపదించుట వీరి పవిత్ర జీవనానికి ప్రతిఫలంగా నిలచింది.*

*వీరికి సద్గతిని చేకూర్చాలని ఆ గాయత్రీమాతను పరమపూజ్య గురుయుగ్మాన్ని గాయత్రీ చేతనాకేంద్రం వారు ప్రార్థించుచున్నారు.*

**సద్గుణ సంపదలు తృప్తినిస్తాయి**